ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


మమ్మల్ని ఉద్యోగులుగా గుర్తించండి
ఢిల్లీలో మహిళా గిగ్ వర్కర్ల నిరసన 05

రాజ్యాంగాన్ని పాటించలేకపోతే భారత్ విడిచి వెళ్లిపోండి


సంపుటి 09, సంచిక: 67 | బుధవారం | 04-02-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## మున్సిపల్ ప్రచారం
# మిర్యాలగూడలో నేడు సిఎం సభ

- ఎన్నికలపై మంత్రులు, పిసిసి చీఫ్, ఇన్‌చార్జితో సమీక్షించిన ముఖ్యమంత్రి
- రెబల్స్‌ను దారిలోకి తేవాలి
- ఒక్క ఓటునూ నిర్లక్ష్యం చేయవద్దని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో పాటు బీఫారమ్ అందజేత కార్యక్రమాలు కూడా పూర్తయిన నేపథ్యంలో ఇప్పటికే అభ్యర్థుల తరపున జోరుగా కొనసాగుతున్న ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలకు దిశానిర్ధేశం చేశారు. అందులో భాగంగా తాను 4వ తేదీన నల్లగొండ జిల్లా నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం 116 మున్సిపాలిటీలకు, 7 కార్పొరేషన్లకు ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. వారం రోజుల పాటు ప్రచారం నిర్వహించుకునేందుకు అవకాశం ఉండడంతో ప్రచార వ్యూహాలకు పదును పెట్టాలని సిఎం సూచించారు. బుధవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో సిఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నట్లు తెలిపారు. రూ.200 కోట్లతో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేయనున్నారు. మహిళా సంఘాలకు చెక్కులను సిఎం పంపిణీ, అనంతరం బహిరంగ సభలో సిఎం పాల్గొనన్నురు. ఇదిలా ఉండగా మున్సిపల్ ఎన్నికలు, తాజా రాజకీయ పరిణామాలపై మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జి మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులతో సమాలోచనలు చేశారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి తరువాయి 2లో

## బరిలో 12,993 మంది..

నామినేషన్‌ల ఉపసంహరణ తరువాత రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల బరిలో 12,993 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మంగళవారం గడువు ముగిసే సమయానికి 6,701 నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. కాగా, బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల అధికారులు బుధవారం నాడు ఎన్నికల గుర్తులను కేటాయించనున్నారు.

## అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం
# ప్రతిపక్షాలు ఫైర్



- పార్లమెంట్ లోపల, వెలుపల ఆందోళనలు
- అమెరికా ఒత్తిడితో మోదీ వణికిపోయారని విమర్శలు
- రైతుల కష్టాన్ని, దేశాన్ని ప్రధాని అమ్మేశారని రాహుల్ గాంధీ ధ్వజం
- ఒప్పందాన్ని ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్‌గా అభివర్ణించిన మోదీ
- ఒప్పందం పూర్తి స్వరూపంపై త్వరలోనే భారత్ – అమెరికా సంయుక్త ప్రకటన చేస్తాయని మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి
- రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

**న్యూఢిల్లీ :** అమెరికా–భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందానికి అంగీకారం కుదరడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. పార్లమెంట్ లోపల, వెలుపల మోదీ సర్కార్‌పై ధ్వజమెత్తాయి. అమెరికా ఒత్తిడితో ప్రధాని మోదీ వణికిపోయారని ఆరోపించాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ రాజీపడ్డారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అయితే భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని ఈ శతాబ్దపు గొప్ప ఒప్పందంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. కాగా సోమవారం రాత్రి ప్రధాని మోదీతో ఫోన్‌లో చర్చలు జరిపిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకారం తెలిపినట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. అమెరికాపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని ట్రంప్ తెలిపారు. భారత్‌పై విధించిన ప్రతీకార సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు.



**రైతుల కష్టాన్ని, దేశాన్ని అమ్మేశారు : రాహుల్ గాంధీ**

అమెరికా–భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందం ద్వారా ప్రధాని మోదీ రైతుల కష్టాన్ని, దేశాన్ని అమ్మేశారని ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని అన్నదాతలు అర్థం చేసుకోవాలని రాహుల్ పిలుపునిచ్చారు. అదానీపై అమెరికాలో కేసు, ఎప్‌స్టీన్ ఫైల్స్ కారణంగానే ప్రధాని రాజీపడ్డారని విమర్శించారు. ఈ విషయాలు దేశ ప్రజలకు తెలియకుండా ఉండేందుకు లోక్‌సభలో మొదటిసారి ప్రతిపక్షనేత (తన) ప్రసంగాన్ని అధికార పక్షం అడ్డుకుందని రాహుల్ ఆరోపించారు. భారత జాతీయ ప్రయోజనాల విషయంలో ప్రధాని మోదీ రాజీపడ్డారని దుయ్యబట్టారు. లోక్‌సభ నుంచి బయటకు వచ్చిన అనంతరం పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ 4 నెలలుగా ఆగిపోయిన ఒప్పందం సాయంత్రానికి ఎలా జరిగిందని ప్రతిపక్ష రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ప్రధాని మోదీపై తీవ్రమైన ఒత్తిడి ఉందన్నారు. 'అమెరికా ఒత్తిడితో ప్రధాని మోదీ వణికిపోయారు. అమెరికాకు మోదీ మన దేశాన్ని అమ్మేశారు. నాలుగు నెలలుగా నిలిచిన ఒప్పందంపై అకస్మాత్తుగా సోమవారం రాత్రి మోదీపై తీవ్ర ఒత్తిడి వచ్చింది. అమెరికా ఒత్తిడితోనే ఒప్పందంపై మోదీ రాజీపడ్డారు. ప్రజల కష్టార్జితాన్ని మోదీ అమెరికాకు దోచిపెట్టారు. నరేంద్ర మోదీ ఇమేజ్‌ను వేలాది కోట్ల రూపాయలు వ్యయం చేసి తీర్చిదిద్దారు. అందుకే మన ప్రధాని రాజీపడాల్సి వచ్చింది. ఎవరు చేశారు? ఎలా చేశారు? అనేది దేశప్రజలు ఆలోచించాలి అని కోరారు.

**అందుకే మోదీ రాజీ :** 'అదానీపై అమెరికాలో ఓ కేసు ఉంది. వాస్తవానికి ఆ కేసు మోదీపై పెట్టాల్సిన కేసు. వారు అదానీని తరువాయి 2లో



# విపక్ష సభ్యుల సస్పెన్షన్

- మాజీ ఆర్మీచీఫ్ నరవణే పుస్తకంలోని విషయాలను ప్రస్తావించడానికి యత్నించిన రాహుల్ గాంధీ
- అనుమతి ఇవ్వని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- కాంగ్రెస్ సభ్యుల తీవ్ర అభ్యంతరం
- సభలో గందరగోళం
- కాగితాలు చింపి విసిరి సభ్యుల నిరసన



సస్పెండైన తెలంగాణ కాంగ్రెస్ ఎంపి చామల

**న్యూఢిల్లీ :** లోక్‌సభలో మరోసారి తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యుల ఆందోళనలతో సభ కార్యకలాపాలు మంగళవారం పూర్తిగా స్తంభించాయి. స్పీకర్ చైర్‌పై నిరసన వ్యక్తం చేస్తూ కొందరు సభ్యులు కాగితాలు చించి విసరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారిం ది. ఆ ఘటనపై కఠినంగా స్పందించిన స్పీకర్ మొత్తం బడ్జెట్ సమావేశాల కాలానికి ఎనిమిది విపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం పలు సార్లు వాయిదాల అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు సభ మళ్లీ సమావేశమైంది. ఆ సమయంలో చైర్‌లో ఉన్న ఎంపి దిలీప్ సైకియా సభను ప్రారంభించగానే విపక్ష సభ్యులు నిరసనలు చేపట్టారు. నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లిన కొందరు సభ్యులు పత్రాలు చించి స్పీకర్ వైపు విసరడం కలకలం రేపింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు ఎనిమిది మంది కాంగ్రెస్ సభ్యులను గుర్తించారు. సస్పెండ్ అయిన వారిలో ఎంపిలు హిబీ తరువాయి 2లో

## తుది దశలో ఒప్పందం : పీయూష్ గోయల్

వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాల ప్రయోజనాలకు ఎలాంటి రాజీ లేకుండా అమెరికాతో భారత్ అత్యుత్తమ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుందని వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఒప్పందం తుది దశలో ఉందని, పూర్తి స్వరూపంపై త్వరలోనే భారత్–అమెరికా సంయుక్త ప్రకటన చేస్తాయని చెప్పారు. అమెరికాతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వాణిజ్య ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం కుదుర్చుకున్నారని గోయల్ తెలిపారు.

## చమురు కొనుగోళ్లు నిలిపివేస్తామని భారత్ చెప్పలేదు : రష్యా

అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై క్రెమ్లిన్ స్పందించింది. న్యూఢిల్లీ నుంచి ఇంతవరకూ అలాంటి సంకేతాలేవీ తమకు రాలేదని పేర్కొంది. భారత్‌తో తమకు విలువైన సంబంధాలు ఉన్నాయని, ఇరు-దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగ్యస్వామ్యం కొనసాగుతుందని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు.

# కబళించిన మృత్యువు



నలుగురు మహిళలు దుర్మరణం

- కూలీకి వెళ్లి తిరిగి వస్తుండగా చెరువులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్
- జగిత్యాల జిల్లాలో ముగిలిపేట గ్రామంలో ఘటన

ప్రజాపక్షం /మల్లాపూర్

జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన జిల్లాలోని మల్లాపూర్ మండలంలోని ముగిలిపేట వద్ద చోటుచేసుకుంది. కొందరు వ్యవసాయ కూలీలు.. పసుపు కోతకు వెళ్లి వస్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురు కూలీలు గాయపడ్డారు. సమాచారం తరువాయి 12లో

# వినూత్న వ్యవసాయ విధానాలు అనుసరించాలి

- రైతులను అధికారులు ప్రోత్సహించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచన
- 'రైతు నేస్తం' వేదిక మరింత బలోపేతం కావాలని ఆకాంక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్

వినూత్న వ్యవసాయ విధానాలను మరింత మంది రైతులు అనుసరించే విధంగా అధికారులు ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు 'రైతు నేస్తం' వేదిక మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. 'రైతునేస్తం' కార్యక్రమంలో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మంగళవారం ముఖాముఖిగా ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలకు చెందిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాగా సమగ్ర వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం అంశాలపై రైతులకు రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివ విస్తృత అవగాహన కల్పించారు. ఇఫ్కో కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్ నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపైన రైతులకు సమగ్రంగా వివరించారు. పిజెటిఎస్ ఎయు నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు,డాక్టర్ అరుణశ్రీ యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు,వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయంగా వివరించారు. కాగా 'యూరియా యాప్' అమలు తీరుపైన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు స్వయంగా రైతులను అడిగి తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటం పట్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేసినట్టు మంత్రి తుమ్మల తెలిపారు. యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. తేనెటీగల పెంపకం చేస్తూ అధిక తరువాయి 12లో



# కేబినెట్ నిర్ణయం చాలు

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంకోర్టు క్లారిటీ


**న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాల అంశం గత కొంతకాలంగా రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో తరువాయి 12లో

# కడియం శ్రీహరికి నోటీసులు



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎంఎల్‌ఎల ఫిరాయింపు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై బుధవారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో విచారణ జరగనుంది. ఈ మేరకు కడియం శ్రీహరికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరుకావాలని అసెంబ్లీ సెక్రటరీ నుంచి కడియం శ్రీహరికి నోటీసులు అందాయి. మరోవైపు కడియం శ్రీహరిపై అనర్హత పిటిషన్ దాఖలు చేసిన కుత్బుల్లాపూర్ బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కె.పి.వివేకానంద కూడా విచారణకు హాజరు కావాలని స్పీకర్ నోటీసులు పంపారు. మొదట స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎంఎల్‌ఎ వివేకానంద వాదనలను నమోదు చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, గత ఏడాది నవంబర్ 20న కడియం శ్రీహరితో పాటు దానం నాగేందర్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తన నోటీసులకు తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. కానీ, కడియం శ్రీహరి తనకు వచ్చిన నోటీసులపై సమాధానం ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని స్పీకర్‌ను అభ్యర్థిస్తూ లేఖ రాశారు.



# డిఆర్‌డిఒ మరో ఘనత

## ఎస్‌ఎఫ్‌డిఆర్ పరీక్ష విజయవంతం

**భువనేశ్వర్ :** దేశ క్షిపణి వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో ముందడుగు చేసింది. గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణుల అభివృద్ధికి కీలకమైన సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ రామ్‌జెట్ (ఎస్‌ఎఫ్‌డిఆర్) సాంకేతికతను డిఆర్‌డిఒ విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని చాందీపూర్ తరువాయి 12లో

## మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా
# ఖేమ్‌చంద్ సింగ్



**న్యూఢిల్లీ :** మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా ఖేమ్‌చంద్ సింగ్ ఎంపికయ్యారు. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో బిజెపి కేంద్ర పరిశీలకుడు తరుణ్ చుగ్, పార్టీ ఈశాన్య రాష్ట్రాల ఇన్‌ఛార్జ్ సంబిత్ పాత్రా తదితరుల సమక్షంలో వై.ఖేమ్‌చంద్ సింగ్‌ను బిజెపి శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. దీనితో ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో ఆయన నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. మణిపూర్ కొత్త ప్రభుత్వంలో కుకీ మహిళా తరువాయి 12లో

## కర్ణాటకలో...
# విబి–జీ రామ్ జీ రద్దు



**బెంగళూరు:** గ్రామీణ ఉపాధికి తూట్లు పొడిచి కేంద్ర ప్రభుత్వంకొత్తగా తెచ్చిన విబి–జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని దాని పూర్వపు వాస్తవరూపంలో పునరుద్ధరించేందుకు కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో మంగళవారం ఒక తీర్మానం ప్రవేశపెట్టింది. అసెంబ్లీలో ప్రతిపక్ష బిజెపి శాసనసభ్యుల తీవ్ర నిరసనల మధ్య రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. విబి–జీ రామ్ జీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తరువాయి 12లో

మహాత్మాగాంధీ పథకం పునరుద్ధరణకు రంగం సిద్ధం

- అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



## త్రైపాక్షిక చర్చల వేళ ఉక్రేన్-రష్యా పరస్పర దాడులు

**మాస్కో:** ఉక్రేన్–అమెరికా–రష్యా మధ్య అబుధాబిలో నేడు (ఫిబ్రవరి 4) మరో విడత త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని ముందస్తు వార్తలు వెలువడిన తరుణంలో ఉక్రేన్–రష్యా మధ్య పరస్పర దాడులు మొదలయ్యాయి. జెలెన్‌స్కీ, ట్రంప్ విజ్ఞప్తి మేరకు వారం రోజులు దాడులకు విరామం ఇచ్చిన రష్యా తిరిగి మంగళవారం భారీస్థాయిలో దాడులు ప్రారంభించింది. ఉక్రేన్ సైన్యం కూడా ప్రతిదాడులు చేసింది. కీవ్ నగరంలో ఉష్ణోగ్రతలు మైనస్ 20 డిగ్రీలకు క్షీణించిన సమయంలో తెల్లారకముందే రష్యా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. దీంతో 1000 టవర్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టే ఉక్రేన్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించేందుకు కీవ్ చేరుకున్న రోజునే ఈ దాడులు జరిగాయి. 70 బాలిస్టిక్ క్షిపణులు, 450 డ్రోన్లతో రష్యా దాడులు చేసిందని జెలెన్‌స్కీ చెప్పారు. వీటిల్లో 38 క్షిపణు లు ధ్వంసం సృష్టించాయని ఆ దేశ సైన్యం తెలిపింది. అదేవిధంగా రష్యా ఖెర్సన్ రీజియన్‌లోని నోవయా ఖాఖోవ్‌కా ప్రాంతంలో ఉక్రేన్ దళాలు చేసిన దాడుల్లోముగ్గురు మరణించినట్లు రష్యా గవర్నర్ వ్లాదిమిర్ సాల్డో ప్రకటించారు. మరణించినవారిలో స్థానిక ప్రభుత్వ అధికారి కూడా ఉన్నారు. అనేకమంది గాయపడ్డారు.
కీవ్‌పై రష్యా చేసిన దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. కీవ్ నగరంలో ప్రజలు దాడుల నుండి తప్పించుకోవడానికి సురక్షిత ప్రదేశాలకు వెళుతున్నారు. ఇంధన వనరులపై దాడుల కారణంగా ఉక్రేన్‌లో వేలాదిఇళ్ళకు విద్యుత్ సదుపాయం లేదు. దీంతో హీటర్లు వారంతా చలికి వణుకుతున్నారు. చలిమంటలు వేసుకుని ఇతర మార్గాలు అనుసరిస్తున్నారు.
కాగా ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఒక ప్రకటన చేస్తూ రష్యా శాంతి యత్నాలను కాలరాస్తోందని, దౌత్యం కంటే దాడులకే పుతిన్ ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంనాటి ప్రదర్శనశాలను రష్యా క్షిపణులు ధ్వంసం చేశాయని విమర్శించారు. ఉక్రేన్–అమెరికా–రష్యా మధ్య మూడో విడత త్రైపాక్షిక చర్చలు ఈనెల 4,5 తేదీలలో జరుగుతాయని గడచిన ఆదివారం నాడు జెలెన్‌స్కీ ప్రకటించారు. సమగ్ర చర్చలకు, బహుళ దొంతర్ల చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని కూడా ఆయన చెప్పారు.

# యుద్ధభేరీల మధ్య శాంతి యత్నాలు

## టర్కీలో ఆరో తేదీన అమెరికా–ఇరాన్ చర్చలు



**దుబాయ్:** జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా, షరతుల ప్రాతిపదికపై అమెరికాతో అణు చర్చల పునరుద్ధరణకు ఇరాన్ ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. పరస్పర మర్యాద, గౌరవాలతో దేశ ప్రయోజనాలే లక్ష్యంగా చర్చలకు వెళ్ళాలని విదేశీమంత్రి అబ్బాస్ ఆరాఘ్చికి ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ఆదేశించారు. వచ్చే శుక్రవారమే (ఫిబవరి 6) టర్కీ నగరం ఇస్తాంబుల్‌లో ఈ చర్చలు జరిగే అవకాశాలున్నాయి. ఎక్స్ వేదికగా పెజెష్కియన్ ఈ విషయం ప్రకటించారు. పశ్చిమ ఆసియాలో అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్, ఇరాన్‌మంత్రి ఆరాఘ్చి, టర్కీ, ఖతార్, ఈజిప్టు దేశాల సీనియర్ ప్రముఖులు సమావేశంలో పాల్గొంటారు. చర్చలు ఫలించకపోతే చెడు జరిగే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని ట్రంప్ అన్నారు. కానీ ఇరాన్‌పై దాడి చేస్తే అది ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని అయెతొల్లా అలీ ఖమేని ఇప్పటికే ఒక హెచ్చరిక చేశారు. ఈ పరస్పర ఉద్రిక్తతలమధ్య శాంతి కోసం దౌత్య యత్నాలు మొదలయ్యాయి.
న్యాయవిరుద్ధమైన, నిర్హేతుకమైన అంచనాలతో తమపై కయ్యానికి సిద్ధపడుతున్నప్పటికీ, ఖతార్, టర్కీ, ఈజిప్టు, ఒమన్ వంటి ఇరుగు పొరుగు మిత్రదేశాలు ఇచ్చిన సలహాల మేరకు వారిని మన్నించి అమెరికాతో అణు చర్చల పునరుద్ధణకు అంగీకరించినట్లు చెప్పారు. దౌత్యమార్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని భావించామన్నారు. ఐతే దీనికి షరతులు వర్తిస్తాయని, జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా తాము చర్చలు జరుపుతామని ఆయన ప్రకటించారు. ''చర్చలకు రావాలని అమెరికా అధ్యక్షుడు చేసిన సూచనకు స్పందించాలని స్నేహపూర్వక దేశాలు చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకున్నాం, అనుచితమైన అంచనాలు లేని వాతావరణం గనుక ఉంటే, న్యాయబద్ధమైన చర్చలకు వేదిక సిద్ధం చేయమని మా విదేశీమంత్రిని ఆదేశించాను'' అని పెజెష్కియన్ ఆ పోస్టింగ్‌లో పేర్కొన్నారు. టర్కీ ప్రభుత్వమే ఈ చర్చలకు రెండు వైపులా చొరవ చూపించింది. కాగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఈ చర్చలకు ముందుగా ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్–అమెరికాలు న్యాయబద్ధమైన అణు ఒప్పందం చేసుకోవాలని, ప్రాంతీయ ఉద్రిక్తతలు చెలరేగకుండా దీర్ఘకాలిక ఒప్పందానికి రావాలని విజ్ఞప్తి చేసింది. పశ్చిమాసియా దేశాలు యుద్ధాన్ని కోరుకోవడంలేదని స్పష్టం చేసింది.
ఒకవైపు ఆరేబియా సముద్రంలో ఇరాక్‌కు సమీపంలో విమానవాహక యుద్ధ నౌకలను మోహరించి, గగనతల విన్యాసాలు చేస్తూ మరోవైపు చర్చలకు రావాల్సిందిగా ఇరాన్‌తో ట్రంప్ డబుల్ గేమ్ ఆడుతున్నారు. ఆయన దాదాపు లాటిన్ అమెరికా కరీబియన్, ఆర్కిటిక్ ప్రాంత దేశాలతో ఇలాంటి కుంత్రం వ్యూహాలే చేస్తున్నారు. మరోవైపు చైనా–రష్యా మిత్రదేశాలు మౌనంగా ఈ పరిణామాలను గమనిస్తున్నాయి.

### చర్చల్లో పాకిస్థాన్ పాత్ర!

ఇస్తాంబుల్‌లో అమెరికా–ఇరాన్ మధ్య చర్చల్లో పాల్గొనాల్సిందిగా పాకిస్థాన్‌కు ఆహ్వానం అందింది. పాకిస్థాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి తహిర్ ఆంద్రబీ మంగళవారం ఇస్లామాబాద్‌లో ఈ విషయం ధృవీకరించారు. అమెరికా–ఇరాన్ మధ్య చర్చలకు, ఉద్రిక్తతల నివారణకు పాకిస్థాన్ మౌనంగా తాను చేయాల్సిందంతా చేస్తోందన్నారు. ఇరుదేశాలమధ్యా ఉద్రిక్తలను సడలించేందుకు చర్చల్లో పాకిస్థాన్ కీలకపాత్ర వహిస్తుందని, ఉప ప్రధాన మంత్రి–విదేశీమంత్రి ఇషాక్ దార్ పాల్గొంటారని చెప్పారు. పాకిస్థాన్‌తో పాటు సౌదీఅరేబియా, ఖతార్, ఈజిప్టు, ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

అమెరికాతో న్యాయబద్ధ చర్చలకు

# క్యూబా సిద్ధం

## ట్రంప్ అక్రమ ఆరోపణలకు ఖండన




**హవానా:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదే పదే చేస్తున్న ఆరోపణలను క్యూబా తిరస్కరించింది. తమదేశంవల్ల అమెరికా భద్రతకు ఎలాంటి ప్రమాదంలేదని మరోసారి స్పష్టం చేసింది. వాస్తవ ప్రాతిపదికపై ఆచరణాత్మకమైన ఫలితాలు సాధించే పరస్పర గౌరవ–మర్యాదలతో కూడిన న్యాయబద్ధమైన సంభాషణలకు క్యూబా ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని మరోసారి అమెరికాకు స్పష్టం చేసింది. అమెరికా నిర్బంధాలకు అనుగుణంగా వారితో సహకరించడానికి క్యూబా దేశం సిద్ధంగా లేదని క్యూబా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సోమవారం విడుదల చేసిన ప్రకటనను ఖతార్ న్యూస్‌మీడియా సంస్థ 'ఎజెఎంఎన్ ప్రచురించింది. ''నిర్మాణాత్మకమైన చర్చలు, చట్టబద్ధమైన సహకారం, శాంతియుత సహజీవనం ద్వారా క్యూబా ప్రజలు–అమెరికా ప్రజలు లబ్ది పొందాలి'' అని ప్రకటన పేర్కొంది. క్యూబాతో దౌత్యపరమైన సంబంధాన్ని పునరుద్ధరించినట్లు ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటల తర్వాత క్యూబా నుండి ఈ ప్రకటన వెలువడింది.
పరస్పర మర్యాద–గౌరవాలు ఇచ్చిపుచ్చుకునే విధంగా చర్చలకు పిలుపు ఇస్తూ మా కరీబియన్‌దీవి ఎన్నడూ ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వదని, అలాంటి కార్యకలాపాలు చేపట్టదని పునరుద్ఘాటించింది. వెనుజులా తర్వాత క్యూబా సంగతి చూస్తాం అంటూ ట్రంప్ గతనెలారంభంలోనే రంకెలువేసి బెదిరింపులు ప్రారంభించారు. మాదక ద్రవ్యాలను, ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోందంటూ వెనిజులాపై ఆరోపణలు గుప్పించి ఆ దేశంపై దురాక్రమణ చేశారు. ట్రంప్ ఎత్తుగడలు చాలా దశాబ్దాలుగా ఆ పాలకులు అనుసరిస్తున్నవేనని అనేక ఆంక్షలు ఎదుర్కొంటున్న క్యూబా పదే పదే చెబుతూ అమెరికా ఆరోపణలను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.

# ఒకే ఛత్రం కింద ఎలాన్‌మస్క్ వ్యాపారం

**న్యూయార్క్:** అమెరికా టెక్ బిలియనీర్ ఎలాన్‌మస్క్ తన రాకెట్ కంపెనీ స్పేస్ ఎక్స్‌ను, కృత్రిమ మేధకు చెందిన అంకురసంస్థ ఎక్స్ ఎఐను విలీనం చేశారు. దీనిని ఒక మైలురాయి ఒప్పందంగా పేర్కొన్నారు. దీంతో తన వ్యాపార సామ్రాజ్యం ఒకే ఛత్రం కింద విస్తరించడంతోపాటు కృత్రిమ మేధ రంగంలో భవిష్యత్ లక్ష్యాల నిమిత్తం కార్యకలాపాలను విస్తృతం చేయడానికి ఈవిలీనం దోహదం చేస్తుందన్నారు. కేవలం భూతలంపై సాంకేతికతను విస్తరించడంపైనే వ్యాపారాన్ని చేయకుండా అంతరిక్ష సంబంధమైన సాంకేతికతను భారీస్థాయిలో పెంచేందుకు ఈ విలీనం ఉపయోగపడుతుంది. ఈ అతి పెద్ద నిర్ణయంతో 1.25 ట్రిలియన్ డాలర్ల అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యం ఆయనకు ఏర్పడింది. బ్లూంబెర్గ్ మంగళవారం ఈ విషయం వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖుల దగ్గర నుండి సాధారణ ప్రజల వరకూ ఎలాన్‌మస్క్ సాధిస్తున్న అంతరిక్ష విజయాల గురించి అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ విధానాల గురించే మాట్లాడుకుంటూ ఉంటారు. భిన్నమైన లక్ష్యాలతో స్థాపించిన రెండు కంపెనీల విలీనం మస్క్ తీసుకున్న అతి పెద్ద నిర్ణయం. ఉద్యోగుల సమాచారం నిమిత్తం ఎలాన్‌మస్క్ సంతకంలో స్పేస్‌ఎక్స్ వెబ్‌సైటులో ఈ సమాచారాన్ని అప్‌లోడ్ చేశారు.

> స్పేస్ ఎక్స్–ఎక్స్ ఎఐ విలీనం

### ఫ్రాన్స్‌లో ఎక్స్‌పై దాడులు

ఫ్రాన్స్‌లో ఎలాన్‌మస్క్‌కు చెందిన ఎక్స్ కార్యాలయాలపై ప్రాసిక్యూషన్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. సైబర్–క్రైమ్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఫ్రాన్స్ అధికారులు యూరోపోల్ సహాయంతో ఫ్రాన్స్‌లో ఉన్న ఎలాన్‌మస్క్ సోషల్ మీడియా వేదికలపై దాడులు చేశారు. ఎఐ ఛాట్ బోట్, గ్రోక్‌లు జతకలిసి ఉన్న ఎక్స్ ఆల్గోరిథమ్ కంటెంట్‌పై దర్యాప్తుకోసమే దాడులు చేసినట్లు ప్రాసిక్యూటర్ చెప్పారు. మస్క్‌తోపాటు ఎక్స్ వేదిక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లింకా యక్కారినోలను గడచిన ఏప్రిల్‌లో విచారణకు హాజరుకావాల్సిందిగా కోరామని రాలేదని ప్రాసిక్యూషన్ కార్యాలయం ప్రకటించింది. ఈ పరిణామాలపై ఎలాన్‌మస్క్ ఇంకా స్పందించలేదు. గత ఏడాది జనవరిలోనే ఈ వ్యవహారంపై దర్యాప్తు ప్రారంభమైంది.




# ముగిసిన ఉపసంహరణల పర్వం


తిరుగుబాటు సెగలు
మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ల లొల్లి
రెబల్స్ ఆందోళనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్‌ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. ఉపసంహరణల గడువు ముగియడంతో, బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులను కేటాయించనున్నారు. పార్టీల బిఫారమ్స్ పొందిన వారు అధికారికంగా బరిలోకి దిగగా, అసంతృప్తితో ఉన్న రెబల్స్ ఏ మేరకు ప్రభావం చూపుతారో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నామినేషన్‌ల ఉపసంహరణ గడువు ముగియడంతో రాష్ట్రంలో పలు జిల్లాల్లో రాజకీయ సమీకరణాలు వేడెక్కాయి. టికెట్లు దక్కని ఆశావహుల ఆగ్రహం, రెబల్స్ బుజ్జగింపులు, పార్టీల మధ్య ఘర్షణలతో ఎన్నికల వాతావరణం రణరంగాన్ని తలపించింది. టికెట్‌ల కేటాయింపుపై చోటుచేసుకున్న ఈ పరిణామాలు స్థానిక రాజకీయాలను మరింత వేడెక్కిస్తున్నాయి. తిరుగుబాటు అభ్యర్థులు ప్రధాన పార్టీల అధినాకత్వాలకు గుబులు పుట్టిస్తున్నారు. చివరి నిమిషం వరకు రెబల్ అభ్యర్థులను దారికి తెచ్చుకునేందుకు ప్రధాన పార్టీల నేతలు సర్వశక్తులు ఒడ్డారు. అయితే, కొన్నిచోట్ల బుజ్జగింపులు ఫలించగా, మరికొన్ని చోట్ల టికెట్ దక్కని నేతలు బహిరంగంగానే తమ నిరసనను వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి టికెట్ల కేటాయింపులో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి ఎక్కువ టికెట్లు ఇచ్చారని, ఈ చర్యతో తన మెద కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు జిల్లాల్లో మాజీ మంత్రులు ఇళ్లను ఆశావహులు ముట్టడించారు. కరీంనగర్‌లో బిఆర్ఎస్ పార్టీలో టికెట్ల లొల్లి తారస్థాయికి చేరింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తమకు టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపిస్తూ రెండో డివిజన్ ఆశావహుడు దాసరి సాగర్, మూడో డివిజన్ ఆశావహుడు దాసరి ప్రభాకర్ ఆందోళనకు దిగారు. తమ ప్రచార కరపత్రాలను, పోస్టర్లను గంగుల నివాసం వద్దే తగులబెట్టి, నిప్పును ఇంట్లోకి విసిరారు. చెప్పులు విసురుతూ, మట్టి పోస్తూ శాపనార్థాలు పెట్టడం స్థానికంగా కలకలం రేపింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీలో టికెట్ కేటాయింపు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మెట్‌పల్లి 24వ వార్డు టికెట్ ఆశించిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలు హరిత, తనకు బీఫామ్ ఇస్తామని చెప్పి చివరి నిమిషంలో వేరే వ్యక్తికి ఇచ్చారని ఆరోపించారు. డిసిసి అధ్యక్షుడి పిలుపు మేరకు జగిత్యాల ఇందిరా భవన్ వెళ్తే, తన కళ్ల ముందే బీఫామ్ చించేసి వేరే వారికి ఇచ్చారని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. టికెట్ల కేటాయింపులు, ప్రచారం విషయంలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఘర్షణ వాతావరణం నెలకొంది. సిద్దిపేట (14వ వార్డు) కాంగ్రెస్ అభ్యర్థిపై 'బాకీ కార్డు' అంటూ బిఆర్ఎస్ ప్రచారం చేయడంతో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. హాలియా (నల్లగొండ) బిఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరింపజేసేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఇరు పార్టీల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.

# ప్రభుత్వ ఆజ్ఞతోనే స్పీకర్ నా నోరు నొక్కేశారు

ప్రజాస్వామ్యంపై ఇది మాయని మచ్చ
లోక్‌సభలో రభసపై ఓంబిర్లాకు
రాహుల్‌గాంధీ నిరసన లేఖ





**న్యూఢిల్లీ:** చట్టసభలో సభ్యుణ్ణి మాట్లాడనివ్వకపోవడం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై మాయని మచ్చ అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. జాతీయ భద్రత విషయం గురించి సోమవారంనాటి సభలో తనను మాట్లాడనివ్వకుండా అడ్డుకోవడంపై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు మంగళవారం లిఖితపూర్వకంగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నాయకుణ్ణి మాట్లాడనివ్వకుండా స్పీకర్ బలవంతంగా అడ్డుకోవడం పార్లమెంటరీ వ్యవస్థ చరిత్రలో ఇదే మొట్టమొదటిసారి అని స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఆజ్ఞలతోనే స్పీకర్ అడ్డుకున్నారన్నారు. 'ఇది ప్రజాస్వామ్యంపై మాయని మచ్చ, చాలా బలంగా నేను నా నిరసనను రికార్డుల్లో నమోదు చేస్తున్నాను' అని పేర్కొన్నారు. సభాధిపతిగా స్పీకర్ నిష్పాక్షికంగా వ్యవహరించాలని, సభలో ప్రతిపక్షాలు, ప్రతిపక్ష నాయకుడు సహా ప్రతి సభ్యుడికీ ఉన్న హక్కులను సంరక్షించే రాజ్యాంగ, పార్లమెంటరీ బాధ్యత స్పీకర్‌దేనని లేఖలో రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ప్రతిపక్షనాయకుడికి, ప్రతి సభ్యుడికీ ఉన్న మాట్లాడేహక్కు ప్రజాస్వామ్యంలో ఒక విడదీయరాని భాగమని గుర్తుచేశారు. సభలో తన అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు ఉన్న మౌలికమైన ప్రజాస్వామ్య హక్కులను తిరస్కరించడం ఒక అసాధారణ పరిస్థితికి దారితీసిందని పేర్కొన్నారు.
పార్లమెంటు బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా రాహుల్‌గాంధీని మాట్లాడనివ్వకుండా అధికారపక్ష సభ్యులు మూకుమ్మడిగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సైనిక దళాల మాజీ ప్రధానాధిపతి ఎం.ఎం.నరవేన్ రాసిన ఇంకా ప్రచురితంకాని ''మెమొరీస్'' అనే పుస్తకంపై ఒక పత్రిక రాసిన వ్యాసాన్ని రాహుల్ గాంధీ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ ఉటంకిస్తూ జాతీయ భద్రతపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న తన అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు ప్రయత్నం చేశారు. అభిప్రాయాన్ని చెప్పనివ్వకుండా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా అధికార పక్ష సభ్యులు రా హుల్‌గాంధీపై విరుచుకుపడటంతో సభ లో తీవ్ర రభస జరిగింది. రెండు సార్లు సభ వాయిదా పడింది. సంబంధిత పత్రికకు ఉన్న ప్రామాణికత ఏమిటో ధృవీకరించాలని స్పీకర్ ఓం బిర్లా రాహుల్‌గాంధీని ఆదేశించారు. ఆ తర్వాత మధ్యాహ్నం జరిగిన సమావేశంలో కూడా రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ఆ సమయంలో స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ తెన్నేటి ముగ్గురు ప్రతిపక్ష ఎంపీలను మాట్లాడనివ్వలేదు. వారంతా రాహుల్‌కు సంఘీభావం ప్రకటించారు. తర్వాత స్పీకర్ ఎన్‌డిఎ భాగస్వామ్యపార్టీ టిడిపి ఎంపి హరీశ్ బాలయోగిని మా ట్లాడాల్సిందిగా కోరారు. ఈ అప్రజాస్వామిక చర్యపై స్పీకర్ ఓం బిర్లాకు లిఖితపూర్వకంగా నిరసన తెలియజేశారు.

## నేడు సిఎం సభ

(మొదటి పేజీ తరువాయి)

నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇంఛార్జి మంత్రులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ మంగళవారం సాయంత్రం గడువు ముగిసిన అనంతరం ఏయే కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో బరిలో మిగిలిన అభ్యర్థులు, ఇతర రాజకీయ పార్టీల బలాబలాలు, కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థులు ఎంత మంది బరిలో ఉన్నారు అనే అంశాలపై సమాచారంపై వారు విశ్లేషణ చేసినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సిఎం రేవంత్ ప్రచార షెడ్యూల్‌పై కూడా చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, పంచాయతీ ఎన్నికల మాదిరిగానే మునిసిపల్ ఎన్నికలనూ సవాల్‌గా తీసుకుని పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని, ఏ ఒక్క ఓటును కూడా నిర్లక్ష్యం చేయవద్దని, ఎక్కడ రెబల్స్ అభ్యర్థులు మిగిలినా వారిని దారికి తేవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా ఎన్నికలు జరుగుతున్న 7 కార్పొరేషన్లూ కాంగ్రెస్ ఖాతాలో చేరాల్సిందేనని, అందుకు కాంగ్రెస్ పార్టీ ప్రచార వ్యూహాన్ని అనుసరించాలన్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించిన సర్వేలు కాంగ్రెస్‌కు సానుకూలంగా ఉన్నాయని నాయకులతో పునరుద్ఘాటించారు. ఈ సర్వేల ప్రకారం 80 శాతం సీట్లలో కాంగ్రెస్ కచ్చితంగా విజయం సాధించనుందని స్పష్టం చేశారు. మిగిలిన 20 శాతం సీట్లలో గట్టి పోటీ ఉందని, కష్టపడితే వాటిలోనూ సానుకూల ఫలితం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్టీ గుర్తుపై జరిగే ఈ ఎన్నికలను సవాల్‌గాతీసుకుని పనిచేయాలని ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్చార్జిలుగా వ్యవహరిస్తున్న మంత్రులకు సిఎం సూచించారు. కొన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో సమస్యలున్నాయని, వాటిపై ఇన్చార్జి మంత్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సిఎం ఆదేశించినట్లు సమాచారం. నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారంతో గడువు ముగియడంతో బరిలో నిలిచిన పార్టీకి చెందిన తిరుగుబాటు అభ్యర్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారిని దారికి తేవాలని సమావేశంలో సిఎం మంత్రులకు పార్టీ నాయకులకు నొక్కి చెప్పినట్లు తెలిసింది. అన్ని సమస్యలనూ పరిష్కరించుకుని ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి చెప్పారు. ఉత్తర తెలంగాణలో బిజెపిని తేలికగా తీసుకోవద్దని, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ నియోజకవర్గాల పరిధిలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలపై గట్టిగా దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిసింది. కొన్ని చోట్ల బిజెపి, బిఆర్ఎస్ నాయకత్వాలు సీట్ల సర్దుబాటు చేసుకుంటున్నాయన్న అంశమూ చర్చకు వచ్చినట్లు సమాచారం.

## ప్రతిపక్షాలు ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

టార్గెట్ చేయటంలేదు. వారు నరేంద్ర మోదీ ఆర్థిక నిర్మాణాన్ని టార్గెట్ చేశారు. రెండోది ఎప్‌స్టీన్ ఫైల్స్ అవి ఇంకా విడుదల కాలేదు. అమెరికా బయటపెట్టని ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో చాలా విషయాలున్నాయి. ఎప్‌స్టీన్ ఫైల్స్ విషయంలో మోదీపై చాలా ఒత్తిడి ఉంది. వాటి ఒత్తిడితోనే ప్రధాని రాజీపడ్డారు. ప్రధాని అమెరికాకు ఎందుకు లొంగిపోయారన్నది ప్రజలు అర్థం చేసుకోవాలి' అని రాహుల్ గాంధీ అన్నారు. మరోవైపు వాణిజ్య ఒప్పందం విషయమై అమెరికా ఒత్తిడికి ప్రధాని మోదీ తలొగ్గారన్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలను అధికార పక్షం తిప్పికొట్టింది.

### ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్ : మోదీ

భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంపై తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్‌డిఎ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్‌డిఎ ఎంపిలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ హాస్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్‌డిఎ ఎంపిలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు.

# సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

ఈడెన్, అమరీందర్ సింగ్, రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గుర్జీత్ సింగ్, కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు. వీరిపై మిగిలిన బడ్జెట్ సమావేశాల కాలానికి సస్పెన్షన్ విధించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. అనంతరం తీవ్ర గందరగోళం కొనసాగడంతో లోక్‌సభ బుధవారానికి వాయిదా పడింది.

### పార్లమెంట్ వెలుపల నిరసన

మరోవైపు, ఎంపిల సస్పెన్షన్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో పార్టీ ఎంపిలు పార్లమెంట్ భవనం వెలుపల నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. సరెండర్ మోదీ, ఎప్‌స్టీన్ మోదీ, మోదీట్రంప్ భాయిభాయి అంటూ నినాదాలు చేశారు. అవన్నీ ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్యలని తెలిపారు. విపక్ష స్వరాన్ని అణిచివేస్తున్నారని వారు ఆరోపించారు. సభ్యులను సస్పెండ్ చేయడం అన్యాయమని, వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ నుంచి సస్పెండ్ అయిన తర్వాత హిబీ ఈడెన్ మాట్లాడుతూ 'ప్రతిపక్ష నాయకుడు పార్లమెంటు లోపల ఎందుకు మాట్లాడలేకపోతున్నారో స్పష్టంగా చెప్పారు. దానికి కారణం ప్రధానమంత్రి అమెరికా ముందు లొంగిపోయిన తీరు, వాణిజ్య ఒప్పందం కుదిరిన విధానం, ఆ ఒప్పందంలో జరిగిన అక్రమాలే. ఎప్‌స్టీన్ విషయం పార్లమెంటులో చర్చించాల్సిన అంశం, కానీ ఈ విషయాలేవీ చర్చించడం లేదు. మేం సభ లోపల, వెలుపల మా నిరసనను కొనసాగిస్తాం. మా ఎనిమిది మంది ఎంపిలను సస్పెండ్ చేశారు, కానీ మేం పార్లమెంటు లోపల, వెలుపల మా పోరాటాన్ని కొనసాగిస్తాం' అని తెలిపారు. అయితే లోక్‌సభలో గందరగోళానికి కారణంగా భారత్–చైనా సరిహద్దు ఘర్షణలకు సంబంధించిన అంశం. 2020లో జరిగిన భారత్ –చైనా ఘర్షణలపై మాజీ ఆర్మీ చీఫ్ నరవణె రాసిన ప్రచురితం కాని పుస్తకంలోని కొన్ని విషయాలను సభలో ప్రస్తావించాలని రాహుల్ గాంధీ ప్రయత్నించారు. అయితే అవి అధికారికంగా వెలువడని సమాచారమని పేర్కొంటూ స్పీకర్ అనుమతి ఇవ్వలేదు. దీంతో కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనలు ప్రారంభించారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ప్రభుత్వం కీలక జాతీయ భద్రతా అంశాలపై చర్చకు భయపడుతోందని ఆరోపించారు. సైన్యానికి సంబంధించిన విషయాలపై పారదర్శకత ఉండాలని, పార్లమెంట్‌లో చర్చించేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడమే కాకుండా సభ్యులను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. మరోవైపు అధికార పక్షం మాత్రం విపక్షంపై మండిపడింది. సభా నియమాలను పాటించకుండా, అల్లరి సృష్టించడం సమంజసం కాదని పేర్కొంది. సభా కార్యకలాపాలను అడ్డుకోవడం ప్రజల సమస్యల పరిష్కారానికి ఆటంకమని వ్యాఖ్యానించింది.

### లోక్‌సభ పలుమార్లు వాయిదా

లోక్‌సభ బుధవారానికి వాయిదా పడడానికి ముందు వారణాసిలోని మణికర్ణికా ఘాట్‌లో జరిగిన కూల్చివేతలపై ప్రతిపక్ష ఎంపిల గర్జన, నిరసనల మధ్య లోక్‌సభ కార్యకలాపాలు మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. అంతకుముందు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాభారత వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించడం, ఇతర అంశాలపై ప్రతిపక్ష ఎంపిల గర్జన నిరసనల మధ్య సభా కార్యకలాపాలు మ ధ్యాహ్నం 12గంటల వరకు ప్రారంభమయ్యాయి.
మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైన వెంటనే, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు ఘాట్ పునరాభివృద్ధికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు, ఇది 1791లో మణికర్ణికా ఘాట్‌ను మొదట పునరుద్ధరించిన 18వ శతాబ్దపు మాల్వా రాజ్య రాణి అహల్యాబాయి హోల్కర్‌ను అవమానించడమేనని ఆరోపించారు. కాశీ విశ్వనాథ్ ఆలయ పునరుద్ధరణకు కూడా ఆమె ఘనత వహించారు. కృష్ణప్రసాద్ టెన్నేటి అభ్యంతరం చెప్పిన హోల్కర్ చిత్రాలను ఎస్‌పి ఎంపిలు ప్రదర్శించారు. విపక్ష సభ్యులు పట్టువీడవకపోవడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. భారత్ – చైనా ఘర్షణలపై మాజీ ఆర్మీ చీఫ్ నరవణె రాసిన ప్రచురితం కాని పుస్తకంలోని కొన్ని విషయాలను లేవనెత్తేందుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని స్పీకర్ ఓం బిర్లా నిరాకరించిన అంశాన్ని కూడా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తారు. సభ సమావేశమైన వెంటనే నిరసనలు ప్రారంభమయ్యాయి. సురుప్‌సింగ్ హిర్యా నాయక్ మృతికి బిర్లా సంతాప సూచికంగా మౌనం పాటించాలని బిర్లా సభ్యులను కోరారు. ఒక నిమిషం మౌనం పాటించిన తర్వాత, సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి 'మోదీని అప్పగించండి' వంటి నినాదాలు చేశారు.



# కేంద్రం నుంచి తెలంగాణకు రూ.25వేల కోట్లు రావాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం నిర్వహించిన ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఎస్ఎస్ (కేంద్ర ప్రాయోజిత పథకాలు) రూ. 5 లక్షల కోట్ల బడ్జెట్ లో ప్రతి పాదించిన, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణకు కనీసం రూ. 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేశారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈ దిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలు కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం ఉందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో రూ.10 వేల కోట్లు రావాల్సి ఉందని ఈ అంశంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమిషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ పెర్ఫార్మెన్స్, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో వినియోగం కాకుండా ఉన్న మిగులు నిధులను రాష్ట్రానికి దక్కేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సివి ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్యసాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్ వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

# దళిత వ్యతిరేక విధానాలు అవలంబిస్తోన్న బిజెపి

### సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలి : సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాలనలో దళితులపైన జరుగుతున్న అన్యాయాలకు, బిజెపి దళిత వ్యతిరేక విధానాలను దళిత సమాజం అర్థం చేసుకుని సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాలనరసింహా పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం అధ్యక్షతన హైదరాబాద్, మఖ్దూం భవన్‌లోని సాజ్ జహీర్ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎం. బాల నరసింహ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగంలోని సామాజిక న్యాయ భావనలను పక్కన పెట్టిందని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తోందని విమర్శించారు. 2026–27 కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో దళితులకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా రిజర్వేషన్లను నిర్వీర్యం చేసిందని, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బాలనరసింహా ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరగకుండా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విద్య, ఉపాధి, భూమి, భద్రత వంటి మౌలిక హక్కుల విషయంలో దళితులను బిజెపి ప్రభుత్వం నిరంతరం మోసం చేస్తోందని, ఎన్నికల సమయంలోనే దళితుల గురించి మాట్లాడి, అధికారంలోకి రాగానే వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో దళిత సమాజం మౌనంగా ఉండకుండా బిజెపి విధానాల అసలు స్వరూపాన్ని గుర్తించి, ఉద్యమాల బాట పట్టాలని సూచించారు. దళిత మహిళలపైన దాడులు, హత్యలు, అత్యాచారాలు జరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ప్రతి నియోజకవర్గంలో అత్యధిక ప్రాధాన్యత దళితులకు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో 2018 నుండి పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి ఇండస్ట్రీలో రుణాలు తీసుకున్న లబ్దిదారులకు సబ్సిడీలు విడుదల చేయలేదని, తక్షణమే సబ్సిడీ రుణాలను విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 26, 27వ తేదీలలో వరంగల్‌లో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండవ మహాసభలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. హైదరాబాద్‌లోనే అంబేద్కర్ భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వమే పునర్నిర్మించాలన్నారు. గత బిఆర్‌ఎస్ పాలనలో దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములను అధికారుల అండదండలతో ధరణిలో అక్రమంగా పట్టాలు చేసుకున్నారని, వీటిని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి, వెంటనే వాటిని తిరిగి దళితులకు హక్కులను కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర నాయకులు కె రత్నకుమారి, వై ఉషశ్రీ, టి.రామకృష్ణ, కె.వెంకటస్వామి, ఆరుట్ల రాజ్‌కుమార్, జేరుపోతుల కుమార్, బి లక్ష్మపతి, ఎం. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో చార్జ్ షీట్‌కు సిట్ సన్నాహాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చార్జ్ షీట్ దాఖలు చేసేందుకు సన్నాహాలు వేగవంతం చేసింది. ఇప్పటికే పోలీసులు, బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు కీలక నేతల విచారణ పూర్తి చేయడంతో, వారి వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలు ఆధారంగా తదుపరి చర్యలకు సిట్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. విచారణలో సేకరించిన డిజిటల్ డేటా, కాల్ డిటెయిల్స్, పత్రాల విశ్లేషణ దాదాపు ముగిసిన నేపథ్యంలో, ప్రస్తుత నిందితులపై మరింత బలమైన అభియోగాలను మోపే దిశగా అడిషనల్ చార్జ్ షీట్ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ చార్జ్ షీట్‌లో మరికొందరిని నిందితులుగా చేర్చుతారా? లేక ప్రస్తుతం ఉన్న నిందితులపైనే పరిమితమవుతారా? అనే అంశం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సిట్ చేతిలో ఉన్న ఆధారాలు, కీలక సాక్షుల వాంగ్మూలాలే ఈ నిర్ణయానికి ఆధారంగా మారనున్నాయని అధికారులు సూచిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన నేపథ్యంలో, సిట్ దాఖలు చేయనున్న చార్జ్ షీట్‌పై రాష్ట్ర రాజకీయ వర్గాలన్నీ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

# మున్సిపల్ ఎన్నికల్లో... జాగ్రత్త!

### అధికారులను ఆదేశించిన డిజిపి శివధర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికలను చట్టం ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి పోలీస్ అధికారులతో అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ ఎన్నికలు జరగనున్న ప్రాంతాల పోలీస్ కమిషనర్లు , జిల్లాల ఎస్‌పిలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లలతో మాట్లాడారు. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొత్తగూడెం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నిజామాబాద్, నల్గొండ, రామగుండం కార్పొరేషన్ల పరిధిలోని 414 వార్డులతో పాటు, 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డుల్లో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈనెల 11వ తేదీన పోలింగ్, 13 తేదీన కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర పోలీస్ శాఖకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని డిజిపి సూచించారు. ఏ రకమైన ఫిర్యాదులు గాని , అవాంఛనీయ సంఘటనలు గాని జరగకుండా చర్యలు తీసుకోవాలని డిజిపి స్పష్టం చేశారు. నిబంధనల మేరకు కఠినంగా వ్యవహరించాలని డిజిపి పోలీస్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పోలీస్ లీగల్ అడ్వైజర్ శ్రీరాములు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన చట్టాల గురించి సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....చట్టం ప్రకారం ఓటర్లను ప్రభావితం చేయడం, ఒకరికే ఓటు వేయాలని ఒత్తిడి తీసుకురావడం లేదా నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని, బాధితులపై సామాజికంగా లేదా ఆర్థికంగా బహిష్కరణలు విధిస్తే చట్టరీత్యా కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేలా మద్యం పంపిణీ చేసినా, ఎక్సైజ్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కనీసం ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందనీ ,ఆయుధాల చట్టం ప్రకారం లైసెన్స్‌డ్ ఆయుధాలను కలిగి ఉన్న వారు నిబంధనల మేరకు పోలీస్ స్టేషన్లలో జమ చేయాలని, లేనిపక్షంలో ఒక ఏడాది నుంచి మూడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించాలని నిబంధనలు ఉన్నాయన్నారు. మరోవైపు ఎన్నికల ప్రచార పర్వంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అనుసరించాల్సిన నిబంధనల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. బహిరంగ ప్రదేశాల డిస్ఫిగర్మెంట్ చట్టం 1997ను అనుసరించి ఎవరైనా అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించినా, అశ్లీల ప్రకటనలు ప్రదర్శించినా వాటిని తొలగించడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని, ధ్వని కాలుష్యాన్ని నియంత్రించేందుకు టౌన్ న్యూసెన్స్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సి ఉందన్నారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు వాడటం చట్టరీత్యా నేరం. ప్రచార వాహనాల విషయంలోనూ మోటార్ వాహనాల చట్టం1988 కింద అనేక ఆంక్షలు అమల్లో ఉన్నాయనీ, ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి అని, ఆ అనుమతి పత్రం యొక్క ఒరిజినల్ కాపీని వాహనం ముందు భాగంలో ప్రదర్శించాలన్నారు.



## రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థులకు తల్లిదండ్రులతో ఉన్న బంధాన్ని రవాణా శాఖరోడ్డు భద్రతకు ఉపయోగించుకునేందుకు రోడ్డు భద్రత ప్రతిజ్ఞా వెబ్‌సైట్‌ను ప్రారంభించిందిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ హామీ పత్రాన్ని ఇవ్వాలని కోరారు. ఈ ప్రతిజ్ఞ రాబోయే కాలంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నామన్నారు. మంగళవారం సచివాలయంలో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్డు నిబంధనల పాటిస్తామని ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర హామీ పత్రం తీసుకోవడం ద్వారా విద్యార్థులతో ఉన్న వారి బాండింగ్‌తో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో క్షేత్ర స్థాయిలో రవాణా శాఖ అధికారులు పెద్ద ఉద్యమంలా తీసుకుపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, రాష్ట్ర రవాణా అథారిటీ సభ్యుడు నవీన్ పెట్టెం తదితరులు పాల్గొన్నారు.

## 'సిట్' విచారణను ప్రభావితం చేసేలా సిఎం మాటలు

### శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్ మాటలు సిట్ విచారణను ప్రభావితం చేసే విధంగా ఉన్నాయని బిఆర్‌ఎస్ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అన్నారు. కెసిఆర్ ఏనాడు కూడా విచారణను ఎదుర్కోనను అని అనలేదని, మున్సిపల్ ఎన్నికలు ఉన్నందునే మొదటి నోటీసు విచారణకు సమయం కావాలని కోరారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ ముమ్మాటికీ తెలంగాణ జాతిపితనే అని అన్నారు. రేవంత్‌రెడ్డి విమర్శలను తెలంగాణ సమాజం గమనిస్తోందని, ఆయనకు తగిన బుద్ధి చెబుతుందన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, జాతర నిర్వహణకు శాశ్వత ఏర్పాట్లు చేస్తామని సిఎం ,మంత్రులు ఉత్తర కుమార ప్రగాల్భాలు పలికారని, కానీ 15 గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయిందని, అక్కడ కనీస ఏర్పాట్లను కూడా చేయలేకపోయారని ఆయన ఆరోపించారు. ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ కోదండరామ్‌కు రాజ్యసభ ,ఎంఎల్‌సి పదవి ఇస్తానని ఆనాడే కెసిఆర్ ప్రతిపాదించినప్పటికీ ఆయననే తిరస్కరించారని వివరించారు. ఎంఎల్‌సి పదవి ఇచ్చినట్టే ఇచ్చి రద్దయ్యేలా చేసిన సిఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు కోదండరామ్‌పైన మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

### తిరుమలలో రూ.300 దర్శనం

## తెలంగాణ బస్సులకు అనుమతివ్వాలి

### టిటిడికి సిపిఐ నేత డాక్టర్ కె.నారాయణ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రూ.300 ప్రత్యేక దర్శనం కోసం తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్‌కు చెందిన టూరిజం బస్సులకు అనుమతి ఇవ్వాలని సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)ను కోరారు. ఈ మేరకు టిటిడి చైర్మన్‌కు నారాయణ లేఖ రాశారు. గతంలో తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌కు చెందిన నాలుగు బస్సుల ద్వారా వచ్చే 172 మంది భక్తులకు, విమాన ప్రయాణం ద్వారా వచ్చే 50 మంది భక్తులకు, కస్టమైజడ్ ద్వారా వచ్చే 78 మంది భక్తులకు టికెట్లను ప్రతి రోజు టిటిడి ఇచ్చేదని లేఖలో గుర్తు చేశారు. డిసెంబర్ 2024 నుంచి టిటిడి నిర్ణయాల కారణంగా ఈ టూరిజం బస్సులకు రూ.300 దర్శనం టికెట్లతో తిరుమల దర్శనానికి అనుమతి లేకుండా పోయిందని ఆయన లేఖలో పేర్కొన్నారు. దీంతో టూరిజం కార్పొరేషన్‌కు ఆర్థిక నష్టంతో పాటు భక్తులకు కూడా అసౌకర్యం ఏర్పడుతోందని తెలిపారు. అంతేకాకుండా, గతంలో ఉన్న విధానాన్ని పునరుద్ధరించి తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌కు చెందిన టూరిజం బస్సులకు మళ్లీ రూ.300 దర్శనం టికెట్ ద్వారా తిరుమల దర్శనానికి అనుమతి ఇవ్వాలని నారాయణ కోరారు.



## శాసన మండలి హాల్ త్వరలో ప్రారంభం

### ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసన మండలి హాల్ పారంభోత్సవ కార్యక్రమం త్వరలోనే ఉండనుందని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ శాసన సభ ప్రాంగణంలోని శాసన మండలి భవనం పునర్నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలి సెక్రెటరీ డా. నరసింహా చార్యులు, ఆర్ అండ్ బి, అగాఖాన్ సంస్థ, తదితర అధికారులతో కలిసి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ' రాబోయే బడ్జెట్ సమావేశాలను అసెంబ్లీ పక్కనే ఉన్న భవనంలోనే శాసనమండలి నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. తాజాగా ఇప్పటి వరకు పూరైన పనుల పురోగతిని ఆరా తీసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఖచ్చితంగా శాసన మండలి బడ్జెట్ సమావేశాలు అసెంబ్లీ ఆవరణలో ఉన్న భవనంలో నిర్వహించుకోవాలని సూచించారన్నారు. పనుల, వేగం పెంచి త్వరగా భవనాన్ని పూర్తి చేసి శాసన మండలి అధికారులకు అప్పగించాలని ఛైర్మన్ సూచించారు .ఆలస్యం చేస్తే కాంట్రాక్టు పనులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి ప్రభుత్వం

### కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం



**ప్రజాపక్షం/హైదరాబాద్/యాదాద్రి :** ప్రజల గొంతుకను సభలో వినిపిస్తుంటే అప్రజాస్వామికంగా మాపై సస్పెన్షన్ వేటు వేశారని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో మంగళవారం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో తెలంగాణకు చెందిన భువనగిరి కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి సహా ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపిలను స్పీకర్ సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ అనంతరం పార్లమెంట్ ఆవరణలో ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 'రాహుల్ గాంధీ వాస్తవాలు మాట్లాడుతుంటే తట్టుకోలేక బిజెపి మైకులు కట్ చేస్తోందని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ, ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి దేశ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆ విషయాన్ని ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా?' అని ఆయన ప్రశ్నించారు. బిజెపి చేస్తున్న ఈ 'చిల్లర రాజకీయాలకు' భయపడేది లేదని, బుధవారం పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద సస్పెండైన ఎనిమిది మంది ఎంపిలం ఆందోళన చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

**అడ్డదారిలో గెలవాలని చూస్తున్న బిఆర్‌ఎస్**

మున్సిపల్ ఎన్నికల్లో అడ్డదారిలో గెలవాలని చూస్తున్న బిఆర్‌ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ కుటుంబంపై ఘాటు విమర్శలు చేశారు. 'హరీష్ రావు ఒక లక్కీ స్టార్. ఎమ్మెల్యే కాకముందే రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రి పదవి పొందిన చరిత్ర ఆయనది. ఓట్లు వేయించుకోకుండానే పదవులు అనుభవించిన వ్యక్తి ఆయన' అని చామల విమర్శించారు. రేవంత్ రెడ్డి స్వశక్తితో ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగితే, అది చూసి హరీష్ రావు కడుపు మంటతో రగిలిపోతున్నారని, ఆ మంట తగ్గడానికి 'ఈనో' ప్యాకెట్లు వాడుకోవాలని ఎద్దేవా చేశారు.

## రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ

### ఎమ్మెల్సీ బల్మూరి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్‌అధికారం చేపట్టిన రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, దీనినిజీర్ణించుకోలేని మాజీ మంత్రి కె.తారక రామారావు ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులు కలవడానికి కూడా కనీసం అపాయింట్ మెంట్ ఇవ్వని కెటిఆర్ ఇప్పుడు వారి కోసం మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాలనలోనే నిరుద్యోగులకు పూర్తి న్యాయం జరుగుతోందని, ఇప్పటికే 70వేల ఉద్యోగాలు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశామని వెల్లడించారు.. మరిన్ని నోటిఫికేషన్ల విడుదల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఇందుకు సంబంధించి టిజిపిఎస్‌సి ప్రక్రియను మొదలు పెట్టిందన్నారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ను కొనసాగిస్తోందని, త్వరలోనే మరికొన్ని నియామకాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేయనుందని తెలిపారు. కెటిఆర్ 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు లక్షా 60వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారని, వారు ఎంత వరకు ఉద్యోగాలు ఇచ్చారో ఉద్యోగాలను అంగట్లో సరుకులు లెక్కనఎట్ల అమ్ముకున్నారో అందరికీ తెలిసేందని పేర్కొన్నారు. కాంగ్రెస్ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు న్యాయం చేయడానికి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని నిరుద్యోగులు ప్రతిపక్షాల మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

## ఎంఐఎం మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ మృతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆల్ ఇండియా మజ్లీస్‌ఎఇత్తేహాదుల్ ముస్లిమిన్ (ఎఐఎంఐఎం) పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ(72) మరణించారు. రెండేళ్లుగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతూ, హైదరాబాద్ ఒవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ 1954 సెప్టెంబర్ 15న సయ్యద్ ముర్తుజా పాషా ఖాద్రీ, సయ్యదా అమతుల్ కరీం దంపతులకు హైదరాబాద్‌లో జన్మించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 10వ తరగతి వరకు చదువుకున్న పాషా ఖాద్రీ 1986, 1991లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్‌గా ఎన్నికైయ్యారు. ఆతర్వాత 2004లో చార్మినార్ నియోజవర్గం నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొంది తిరిగి 2009, 2014, 2018లో ఇదే నియోజకవర్గం నుంచి వరసగా విజయం సాధించారు.

# బిఆర్‌ఎస్‌కు అనుకూలం

### అన్ని పట్టణాలపై గులాబీ జెండా ఎగరవేయాలి : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికలలో బిఆర్‌ఎస్ ఘనవిజయం సాధించాలని, అన్ని పట్టణాలపై గులాబీ జెండాను ఎగరవేయాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పిలుపునిచ్చారు. బిఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మున్సిపల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో కెటిఆర్ మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో బిఆర్‌ఎస్‌కు అనుకూల వాతావరణం నెలకొందని వివరించారు. రానున్న వారం రోజుల పాటు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో కష్టపడితే, భారీ మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ప్రభంజనం ముందు ప్రతిపక్షాలు నిలవలేకపోయాయని, అప్పట్లో కాంగ్రెస్, బిజెపిలు కేవలం ఏడెనిమిది స్థానాలకే పరిమితమైన విషయాన్ని కెటిఆర్ గుర్తు చేశారు.పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మున్సిపల్ కోఆర్డినేటర్లు తమకు కేటాయించిన క్షేత్రాల్లోనే అందుబాటులో ఉండాలని కెటిఆర్ సూచించారు.

# ఒటిపి మోసాలపై ప్రజలు అప్రమత్తం

### సైబర్ పోలీసుల హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫోన్ కాల్స్, ఎస్‌ఎంఎస్‌లు, వాట్సాప్ సందేశాలు, నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, ఫిషింగ్ వెబ్‌సైట్ల ద్వారా ఒటిపి (వన్ టైమ్ పాస్‌వర్డ్)లను సేకరించి సైబర్ మోసగాళ్లు ప్రజలను భారీగా మోసం చేస్తున్నారని హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీసులు హెచ్చరించారు. ఒటిపి దొరికిన వెంటనే బ్యాంక్ ఖాతాలు, క్రెడిట్ కార్డులు, డిజిటల్ వాలెట్లు, ఈకామర్స్ యాప్స్‌లలోకి అక్రమంగా ప్రవేశించి డబ్బు దోచుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఉద్యోగులు, కస్టమర్ కేర్ సిబ్బంది, డెలివరీ ఏజెంట్లు, ఉద్యోగం లేదా లోన్ ఇస్తామని చెప్పే మధ్యవర్తులుగా నటిస్తూ ఒటిపి అడుగుతున్నారని పేర్కొన్నారు. అలాగే రిఫండ్, క్యాష్‌బ్యాక్, గిఫ్ట్ ఓచర్ల పేరుతో కూడా ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు.

**ఒటిపి మోసాల ప్రధాన విధానాలు:**

నకిలీ బ్యాంక్ కెవైసి అప్డేట్ కాల్స్ ద్వారా ఒటిపిలు అడగడం

ఆన్‌లైన్ షాపింగ్ రిఫండ్ లేదా క్యాష్‌బ్యాక్ పేరిట ఒటిపి కోరడం

గూగుల్‌లో కనిపించే నకిలీ కస్టమర్ కేర్ నంబర్ల ద్వారా మోసం

ఉద్యోగం, లోన్ మంజూరు చేస్తామని చెప్పి ఒటిపి అడగడం

యుపిఐ కలెక్ట్ రిక్వెస్టుల ద్వారా డబ్బు డెబిట్ చేయడం

సిమ్ స్వాప్ మోసాల ద్వారా బ్యాంకింగ్ ఎస్‌ఎంఎస్‌లు తమ నియంత్రణలోకి తీసుకోవడం

ఈకామర్స్ రిటర్న్ లేదా డెలివరీ పేరిట ఒటిపిలు పొందడం

**ప్రజలకు సైబర్ పోలీసుల సూచనలు:**

ఒటిపిను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దు

బ్యాంక్, ప్రభుత్వం, ఈకామర్స్ సంస్థలు ఒటిపి అడగవని గుర్తుంచుకోవాలి

తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజెస్ నమ్మవద్దు

అనుమానాస్పద యుపిఐ కలెక్ట్ రిక్వెస్టులను ఆమోదించవద్దు




అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌లో ఉన్న కస్టమర్ కేర్ నంబర్లనే ఉపయోగించాలి

మెసేజ్‌ల స్క్రీన్‌షాట్‌లను ఇతరులకు పంపకూడదు

సిమ్ లాక్, ఫోన్ స్క్రీన్ లాక్, ట్రాన్సాక్షన్ అలర్ట్స్ వంటి భద్రతా ఫీచర్లు యాక్టివేట్ చేసుకోవాలి

ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సూచించారు. ప్రజలు సైబర్ అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## ప్రజలకు ఏం చేశారో చెప్పకోలేని పరిస్థితుల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్

తెలంగాణ జాగృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ పదేళ్లు, కాంగ్రెస్ రెండేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేశామనే విషయాన్ని చెప్పుకోలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉన్నారని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి ఆరోపించారు. కేవలం ప్రజల దృష్టిని మరల్చేందుకు పథకం ప్రకారం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షుడు కోళ్ల శ్రీనివాస్‌తో కలిసి నవీన్ ఆచారి మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక మున్సిపాలిటీల్లో సమస్యలు తిష్ట వేశాయని,తాగు నీళ్లు మోరి నీళ్లతో కలిసి కలుషితమవుతున్నాయని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో సింహం గుర్తుపైన పోటీ చేస్తున్న జాగృతి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

## 'యూరియా యాప్' ద్వారా 20.79 లక్షల యూరియా బస్తాల కొనుగోలు

వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యూరియా సరఫరా వ్యవస్థను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'యూరియా యాప్' రైతులకు ఎంతో ఉపయుక్తంగా మారుతోందని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5.75 లక్షల మంది రైతులు 'యూరియా యాప్' ద్వారా మొత్తం 20.79 లక్షల యూరియా బస్తాలను కొనుగోలు చేశారని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో యూరియా సరఫరాలో చోటు చేసుకున్న బ్లాక్ మార్కెటింగ్ వంటి సమస్యలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా యాప్‌ను రూపొందించామన్నారు. జిల్లా యూనిట్‌గా యూరియా బుకింగ్ విధానాన్ని అమలు చేయడం ద్వారా, స్థానిక అవసరాల ఆధారంగా సరఫరాను నియంత్రిస్తూ, ప్రతి రైతుకు న్యాయమైన వాటా అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. యూరియా యాప్ ద్వారా పంటల వారీగా అవసరమైన పరిమాణానికే బుకింగ్ జరుగుతుండటంతో, నిజమైన రైతులకే ఎరువులు చేరుతున్నాయని, యూరియా యాప్ అనేది కేవలం ఒక సాంకేతిక మార్పు మాత్రమే కాదని, దళారుల ప్రమేయం లేకుండా, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు, సరఫరా వ్యవస్థలో పారదర్శకతకు ప్రభుత్వం తీసుకున్న సంస్కరణాత్మక చర్య అని అన్నారు. ఇప్పటికి 22 జిల్లాలో యాప్‌ను అమలు చేస్తున్నామని గోపి వివరించారు.

## హమాలీల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బోయినపల్లి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెజిటేబుల్ హమాలీల సమస్యలను పరిష్కరించాలని బోయిన్‌పల్లి వెజిటేబుల్ మార్కెట్ హమాలి యూనియన్ అధ్యక్షులు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ కోరారు. బోయిన్‌పల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వెజిటేబుల్ మార్కెట్‌కు నూతనంగా నియమితులైన కార్యదర్శిని హమాలీ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు హమాలీల సమస్యలను కార్యదర్శికి వివరించారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ బోయిన్‌పల్లి మార్కెట్‌లో ఉన్న హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రైతులు, అధికారులకు, హమాలీలకు అందుబాటులో ఉంటూ మార్కెట్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని కార్యదర్శి హామీనిచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలి యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ. గట్టయ్య, డి రాజు, సమ్మయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## థానే కొత్త మేయర్‌గా షర్మిళా పింప్లోల్కర్

**థానే:** ఏక్‌నాథ్ షిండే నాయకత్వానగల శివసేన అభ్యర్థి షర్మిళా పింప్లోల్కర్ థానే నగర మేయర్‌గా ఎన్నికయ్యారు. బిజెపికి చెందిన కృష్ణ పాటిల్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. వీరిద్దరూ తప్ప ఇతరులెవ్వరూ ఈ పదవులకు నామినేషన్లు దాఖలు చేయలేదు. దీంతో వారు ప్రత్యర్థులు లేకుండా విజయం సాధించారు. అంతర్గతంగా ఉండే అంచనాలకు అనుగుణంగా శివసేన, బిజెపి రెండు పార్టీలు వంతులవారీ విధానంలో పదవులను పంచుకునే విధానాన్ని మహాయుతి కూటమిలో అమలు చేస్తున్నాయి. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు గడువును 15 నెలలుగా నిర్ధారించుకున్నారు. శివసేన నాయకుడు ఒకరు ఈ విషయం చెప్పారు. ఎన్నికైన పార్టీల అభ్యర్థులకు సంతృప్తి కలిగించే విధంగా ఈ ఒప్పందం చేసుకున్నారు. సీనియర్ ఎన్‌సిపి కార్పొరేటర్ నజీబ్ ముల్లా మాట్లాడుతూ, థానే నగరపాలక సంస్థ కొత్త సభలో ఐదుగురు సభ్యులున్న అఖిలభారత మజ్లిస్–ఎ–ఇత్తెహదుల్ ముస్లిమీన్ పార్టీతో లేదా 12 మంది కార్పొరేటర్లు ఉన్న శరద్ పవార్ నాయకత్వానగల పార్టీతో జతకట్టే అవకాశాల గురించి అన్వేషిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల సభాపక్ష నాయకత్వం లభిస్తుంది. అజిత్ పవార్ మరణించకముందే ఈ రెండు అవకాశాల గురించి తాము ముందే చర్చించామన్నారు. థానే అభివృద్ధికోసం త మ పార్టీ కృషి చేస్తుందన్నారు.

## ఇరాన్ అల్లర్లలో 50వేల మంది అరెస్టు

కొనసాగుతున్న చర్యలు

**దుబాయ్:** ఇరాన్‌లో చెలరేగిన అల్లర్లకు సంబంధించి దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ 50,000 మందిని అరెస్టు చేశారు. ఈ అరెస్టులు ఇంకా కొనసాగుతున్నాయి. అరెస్టయినవారిలో రచయితలు, కళాకారులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు అన్ని వర్గాలవారూ ఉన్నారని హక్కుల సంఘాలు ప్రకటించాయి. కొన్ని సందర్భాలలో దళాలు ఇళ్ళల్లోకి వెళ్ళి ఇంటి సామాగ్రినంతటినీ తనిఖీలు చేస్తున్నాయని పేర్కొన్నాయి. వీరిలో 300 మందిని బలవంతంగా తామే నేరాలు చేశామని ఒప్పించారని అమెరికాకు చెందిన హక్కుల సంస్థ హెచ్‌ఆర్ఎఎన్ఎ తెలియజేసింది. అల్లర్ల సందర్భంగా ప్రదర్శకులను తీవ్ర అణచివేతకు గురిచేశారని స్వచ్ఛంధ సంస్థలు తెలియజేశాయి. జనవరి 8,9 తేదీలు రెండు రోజుల్లోనే భద్రతాబలగాలు వేలాది మంది ప్రదర్శకులను హతమార్చాయని హక్కులసంఘాలు వాదిస్తున్నాయి. ఈ అల్లర్లకు విదేశీశక్తులు కారణమని ఇస్లామిక్ స్టేట్ నాయకులు పేర్కొన్నారు. గతవారం ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ చేసిన ప్రకటనలో అరెస్టయిన వారిలో పిల్లలు కూడా ఉన్నారని పేర్కొంది. వేలాదిమందిని సామూహికంగా అరెస్టు చేయడంవల్ల ఎంతమాత్రం న్యాయబద్ధమైన విచారణలు జరగబోవని, వారందరినీ మూకుమ్మడిగా ఏకపక్షంగా విచారించి శిక్షలు విధించడం, హింసించడం, సుదీర్ఘకాలం జైళ్ళలో బంధించడం వంటి ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.

## ఎప్‌స్టీన్‌పై వాంగ్మూలానికి క్లింటన్ సిద్ధం

**వాషింగ్టన్ :** అమెరికా ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ రహస్య పత్రాలు వెలుగుచూశాక దీనిపై దర్యాప్తు ప్యానల్ ఎదుట వాంగ్మూలం ఇచ్చేందుకు క్లింటన్ దంపతులు అంగీకారం తెలియజేశారు.ఎప్‌స్టీన్ పత్రాలలో క్లింటన్ పేరు కూడా ఉంది. ఎప్‌స్టీన్ రహస్య పత్రాల్లో బిల్‌క్లింటన్ హాట్‌టబ్‌లో విలాసాల్లో మునిగితేలుతున్న చిత్రాలు తాజాగా బయటపడటంతో ఆయన ప్రతిష్ఠకు భంగం వాటిల్లింది. పైగా ఎప్‌స్టీన్ ప్రైవేటు జెట్స్‌లో 2002, 2003 సంవత్సరాలలో ఆయన నాలుగుసార్లు ప్రయాణాలు చేసినట్లు సాక్ష్యాలు కనిపించాయి. క్లింటన్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఏజెంల్ యురేనా ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెడుతూ క్లింటన్ దంపతులు దర్యాప్తు కమిటీ ఎదుట హాజరవుతారని ధృవీకరించారు. ఎప్‌స్టీన్‌తో వారికి ఎలాంటి సంబంధాలు లేవని వారి ప్రతినిధులు ప్రకటించారు.

# వారంలో జిహెచ్ఎంసి విభజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భాగ్యనగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించాలనే ఆలోచన ప్రభుత్వ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. క్షేత్రస్థాయిలో అప్పుల పంపకం, క్రెడిట్ రేటింగ్స్ అంశాలు పెద్ద అడ్డంకిగా మారాయి. మరో వారం రోజుల్లోనే విభజన ప్రక్రియపై స్పష్టత వస్తుందనే ప్రచారం జరుగుతోంది. వేల కోట్ల రూపాయల బకాయిల పంపకాలపై దృష్టిసారించారు.

### రూ. 4,786 కోట్ల అప్పు.. ఎవరి ఖాతాలోకి?

ప్రస్తుతం జిహెచ్ఎంసిపై సుమారు రూ. 4,786 కోట్ల మేర అప్పుల భారం ఉంది. ఇందులో బ్యాంక్ లోన్లు, మున్సిపల్ బాండ్లు, ఏజెన్సీల బకాయిలతో పాటు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు కూడా ఉన్నాయి. ఆదాయం ఎక్కువగా ఉన్న కోర్ సిటీకి ఎక్కువ అప్పులు కేటాయిస్తారా? లేదా కొత్తగా ఏర్పడే కార్పొరేషన్లపై ఈ భారాన్ని నెడతారా? అనే దానిపై సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అప్పులతో కూడిన కొత్త కార్పొరేషన్లను ప్రారంభిస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని, ఇది ఎన్నికల సమయంలో రాజకీయంగా నష్టం కలిగిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

### క్రెడిట్ రేటింగ్ డౌన్‌గ్రేడ్ అయ్యే ప్రమాదం..

విభజన వల్ల కేవలం పాలనాపరమైన ఇబ్బందులే కాకుండా, ఆర్థికపరమైన విఘాతాలు కలిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రేటింగ్ ఆధారంగానే జిహెచ్ఎంసికి తక్కువ వడ్డీకి రుణాలు, బాండ్ల ద్వారా నిధులు అందుతున్నాయి. విభజన తర్వాత ఆస్తులు, అప్పుల పంపకంలో అనిశ్చితి నెలకొంటే రేటింగ్ పడిపోయే ప్రమాదం ఉంది. రేటింగ్ తగ్గితే భవిష్యత్తులో నిధుల సమీకరణ భారంగా మారుతుంది. ఇది నేరుగా నగరాభివృద్ధి పనులపై ప్రభావం చూపుతుంది. అప్పుల నిర్వహణపై స్పష్టమైన ఫైనాన్షియల్ ఫ్రేమ్ వర్క్ లేకుండా ముందుకెళ్లడం వల్ల ఆర్థిక స్థిరత్వం దెబ్బతింటుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

### ఉత్కంఠలో ఉద్యోగులు.. డైలమాలో సర్కార్

విభజనపై ఒకవైపు ఉద్యోగులు, అధికారుల్లో గందరగోళం నెలకొనగా, మరోవైపు ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. అప్పుల బాంబు పేలకుండా, క్రెడిట్ రేటింగ్ దెబ్బతినకుండా ఉండే మార్గాలను అన్వేషించిన తర్వాతే తుది



నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తే తప్ప ఈ చిక్కుముడి వీడేలా కనిపించడం లేదు. మొత్తానికి, జిహెచ్ఎంసి విభజన కేవలం భౌగోళిక అంశం మాత్రమే కాదు, ఇది ఒక సంక్లిష్టమైన ఆర్థిక ప్రక్రియగా మారింది. ప్రభుత్వం ఈ 'అప్పుల చిక్కుముడి'ని ఎలా విప్పుతుందో వేచి చూడాలి.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రుల అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :**

ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనెడీ స్కూల్లో 'లీడర్‌షిప్ ఇన్ ది 21వ సెంచరీ' ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రులు అభినందించారు. ఈ మేరకు మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణా రావు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, దనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, అజారుద్దీన్, జి.వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, సిఎం సలహాదారు వేం.నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తదితరులు జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు.

## హామీలు విస్మరిస్తే బిసి పోరాటాలు ఉధృతం

సెన్సస్ డాక్యుమెంట్‌లో మార్పులు చేయాలని డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ జనగణనలో కులగణన చేపట్టకుండ కేంద్ర ప్రభుత్వం చేసే కుట్రలు సాగబోవని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు అన్నారు. దేశ వ్యాప్తంగా జరిగిన బిసి ఉద్యమాల నేపథ్యంలో దేశ జనగణనలో కులగణన చేపడుతామని హామీనిచ్చి ఇప్పుడు విస్మరిస్తే బిసి పోరాటాలు ఉధృతమవుతాయని హెచ్చరించారు. దేశానికి స్వాతంత్రం రాకముందు బ్రిటిష్ పాలనలోనే కులగణన జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు కులగణన చేపట్టకపోవడంతో ఆర్థిక, సామాజిక,రాజకీయ,విద్యా, ఉద్యోగ రంగాలన్నింటిలోనూ బిసిలు వెనకకు నెట్టివేయబడ్డారని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జన గణనతో పాటు కులగణన చేపడతామని మోదీ ప్రభుత్వం ప్రకటించి, బీహార్ ఎన్నికల్లో లబ్ధి పొందిందని గుర్తు చేశారు. 2026, ఏప్రిల్ ఒకటి నుండి నిర్వహించనున్న జనాభా లెక్కల కోసం ఇటీవల కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన 33 ప్రశ్నలతో కూడిన గెజిట్ నోటిఫికేషన్‌లో 12వ ప్రశ్నలో ఎస్‌సి, ఎస్‌టి, ఇతరులు మాత్రమే అని ఉన్నదని, కులగణనలో బిసి పదమే లేదని, ఇంతకంటే వంచన ఇంకేముంటుందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన బిసి వ్యతిరేక విధానాన్ని విడనాడాలని, జనగణనలో బిసిల కులగణను కూడా చేపట్టాలని, దీనికి సంబంధించి సెన్సస్ డాక్యుమెంట్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకపోతే దేశవ్యాప్తంగా అన్ని బిసి సంఘాలు ఏకమై ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తాయని వెంకట్రాములు హెచ్చరించారు.

## నగరాల్లో వ్యాధుల నిఘా బలోపేతం

ఎంఎస్‌యు సిబ్బందికి సంయుక్త శిక్షణ ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర ప్రాంతాల్లో ప్రజారోగ్య భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) కీలక అడుగు వేసింది. మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (ఎంఎస్‌యు) సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన మూడు రోజుల సంయుక్త ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం మంగళవారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్చిచెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసిహెచ్‌ఆర్‌డి)లో ప్రారంభమైంది. ఈ శిక్షణలో హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, థానే నగరాలకు చెందిన ఎంఎస్‌యు ప్రతినిధులు పాల్గొంటున్నారు.

### వ్యాధుల నియంత్రణలో ఎంఎస్యూ పాత్ర కీలకం

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ నగరాల్లో వ్యాధుల నివారణ, నియంత్రణలో ఎంఎస్‌యు సిబ్బందిది కీలక పాత్ర అని అన్నారు. వ్యాధుల వ్యాప్తిపై సత్వర సమాచార సేకరణ, డేటా ధృవీకరణ, తక్షణ చర్యలు చేపట్టడం, నీటి ద్వారా వ్యాపించే డయేరియా, కలరా, హెపటైటిస్, దోమల ద్వారా వచ్చే డెంగీ, మలేరియా, చికున్‌గున్యాపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. ఫుడ్ పాయిజనింగ్, జూనోటిక్ (జంతువుల నుండి సోకే) వ్యాధుల అదుపునకు అన్ని శాఖలు కలిసి పనిచేసే 'వన్ హెల్త్' విధానాన్ని అనుసరించాలని ఆయన సూచించారు.

### మౌలిక సదుపాయాల కల్పన

ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్టక్చర్ మిషన్ (పిఎంఎబిహెచ్‌ఎం) కింద హైదరాబాద్‌లో ఎంఎస్‌యు బలోపేతం చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. 17 పోస్టులకు గాను ఇప్పటికే 14 మందిని నియమించామని, మిగిలిన ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని వెల్లడించారు. హరిహర కళాభవన్‌లో ఏర్పాటు చేస్తున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వ్యాధుల పర్యవేక్షణ వేగవంతం అవుతుందని తెలిపారు. అలాగే 'వెక్టర్ బోర్న్ డిసిజ్ యాప్' ద్వారా డెంగీ కేసుల జిఐఎస్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐపిఎంలో బయోసేఫ్టీ లెవల్2 పరికరాలతో ప్రయోగశాల సేవలను ఆధునీకరిస్తున్నట్లు వివరించారు.

### సమన్వయమే రక్షణ కవచం

మురికివాడలు, వలస కార్మికులు ఉండే ప్రాంతాల్లో వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉంటుందని, అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కమిషనర్ కర్ణన్ ఆదేశించారు. ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, పశుసంవర్ధక శాఖల సమిష్టి కృషితోనే ప్రజారోగ్యం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ మూడు రోజుల శిక్షణలో ఐహెచ్ఐపి (ఐహెచ్ఐపి) ప్లాట్‌ఫామ్, ఎపిడెమియాలజీ పరిశోధనలు, డేటా భద్రతపై నిపుణులు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు హేమంత కేశవ్ పాటిల్, సి.ఎన్. రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ ప్రియాంక అలా, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శుభాంగి కుల్సంగే, డాక్టర్ ప్రదీప్ అవాటే (ఎంఎస్‌యు), రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ (హెల్త్) డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ వకీల్ పాల్గొన్నారు.

## చిన్నారులపై అకృత్యాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు

డిసిపి పి.లావణ్య నాయక్ జాదవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడే వారి పట్ల హైదరాబాద్ సిటీ పోలీసులు 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తున్నారని, అకృత్యాలకు పాల్పడే వారు చట్టం నుండి తప్పించుకోలేరని ఉమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి పి.లావణ్య నాయక్ జాదవ్ స్పష్టం చేశారు. మైనర్ బాలికలపై జరిగిన ఐదు వేర్వేరు లైంగిక నేరాల కేసుల్లో కోర్టులు నిందితులకు కఠిన శిక్షలు ఖరారు చేశాయని ఆమె వెల్లడించారు. బేగంపేట, బంజారాహిల్స్, భవానీ నగర్, ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఐదు పోక్సో (POCSO) కేసుల్లో సెషన్స్ కోర్టులు మరియు ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులు తీర్పులు వెలువరించాయి. 12 ఏళ్ల కన్నకూతురిపైనే అఘాయిత్యానికి ఒడిగట్టిన తండ్రికి 'మరణించే వరకు కఠిన కారాగార శిక్ష' విధిస్తూ కోర్టు సంచలన తీర్పునిచ్చింది.9 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పొరుగు వ్యక్తికి 25 సంవత్సరాల జైలు శిక్ష పడింది. 8 ఏళ్ల బాలికను ప్రలోభపెట్టి అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించబడింది. 4, 8 ఏళ్ల చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరు నిందితులకు చెరో 5 సంవత్సరాల శిక్ష ఖరారైంది. జైలు శిక్షలతో పాటు, బాధితులకు రూ.2,00,000 నుండి రూ.5,00,000 వరకు పరిహారం అందించాలని కోర్టు ఆదేశించింది.

### భరోసా కేంద్రం కీలక పాత్ర:

ఈ కేసుల విచారణలో 'భరోసా కేంద్రం' అందించిన సేవలను డిసిపి ప్రత్యేకంగా ప్రస్తావించారు. బాధితులకు మరియు వారి కుటుంబాలకు మానసిక స్థైర్యాన్ని అందించడంతో పాటు, న్యాయపరమైన సలహాలు, వైద్య సహాయం మరియు కోర్టు విచారణలో నిరంతర మద్దతునిచ్చిందని ఆమె తెలిపారు. నిందితుల నుండి ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గకుండా కేసులను తార్కిక ముగింపు వరకు తీసుకెళ్లడంలో భరోసా సిబ్బంది కృషి ఎనలేనిదని ప్రశంసించారు.

### సమిష్టి కృషితోనే విజయం:

ఈ విజయం దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు లైజన్ ఆఫీసర్లు మరియు కోర్టు డ్యూటీ సిబ్బంది సమన్వయ కృషి వల్లే సాధ్యమైందని డిసిపి తెలిపారు. మహిళలు మరియు చిన్నారుల రక్షణే ధ్యేయంగా హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో నిరంతరం పనిచేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. నిందితులకు శిక్షలు పడేలా చేసిన అధికారులను ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అభినందించారు.

## సిగాచీ పేలుళ్ల కేసులో... నిందితులకు బెయిల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి కర్మాగారంలో పేలుళ్ల కేసులో నిందితులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది ఫ్యాక్టరీ ఎండీ, కార్యనిర్వహక డైరెక్టర్ అమిత్‌రాజ్ సిన్హాకు బెయిల్ ఇచ్చింది. ఇండిపెండెంట్ డెరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రవీంద్ర ప్రసాద్ సిన్హా, బిందు వినోదన్, ధనలక్ష్మి, జనార్దన్‌రెడ్డి లకు ముందస్తు బెయిల్ ఇచ్చింది. వ్యక్తిగతంగా రూ.లక్ష గ్యారెంటీ సమర్పించాలని, మరో ఇద్దరితో రూ.లక్ష చొప్పున రెండు గ్యారెంటీలను కింది కోర్టుకు సమర్పించాలంది. మేజిస్ట్రేట్ కోర్టులో లొంగిపోయి బెయిల్ పొందాలంది. కేసు విచారణకు సహకరించడమే కాకుండా సాక్షులను ప్రభావితం చేయరాదని, బెదిరించరాదని షరతు విధించింది.

## నాన్‌వెజ్ అమ్మకాల పరిధిపై విధానం ఉందా : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆలయం, విద్యా సంస్థలకు వంద మీటర్ల వరకు మద్యం దుకాణాలు ఉండకూడదన్న నిబంధన తరహాలో మాంసం దుకాణాల విషయంలో ప్రభుత్వం విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. భక్తుల విశ్వాసాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలంది. పరిశుభ్రత, ట్రాఫిక్ సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. నాలుగు వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, హోంశాఖలను ఆదేశిస్తూ విజయ్‌సేన్‌రెడ్డి ఆదేశించారు.

హైదరాబాద్ నగరం నాంపల్లిలో లైసెన్స్ తీసుకుని హోటల్ నిర్వహిస్తుంటే పోలీసులు పదేపదే జోక్యం చేసుకుంటున్నారంటూ దాఖలైన పిటిషన్‌లో ఈ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రభుత్వం విధానం ప్రకటించే వరకు పిటిషనర్ షాపు విషయంలో స్టేటస్‌కో కొనసాగించాలన్నారు. పిటిషన్‌పై విచారణ ముగిసినట్లు ప్రకటించారు.

## స్టేకు నిరాకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీబన్సారి కృష్ణ మందిరానికి చెందిన 2.34 ఎకరాల స్థలంలోని ఆక్రమణల తొలగింపు చర్యలను నిలిపివేస్తూ స్టే ఇవ్వబోమని హైకోర్టు ప్రకటించింది.. సైదాబాద్‌లో సర్వే నె.110లో దేవాలయానికి చెందిన కోట్ల రూపాయల విలువైన భూమిపై ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను పలువురు సవాలు చేసిన కేసులో స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. కౌంటర్ వేయాలని దేవాదాయశాఖకు నోటీసులు ఇచ్చింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## పక్షులపై అవగాహన

జూపార్క్‌లో బర్డ్ వాక్



**ప్రజాపక్షం/బహదూర్‌పురా:** పక్షుల పరిరక్షణ కోసం జూపార్క్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే పక్షి జాతులపై అవగాహన, ప్రచారంలో భాగంగా జూపార్క్‌లో బర్డ్ వాక్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ నుంచి ప్రాతినిధ్యం వహించిన 50 మంది పక్షుల పరిశీలకుల బృందం మంగళవారం ఉదయం 6 గంటలకు జూపార్క్‌ను సందర్శించింది. జూపార్క్ డిప్యూటీ క్యూరేటర్ జే.మురళీధర్ సంబంధిత పక్షుల పరిశీలకులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జూపార్క్‌లోని వివిధ పక్షి జాతుల గురించి వారికి క్లుప్తంగా వివరించారు. పక్షుల పరిశీలకులు... కింగ్‌ఫిషర్, గుడ్లగూబలు, డ్రోంగో, బబ్లర్స్, గ్రే హార్న్ బిల్, మూర్హెన్, మూనియాస్, కోయెల్, పెయింటెడ్ స్టార్క్, ఐబీస్, ఎగ్రెట్స్, బీ ఈటర్స్, కామన క్రో, స్టిల్ట్‌లు, లాప్‌వింగ్ తదితర పక్షులను చూశారు. జూపార్క్ ప్రాంగణం దాదాపు 70 పక్షి జాతులకు ఆవాసంగా నిలిచింది.

## ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత నాది

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** అధికారంలో ఉన్న పదేళ్లు నిరుపేదల ఇండ్ల స్థలాల గురించి పట్టించుకోకుండా వ్యవహరించిన వారు నేడు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ఆరాటపడుతున్నారని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బిఆర్ఎస్ పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 12, 13 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్డు షోలో మంత్రి పాల్గొని విపక్షాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పాలకులు పేదల సొంతింటి కలను నిర్లక్ష్యం చేశారన్నారు. ఆనాడు అర్హులైన వారికి స్థలాలు ఇవ్వకుండా వంచించారన్నారు. పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. ఇండ్ల స్థలాలు ఇచ్చే మంత్రిని కూడా నేనేనని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన ప్రతి నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి వాటిలో ఇందిరమ్మ ఇండ్లు కూడా కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మొద టి విడతలో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని ఏప్రిల్ నుంచి వరుస విడతల్లో ప్రతి పేదవానికి పక్కా ఇండ్లు నిర్మించి ఇచ్చే వరకు విశ్రమించనని హామీ ఇచ్చారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తుందన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైన్ల పనులను వేసవి లోపే పూర్తి చేస్తామన్నారు. తనను అసెంబ్లీ ఎన్నికల్లో దీవించినట్టే ఏదులాపురం మున్సిపాలిటీ బరిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా మంత్రి పొంగులేటి కోరారు.

## రాజ్యసభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్

**న్యూఢిల్లీ:** ఇండో–అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చకు డిమాండ్ చేస్తూ మంగళవారం రాజ్యసభ నుంచి అనేక ప్రతిపక్ష పార్టీల సభ్యులు వాకౌట్ చేశారు. ప్రభుత్వం తమ నిరాశను బయటపెడుతోందని ఆరోపించారు. జీరో అవర్ ముగిసిన వెంటనే కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ ఇండో–అమెరికా వాణిజ్య ఒప్పందం అంశాన్ని లేవనెత్తారు. ఒప్పందం గురించి సమాచారం గ్రీన్ నుండి అందుతోందని ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులు సభలో నిరసన ప్రారంభించడంతో సభా నాయకుడు జె పి నడ్డా ప్రభుత్వం ఈ విషయాన్ని చర్చించడానికి సిద్ధంగా ఉందని, పార్లమెంటులో ఇండో–అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రకటన చేస్తుందని అన్నారు. భారతీయ వస్తువులపై సుంకాల తగ్గింపు గురించి అమెరికా అధ్యక్షుడు సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా తెలియజేశారని, ప్రధానమంత్రిని నిజమైన స్నేహితుడు అని కూడా ప్రస్తావించారని ఆయన అన్నారు. ప్రతిపక్షాల నిరాశ బయటకు వస్తోందని, వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ ఆయన మంచి విషయాలలో కూడా చెడు చూడటం ప్రారంభించారని నడ్డా ఆరోపించారు. 'ఇండోఅమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చించడానికి, ఒప్పందం అన్ని సూక్ష్మ వివరాలను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సంబంధిత మంత్రి ప్రతిదీ వివరిస్తారని సభకు హామీ ఇవ్వాలనుకుంటున్నాను. వాణిజ్య ఒప్పందంపై ప్రభుత్వం స్వయంగా ఒక ప్రకటన విడుదల చేస్తుంది' అని నడ్డా అన్నారు. దేశ ప్రయోజనాలను అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించారు. ప్రభుత్వం ప్రకటన చేస్తున్నప్పుడు, వారు వినాలని చైర్మన్ సి పి రాధాకృష్ణన్ అన్నారు.



ప్రభుత్వం చర్చించడానికి సిద్ధంగా ఉందని, కానీ ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టిస్తున్నారని ఆయన అన్నారు. ప్రతిపక్ష సభ్యులు ముందు వరుస వైపు కదులుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిలబడ్డారు. ప్రతిపక్ష సభ్యుల వాకౌట్ చేయగానే, ప్రతిపక్షాల ప్రవర్తన ఖండించదగినదని, ప్రతిదానిలోనూ రాజకీయాలు సృష్టించడమే వారి ఉద్దేశ్యం అని నడ్డా అన్నారు. టిఎంసి మినహా అన్ని ప్రతిపక్ష సభ్యులు నిరసనగా వాకౌట్ చేశారు. టిఎంసి సభ్యుడు సాకేత్ గోఖలే సభలో కూర్చుని వాకౌట్ చేసిన కొద్దిసేపటికే వెళ్లి పోయారు.ఢిల్లీ పోలీసులు ఎస్ఐఆర్ బాధిత కుటుంబాలను చూసుకున్న తీరుపై టిఎంసి ప్రత్యేక వాకౌట్ నిర్వహించిందని తెలిపింది.

# 'మమ్మల్ని ఉద్యోగులుగా గుర్తించండి'

### ఢిల్లీలో మహిళా 'గిగ్' వర్కర్ల 'నిరసన గళం'

**'జిపిఎస్‌డబ్ల్యుయు' మహిళా విభాగం పిలుపు మేరకు జంతర్ మంతర్ వద్ద ప్రదర్శన**

**కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలలోనూ నిరసన జ్వాల**

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో 'గిగ్' వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఆక్షేపిస్తూ నిరసన గళాన్ని వినిపించారు. దాదాపు 100మందికి పైగా గిగ్ కార్మికులు వారిలో అధికశాతం మహిళలు ఈ నిరసన కార్యక్రమంలో గొంతెత్తారు. తమను ఉద్యోగులుగా గుర్తించాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. ఖాతాలను ఏకపక్షంగా బ్లాక్‌చేయడం, తక్కువ ఆదాయాల సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని, డిజిటల్ ప్లాట్‌ఫారాలలో కనీస కార్మిక రక్షణ కొరవడటాన్ని గిగ్ కార్మికులు తమ నిరసన ద్వారా ప్రతిధ్వనించారు. గిగ్,ప్లాట్‌ఫారమ్ సర్వీసెస్ వర్కర్స్ యూనియన్ (జిపిఎస్‌డబ్ల్యుయు) మహిళా విభాగం నాయకత్వంలో ఈ ప్రదర్శన జరిగింది. కాగా ఇదే తరహా నిరసన ప్రదర్శనలు కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలలో కూడా జరిగాయి.



మంగళవారం మధ్యాహ్నం సమయంలో పంజాబీ బాగ్‌లోని గృహ సేవల ప్లాట్‌ఫారమ్‌లో పనిచేస్తున్న సునీత అనే గిగ్ వర్కర్ జంతర్‌మంతర్ వద్ద మాట్లాడుతూ తాను ఇప్పటికీ ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొనడం ద్వారా దాదాపు రూ.900 రోజువారీ ఆదాయాన్ని కోల్పోయానని తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. సౌకర్యవంతమైన పనిగంటలు, స్థిరమైన ఆదాయాలు ఇస్తామని హామీ ఇచ్చిన తర్వాత తాను ఈ గిగ్ పనికి ఆకర్షితురాలిని అయ్యానని, కానీ ఇప్పుడు తన అకౌంట్ బ్లాక్ చేయబడుతుందనే భయంతో ఉన్నానని సునీత తెలియజేసింది. 'ప్రారంభంలో చాలా బుకింగ్స్ ఉండేవి. నీవు నీ కుటుంబాన్ని చక్కదిద్దుకోగలవు అని నమ్మబలికారు. కానీ, ఏ వివరణ లేకుండానే ఇప్పుడు నా అకౌంట్‌ను బ్లాక్ చేశారు' అని ఆమె ఆరోపించారు. మరో నిరసనకారిణి మాట్లాడుతూ 2022 లో తన అకౌంట్‌ను సస్పెండ్ చేయడానికి ముందు దాదాపు నాలుగు సంవత్సరాలపాటు తాను అదే కంపెనీలో పనిచేసానన్నారు. కొన్ని నెలల తర్వాత తన భర్త మరణించడంతో స్థిరమైన ఉద్యోగం తనకు దొరకడం ఎంతో కష్టమైందన్నారు. నెలకు రూ.15,000జీతంతో కొంతకాలం వంట మనిషిగా పనిచేసిన తర్వాత తన యజమాని కుటుంబం ఢిల్లీకి వెళ్లిపోవడంతో ఆ ఉద్యోగాన్ని కూడా కోల్పోయానని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, చాలామంది గిగ్ వర్కర్లు ప్లాట్‌ఫారమ్స్‌ల్లో తమను గుర్తుపడితే తొలగించివేస్తారేమోనన్న భయంతో ముఖాలను కనబడకుండా తాము ధరించిన వస్త్రాలు, మాస్క్‌లతో కనబడకుండా కప్పి ఉంచి నిరసన ప్రదర్శనలో పాల్గొనడం గమనార్హం. సునీత మాట్లాడుతూ ఇటీవల తనకు రూ.2,295 విలువైన బుకింగ్ వచ్చిందని, అందులో నుంచి రూ.431 కమిషన్‌గా, రూ.970 'కంపల్సరీ క్రెడిట్ రీచార్జ్'గా తగ్గించబడి తీసుకోవాల్సివచ్చిందని వివరించారు. కార్మికులు ఖాతా సస్పెన్షన్లు, చెల్లింపు వివాదాలు లేదా భద్రతా సమస్యలను ఎదుర్కొన్నప్పుడు ప్లాట్‌ఫారమ్‌లు తమ బాధ్యత నుంచి తప్పించుకుంటున్నాయని జిపిఎస్‌డబ్ల్యుయు ప్రెసిడెంట్ సీమా సింగ్ ఆరోపించారు. లైంగిక వేధింపులు లేదా అర్ధరాత్రి భద్రతా ప్రమాదాల విషయంలో మహిళా కార్మికులకు పెద్దగా సహాయం లభించలేదని సింగ్ ఆరోపించారు. వారు అందించేది కేవలం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)చాట్ బాట్ మాత్రమేనని, వేధింపులు, దూషణలు ఎదుర్కొంటున్న మహిళకు అది ఏమాత్రం ఉపయోగపడదని సీమాసింగ్ చెప్పారు. తక్కువ జీతం, రక్షణలేని పరిస్థితులు, టైట్ వర్క్ డెడ్‌లైన్లపై ఢిల్లీలోని గిగ్ వర్కర్లు క్రిస్టమస్, నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా సమ్మె నిర్వహించిన కొన్ని వారాల తర్వాత ఈ నిరసన చోటుచేసుకుంది.

## బెంగాల్-జార్ఖండ్ బొగ్గు మాఫియా కేసుల్లో...'ఇడి' దాడులు

**ఢిల్లీ, కోల్‌కతా,అనన్సోల్, దుర్గాపూర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోదా**

**అక్రమ ఇసుక, బొగ్గు వ్యాపారం కేసుల దర్యాప్తులో భాగంగా సోదాలు కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడి**

**కోల్‌కతా:** అక్రమ ఇసుక, బొగ్గు వ్యాపారం సంబంధిత కేసుల దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరింత దూకుడు పెంచింది. జార్ఖండ్, పశ్చిమబెంగాల్ వ్యాప్తంగా పనిచేస్తున్న బొగ్గు మాఫియాకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాడుల్లో భాగంగా మంగళవారం పశ్చిమబెంగాల్, ఢిల్లీలోని పలు ప్రాంతాలలో తాజాగా సోదాలు నిర్వహించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ అధికారులు తెలిపారు. ఢిల్లీ, కోల్‌కతా, అసన్సోల్, దుర్గాపూర్, పశ్చిమ బర్ధమాన్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బృందాలు కేంద్ర సాయుధ పోలీసులు బలగాలతో కలిసి ఉదయం 630గంటల నుండి సోదాలు నిర్వహించాయని వారు చెప్పారు. సోదాలు జరిగిన ప్రదేశాలలో అసన్సోల్‌లో బుడ్‌బుడ్ పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా నియమితులైన ఆఫీసర్‌ఇన్‌చార్జి (ఒసి) మనోరంజన్ మండల్ నివాసం కూడా ఉంది. ఈసోదాలు అక్రమ ఇసుక, బొగ్గు వ్యాపారానికి సంబంధించిన దర్యాప్తులో భాగంగా కొనసాగుతున్నాయని ఒక సీనియర్ అధికారి తెలిపారు. బుడ్‌బుడ్ స్టేషన్‌లో ఇంకా అధికారికంగా బాధ్యతలు స్వీకరించని మండల్ అ వినీతి ఆరోపణల నేపథ్యంలో బరబానీ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు గత సంవత్సరం సస్పెన్షన్‌కు గురయ్యాడు.అనంతరం అసన్సోల్ పోలీస్ స్పెషల్ బ్రాంచ్‌కు అటాచ్ చేయబడ్డాడు.ఇటీవల ఆయన తిరిగి ఓసిగా పునర్నియమించబడిన విషయం ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ యాక్షన్ ద్వారా వెలుగుచూసింది. అంతేకాకుండా ఆ ప్రాంతంలోని పలువురు ఇసుక, బొగ్గు ట్రేడర్స్ నివాసాలు, కార్యాలయాలలో కూడా ఇడి సోదాలు జరిపింది. దుర్గాపూర్‌లోని సెప్కో ప్రాంతంలో కె.కె. మినరల్స్ యజమాని, ఇసుక వ్యాపారి ప్రబీర్ దత్తాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు నిర్వహించింది. అదే సమయంలో ఇడి అధికారులు ఏకకాలంలో ఆయన సోదరుడు అమిత్ దత్తా నివాసంపై కూడా దాడులు నిర్వహించాయి. ఇడి బర్ధమాన్ జిల్లాలోని బంక్‌ర, పశ్చిమ్, పుర్బా జిల్లాలో ఇసుక గనులను నిర్వహిస్తున్నదని, పనాగఢ్‌లో కార్యాలయాలు ఉన్నాయని అధికారులు చెప్పారు.పనాగఢ్‌లోని షేక్ హసీమ్ మీర్జా బేగ్, అందుల్స్ లోని భక్తర్‌నగర్ ఏరియాలో , పాండవేశ్వర్‌లో బొగ్గు వ్యాపారి షేక్ మైజుల్ ఇళ్లల్లో కూడా సోదాలు జరిగాయి. కోల్‌కతా, ఢిల్లీతోపాటు అనే ప్రదేశాలలో దాడులు జరుగుతున్నాయని వర్గాలు తెలిపాయి. ఈ కేసులో తొలి రౌండర్ సోదాలు గత ఏడాది నవంబరులో నిర్వహించగా రూ.14కోట్లకు పైగా నగదు, బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫక్షర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. జార్ఖండ్‌పశ్చిమబెంగాల్ సరిహద్దులో అతిపెద్ద అక్రమ బొగ్గు సరఫరా నెట్ వర్క్ పనిచేస్తున్నాయని పోలీసుల ఎఫ్‌ఐఆర్‌లు సూచించాయి. సోదాల సమయంలో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, ఇతర రికార్డులు ఎఫ్‌ఐఆర్‌లలో మోపబడిన ఆరోపణలను ధృవీకరిస్తున్నాయి. స్థానిక అధికారుల సహాయంతో నిర్వహింపబడుతున్న వ్యవస్థీకృత రాకెట్ ఆపరేటింగ్‌ను గుర్తించడానికి కూడా దారితీసిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలియజేసింది. పశ్చిమబెంగాల్, జార్ఖండ్ సరిహద్దు ప్రాంతాలలో ఈ సిండికేట్ చాలా సమర్థవంతంగా పనిచేస్తున్నదని భారీ నేరాల ద్వారా ఆదాయాన్ని సృష్టించుకుంటోందని ఇడి ఆరోపించింది. ఈ ఫెడరల్ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తున్న మరొక కుంభకోణం కేసు నుండి ఇది భిన్నంగా ఉంటుంది. దీనిలో గతనెలలో కోల్‌కతాలోని పొలిటికల్ కన్సల్టెన్సీ సంస్థ ఐపాక్ ప్రాంగణంపై దాడి చేసింది.

### శబరిమల బంగారం చోరీ కేసులో...

## 'మురారిబాబును ప్రశ్నించిన ఇడి'

**కొచ్చి :** దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన కేరళలోని శబరిమల గోల్డ్ 'నష్టం'తో సంబంధమున్న కేసులో ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డ్ (టిడిబి) మాజీ పరిపాలనా అధికారి మురారిబాబును మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రశ్నించింది. అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ దర్యాప్తు సంస్థ ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఏ) చట్టం కింద మురారి బాబు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిందని వారు వెల్లడించారు. కేరళ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఆ అధికారిని అరెస్ట్ చేయగా, ఇటీవల ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాగా ఈ దర్యాప్తులో భాగంగా 'ఇడి' మరొక మాజీటిడిబి పరిపాలనా అధికారి ఎస్.శ్రీకుమార్ స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేసింది. ఈ కేసులో గత నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలను ప్రారంభించింది. ఈ సోదాల సందర్భంగా చెన్నైలోని 'స్మార్ట్ క్రియేషన్స్' అనే సంస్థ ప్రాంగణంలో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టికి చెందిన రూ.1.3కోట్ల విలువైన 8 స్థిరాస్తులను స్తంభింపజేశామని, 100గ్రాముల బంగారు కడ్డీని స్వాధీనం చేసుకున్నట్లు ఇడి జనవరి 21న జారీ చేసిన ఒక ప్రకటనలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. రెండు ఎఫ్‌ఐఆర్‌లను పరిగణనలోనికి తీసుకుని కేరళ పోలీసులు జనవరి 9న పిఎంఎల్‌ఏ కేసు దాఖలు చేసింది. రాజకీయంగా సున్నితమైన ఈ కేసును ఇప్పటికే కేరళ రాష్ట్ర హైకోర్టు పర్యవేక్షణలో 'రాష్ట్ర సిట్' దర్యాప్తు చేస్తోంది. ఈ దర్యాప్తు అయ్యప్ప ఆలయంలోని వివిధ కళాఖండాల నుండి బంగారాన్ని దుర్వినియోగం చేయడానికి అధికారిక దుష్ప్రవర్తన, పరిపాలనా లోపాలు, నేరపూరిత కుట్ర సహా వరుస అవకతవకలకు సంబంధించినది. ద్వారకపాలక విగ్రహభాగాలు, పీఠం (పీఠాలు), గర్భగుడి తలుపు ఫ్రేమ్ ప్యానెల్‌లతో సహా ఆలయంలోని పవిత్రమైన బంగారుపూతతో కూడిన కళాఖండాలను అధికారిక రికార్డులలో ఉద్దేశపూర్వకంగా 'రాగిపలకలు'గా తప్పుగా చూపించి 2019–2025 మధ్యకాలంలో ఆలయ ప్రాంగణం నుంచి అనధికారికంగా తొలగించారని దర్యాప్తులో తేలిందని ఇడి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కళాఖండాలను తర్వాత చెన్నై, కర్ణాటకలోని 'స్మార్ట్ క్రియేషన్స్', 'రొద్దం జ్యూవెలర్స్'లకు ప్రైవేట్ సదుపాయాల కోసం రవాణా చేసి మరమ్మతు, రీప్లాంటింగ్ పని ముసులో రసాయనిక ప్రక్రియల ద్వారా బంగారాన్ని వెలికితీస్తున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన దర్యాప్తులో కనుగొంది.సేకరించిన బంగారం, సంబంధిత ఆస్తులు, నేరం ద్వారా వచ్చిన ఆదాయాన్ని నిందితులు తమ వద్ద ఉంచుకోవడం, బదిలీచేయడం, దాచడం వంటి పనులకు పాల్పడ్డారని 'ఇడి' తెలియజేసింది.

## బ్యాంకు చార్జీల బాదుడు...
## 21 వేల కోట్లు వసూలు!

**న్యూఢిల్లీ:** బ్యాంక్ ఖాతాల రుసుముల రూపంలో గత కొన్నేళ్లలో ప్రజల నుంచి వేల కోట్ల రూపాయలు వసూలయినట్లు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభకు వెల్లడించింది. దేశ వ్యాప్తంగా ఉన్న 11 ప్రభుత్వ రంగ బ్యాంకులు కనీస నిల్వలు లేని ఖాతాలపై గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రూ.8,092 కోట్లకు పైగా చార్జీలు వసూలు చేశాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఈ వసూళ్లు సంవత్సరానికో సారి గణనీయంగా పెరుగుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2022–23 లో కనీస నిల్వ లేని ఖాతాల నుంచి రూ.2,407.82 కోట్లు, 2023–24 లో రూ.2,909.10 కోట్లు, 2024–25లో రూ.2,775.91 కోట్లు వసూలు చేశాయి. అంటే ఖాతాలో డబ్బు లేకపోయినందుకే మూడేళ్లలో వేల కోట్ల రూపాయలు బ్యాంకుల ఖాతాల్లో చేరినట్లే. అలాగే ఖాతాదారుల మొబైల్ ఫోన్‌లకు సందేశాలు పంపినందుకు బ్యాంకులు రుసుముల పేరుతో భారీగా వసూలు చేశాయి. ఈ మొత్తం 2022–23లో రూ.1,193.19 కోట్లు, 202324లో రూ.976.98 కోట్లు, 2024–25లో రూ.1,217.60 కోట్లుగా ఉంది. మొత్తంగా ఎస్ఎంఎస్ సౌకర్యం ఒక్కటే ప్రజలపై వేల కోట్ల భారం వేసింది. బ్యాంకులకే కాదు, ప్రభుత్వ విధానాల్లో ఆలస్యం చేసిన వారిపైనా భారీ వసూళ్లు జరిగాయి.

## అజిత్ పవార్ అంత్యక్రియల్లో రెచ్చిపోయిన దొంగలు అరెస్ట్



**పుణె :** జనవరి 28న విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్ సహా ఐదుగురు మరణించిన విషయం తెలిసిందే. అయితే, జనవరి 29న బారామతిలో విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ఆయన అంత్యక్రియలు జరగ్గా కొందరు రెచ్చిపోయారు. ఈ కార్యక్రమంలో కొంతమంది దొంగలు తమ చేతివాటం చూపించారు. అంత్యక్రియలకు హాజరైన వారిలో దాదాపు 15మంది వ్యక్తులకు చెందిన రూ.30లక్షల విలువ చేసే బంగారు వస్తువులను కొట్టేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. నిందితులను రాజ్‌కుమార్ బాబురావు అథవాలే, మహ్మద్ అనీస్, ఎజాజ్ భగు మిరావాలే, మహ్మద్ సాదిక్, బాలు అలియాస్ దత్తాత్రయ బాబాన్ ధోత్రే, తుషార్ కైలాస్ మసాల్, నితిన్ అంకుష్ గైక్వాడ్‌లుగా గుర్తించారు. పలువురి బంగారు గొలుసులు, నగదు చోరీకి గురైనట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. సాంకేతిక, రహస్య సమాచారం ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి, నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్‌పి సందీప్ గిల్, ఎఎస్‌పి గణేష్ బిరాదార్, సబ్‌డివిజనల్ పోలీసు అధికారి సుదర్శన్ రాథోడ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ జరిగింది. నిందితుల నుంచి దొంగిలించబడిన వస్తువులను బాధితులకు అప్పగించేందుకు సమగ్ర విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు.

### రాజ్యాంగాన్ని పాటించలేకపోతే

## భారత్ విడిచి వెళ్లిపోండి

**వాట్సాప్, మెటాకు సుప్రీంకోర్టు వార్నింగ్**

**న్యూఢిల్లీ :** భారత రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని ప్రఖ్యాత సోషల్ మీడియా కంపెనీలు వాట్సాప్, మెటాలకు సుప్రీంకోర్టు హితవు పలికింది. భారత ప్రజల గోప్యతా (ప్రైవసీ) హక్కును కాపాడే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాము రాజీపడేది లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. దేశంలోని కోట్లాది పేద, నిరక్షరాస్య ప్రజలకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని వాట్సాప్, మెటాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. పేద మహిళ, రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే నిరుపేద వ్యక్తి, ఎవరైనా తమిళం మాత్రమే మాట్లాడే వ్యక్తి లాంటి వాళ్లకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని సోషల్ మీడియా కంపెనీలను సుప్రీంకోర్టు బెంచ్ నిలదీసింది. కొన్నిసార్లయితే తమలాంటి వ్యక్తులే ఆ పాలసీలను అర్థం చేసుకోలేక సతమతం అవుతుంటారని ధర్మాసనం పేర్కొంది. 2024 నవంబరు 18న వాట్సాప్ నిర్వాహక కంపెనీ మెటాపై రూ.213.14 కోట్ల జరిమానాను కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) విధించింది. వాట్సాప్ యూజర్ల సమాచారాన్ని అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీలకు షేర్ చేసే ప్రక్రియపైనా ఐదేళ్ల నిషేధాన్ని విధించింది. "వాడితే వాడండి, లేదంటే వదిలేయండి" అన్నట్టుగా వాట్సాప్ ప్రైవసీ పాలసీ ఉందని సీసీఐ వ్యాఖ్యానించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాట్సాప్, మెటా అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశాయి. మంగళవారం వీటిపై విచారణ నిర్వహించే క్రమంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తాజా వ్యాఖ్యలు చేసింది. భారత ప్రభుత్వ సంస్థ సిసిఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వాట్సాప్, మెటా కంపెనీల తరఫు న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, అఖిల్ సిబల్ వాదనలు వినిపించారు. నిలిపివేయండి (ఆప్ట్ ఔట్) అనే ప్రస్తావన తమ ప్రైవసీ పాలసీలో ఉందని, అలాంటప్పుడు యూజర్ల సమాచారాన్ని తాము వాణిజ్య ప్రకటనల సంస్థలకు బదిలీ చేయడంపై అభ్యంతరం ఎందుకని వాట్సాప్ తరఫు న్యాయవాదులు వాదించారు.



ఆప్ట్ ఔట్ లాంటి ఆప్షన్ల గురించి తమలాంటి వాళ్లకే సరిగ్గా తెలియదని, ఎక్కడో బిహార్‌లోని మారుమూల పల్లెల్లో ఉండే భారతీయులకు ఎలా తెలుస్తుందని సుప్రీంకోర్టు బెంచ్ ప్రశ్నించింది. ప్రైవసీ పాలసీ మాటున భారతీయ వాట్సాప్ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేస్తున్నారని మండిపడింది. ఇలా జరగకుండా అడ్డుకుంటామని ధర్మాసనం తేల్చి చెప్పింది.

**మెటా డేటా భద్రతపై సూచనలివ్వండి..**
**కేంద్రానికి ఆదేశం**

తుషార్ మెహతా వాదనతో సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ ఏకీభవిస్తూ రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని వాట్సాప్, మెటాలను హెచ్చరించారు. ఈ లిటిగేషన్‌లో భారత ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను కూడా ఒక పక్షంగా చేరుస్తున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియా యూజర్ల మెటా డేటా భద్రతపై తగిన సూచనలను తమకు సమర్పించాలని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను సీజేఐ ఆదేశించారు.

## యుపి ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ షాక్!

**68 వేల మందికి జీతాలు నిలిపివేత**

**లక్నో:** ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఆ రాష్ట్ర ఉద్యోగుల జీతాలకు బ్రేక్ వేసింది. ప్రభుత్వ ఉద్యోగులందరికీ 'ఆస్తుల వివరాలు చెప్పకపోతే జీతం లేదు' అనే కఠిన నిర్ణయం అమలులోకి వచ్చింది. ఈ ఒక్క ఆదేశంతో 68,000 మందికి పైగా ఉద్యోగుల జనవరి నెల జీతాలను నిలిపివేసింది. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచాలన్న లక్ష్యంతో తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఉత్తర ప్రదేశ్‌లో వివిధ శాఖల్లో కలిపి ఎనిమిది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఉద్యోగులందరూ 2025 డిసెంబరు 31 వరకు సంపాదించిన తమ ఆస్తుల పూర్తి వివరాలను 'మానవ సంపద' పోర్టల్‌లో 2026 జనవరి 31లోగా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ విషయంపై ముఖ్య కార్యదర్శి గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ వేలాది మంది ఉద్యోగులు చివరి తేదీ వరకు ఆస్తుల వివరాలు సమర్పించకపోవడం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ 'ఈ నిబంధనలపై ముందుగానే సమాచారం ఇచ్చాం. అనేక సార్లు రిమైండర్‌లు పంపాం. అయినా 68 వేల మందికి పైగా ఉద్యోగులు గడువులోగా ఆస్తి వివరాలు అప్‌లోడ్ చేయలేదు. అందుకే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వారి జనవరి జీతాలను నిలిపివేశాం' అని వివరించారు. కాగా శాఖల అధిపతులకూ ప్రభుత్వం కఠిన ఆదేశాలు జారీ చేసింది. తమ కింద పనిచేసే ఉద్యోగులు నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చూడాలని సూచించింది. గడువు దాటితే అది ప్రతికూల అంశంగా పరిగణించబడుతుందని హెచ్చరించింది. మరింత కఠినంగా, 2025 ఫిబ్రవరి 1 తర్వాత జరిగే పదోన్నతులను కూడా పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది. అయితే జీతాలు నిలిపివేయబడిన ఉద్యోగులకు ఇంకా ఒక అవకాశం ఉంది. ఇప్పటికీ తమ ఆస్తి వివరాలను 'మానవ సంపద' పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పంద ప్రకటన

### సంక్షిప్త చరిత్ర

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీకాలం (2017–2021) లో కూడా భారతదేశం – అమెరికా ఒక చిన్న వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపాయి. కానీ అది కార్యరూపం దాల్చలేదు.2018 జూలై, 2019 సెప్టెంబర్ మధ్య జరిగిన పలు దఫాల చర్చలలో ప్రతిపాదిత ఒప్పందంపై చర్చించారు. కానీ వ్యవసాయం, డిజిటల్ పన్నులు, సుంకాల వంటి అంశాలపై విభేదాల కారణంగా ఎటువంటి ఒప్పందం ఖరారు కాలేదు. ఆ తర్వాత, బైడెన్ పరిపాలన (జనవరి 2021 నుండి జనవరి 2025 వరకు) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరపడానికి ఆసక్తి చూపలేదు.

తాజాగా సోమవారం రాత్రి భారత్ అమెరికా ఒప్పందంపై ట్రంప్ ప్రకటన నేపథ్యంలో ఎప్పుడెప్పుడు ఏమి జరిగిందో తెలుసుకుందాం..

**2025 ఫిబ్రవరి 13:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాభారతదేశ వాణిజ్య సంబంధాన్ని మరింతగా పెంచుకోవడానికి అంగీకరించారని ఒక ఉమ్మడి ప్రకటన పేర్కొంది. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తుత 191 బిలియన్ల నుండి 500 బిలియన్‌ల డాలర్లకు రెట్టింపు చేయాలనే కొత్త లక్ష్యాన్ని ఇరువురు నాయకులు నిర్దేశించారు. పరస్పర ప్రయోజనకరమైన, బహుళ రంగాల ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఏ) మొదటి విడతపై 2025 శరదృతువు (సెప్టెంబర్ – డిసెంబర్)నాటికి చర్చలు జరపాలని వారు ప్రణాళికలు ప్రకటించారు.

**మార్చి 4–6:** వాణిజ్య,పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ వాషింగ్టన్ డిసిని సందర్శించారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్, వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్‌తో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు.

**ఏప్రిల్ 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ వస్తువులపై 26 శాతం (10 శాతం బేస్‌లైన్ సుంకం, 16 శాతం ప్రతి సుంకం) అదనపు దిగుమతి సుంకాన్ని ప్రకటించారు.



**ఏప్రిల్ 9 :**అమెరికా– భారత వస్తువులపై 26 శాతం పరస్పర సుంకాన్ని 90 రోజుల పాటు (2025 జూలై 9 వరకు) నిలిపివేసింది.

**ఏప్రిల్ 23— 29 :** నాటి భారత ప్రధాన సంధానకర్త రాజేశ్ అగర్వాల్ (ప్రస్తుతం వాణిజ్య కార్యదర్శి) ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా సహచరులతో మొదటి వ్యక్తిగత సమావేశం కోసం వాషింగ్టన్‌ను సందర్శించారు. సుంకాలు, నాన్ టారిఫ్ అడ్డంకులు,కస్టమ్స్ సులభతరంతో సహా 19 అధ్యాయాలపై నిబంధనలను వారు చర్చించారు.

**మే 17–20:** వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ వాషింగ్టన్‌ను సందర్శించి అమెరికా వాణిజ్య ప్రతినిధి గ్రీర్, అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్‌లను కలిశారు.

**జూన్ 4–10:** అమెరికా అదనపు వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ నేతృత్వంలోని అమెరికా ప్రతినిధి బృందం వారం రోజుల చర్చల కోసం భారతదేశాన్ని సందర్శించింది. చర్చలు మార్కెట్ యాక్సెస్, డిజిటల్ వాణిజ్యం, కస్టమ్స్ సులభతరం, శానిటరీ మరియు ఫైటోసానిటరీ చర్యలు, వాణిజ్యానికి సాంకేతిక అడ్డంకులు, చట్టపరమైన చట్రాన్ని కవర్ చేసాయి.

**జూన్ 26:** జూలై 9 గడువుకు ముందు విభేదాలను పరిష్కరించుకోవడానికి, అగర్వాల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం తదుపరి చర్చల కోసం మరోసారి వాషింగ్టన్‌ను సందర్శించింది.

**జూన్ 27:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారతదేశంతో అమెరికా ఒక 'అత్యంత పెద్ద' వాణిజ్య ఒప్పందాన్ని చేసుకోబోతోందని అన్నారు.

**జూలై 31:** 2025 ఆగస్టు 7 (భారత కాలమానం ప్రకారం ఉదయం 9.30 గంటలకు ) నుండి అమలులోకి వచ్చే 25 శాతం సుంకాన్ని అమెరికా ప్రకటించింది.

**ఆగస్టు 6 :** రష్యా చమురును న్యూఢిల్లీ నిరంతరం కొనుగోలు చేస్తున్నందుకు జరిమానాగా, ట్రంప్ భారతదేశం నుండి వచ్చే వస్తువులపై అదనంగా 25 శాతం సుంకాన్ని విధించారు. ఈ ఉత్తర్వు తర్వాత, కొన్ని మినహాయింపుల జాబితాలోని వస్తువులు మినహా, భారతీయ వస్తువులపై మొత్తం సుంకం 50 శాతానికి పెరిగింది. ఇది 2025 ఆగస్టు 27 నుండి అమలులోకి వస్తుందని ప్రకటన.

**సెప్టెంబర్ 16:** యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ కార్యాలయ అధికారులు భారతదేశంలో వాణిజ్య ఒప్పందంలోని వివిధ అంశాలపై చర్చలు జరిపారు. ఈ విషయంలో ప్రయత్నాలను ముమ్మరం చేయాలని నిర్ణయించారు.

సెప్టెంబర్ 22: వాణిజ్య చర్చల కోసం గోయల్ న్యూయార్క్‌కు వెళ్లారు. ఆయనతో పాటు అగర్వాల్ కూడా ఉన్నారు.

**అక్టోబర్ 15–17:** చర్చల కోసం భారత బృందం వాషింగ్టన్‌లో ఉంది. ఆరు అధికారిక రౌండ్ల చర్చలు జరిగాయి.

**డిసెంబర్ 10:** డిప్యూటీ యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విట్జర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం, భారతీయ వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్‌తో రెండు రోజుల వాణిజ్య చర్చల కోసం జాతీయ రాజధానికి వచ్చింది.

2026 జనవరి 12: భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్, వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఇరుపక్షాలు క్రియాశీలకంగా నిమగ్నమై ఉన్నాయని నొక్కి చెప్పారు.

**జనవరి 31:** 'ఫాదర్ ఆఫ్ ఆల్ అగ్రిమెంట్స్' అయిన ఈ ఒప్పందం పురోగతి గురించి అడిగినప్పుడు, మంచి చర్చలు జరుగుతున్నందున భారతదేశం దీనిని అమెరికాతో 'త్వరగా' ముగించడానికి కృషి చేస్తోందని గోయల్ అన్నారు.

**2026 ఫిబ్రవరి 2:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో టెలిఫోన్ సంభాషణ తర్వాత సోమవారం నాడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, భారతదేశం –అమెరికా ఒక వాణిజ్య ఒప్పందంపై అంగీకరించాయని, దీని ప్రకారం వాషింగ్టన్ భారతీయ వస్తువులపై పరస్పర సుంకాన్ని ప్రస్తుత 25 శాతం నుండి 18 శాతానికి తగ్గిస్తుందని తెలిపారు.

# ఒత్తిళ్ల ఒప్పందాలు!

సుమారు వారం రోజుల వ్యవధిలో మన దేశం రెండు కీలక అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. ఒకటి పాశ్చాత్య ఖండంలోని శక్తివంతమైన ఆర్థిక సమాఖ్య యూరోపియన్ యూనియన్ (ఇయు)కాగా, మరొకటి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక శక్తి అమెరికా. అధికారిక ప్రకటనల్లో ఈ ఒప్పందాలను చరిత్రాత్మక విజయాలుగా, భారీ మార్కెట్ ప్రవేశ అవకాశాలుగా, ఎగుమతులకు సువర్ణావకాశాలుగా అభివర్ణిస్తున్నారు. కానీ ఈ ప్రకటనల వెనుక ఉన్న వాస్తవాలు, మౌనంగా దాచి ఉంచిన నిబంధనలు, ప్రజాస్వామ్య ప్రక్రియను పక్కన పెట్టిన విధానం అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. దేశ భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఒప్పందాలు నిజంగా సమాన భాగస్వామ్యాలా? లేక ఆర్థిక ఒత్తిళ్లకు లోబడి తీసుకున్న రాజకీయ నిర్ణయాలా? దేశ ఆర్థిక వ్యవస్థకు ఇవి బలమా లేక దీర్ఘకాలిక బలహీనతల విత్తనాలా? అన్న ప్రశ్నలు ప్రతిధ్వనిస్తున్నాయి. వివిధ ప్రతిపక్ష పార్టీలు, పలువురు నేతల అభిప్రాయాలు, అభ్యంతరాలను గమనిస్తే, ఈ రెండు ఒప్పందాలపై అనుమానాలు పెరుగుతాయి. ఒప్పందాల విషయంలో పార్లమెంటును పక్కన పెట్టడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే. ఏ అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందమైనా కేవలం ఆర్థిక పత్రం కాదు. అది రైతు జీవితం, కార్మిక భవితవ్యం, వినియోగదారుల భద్రత, చిన్న పరిశ్రమల ఉనికిని నేరుగా ప్రభావితం చేసే రాజకీయ – సామాజిక నిర్ణయం. అలాంటి ఒప్పందాల విషయంలో పార్లమెంటుకు పూర్తి వివరాలు తెలియజేయడం, విస్తృత చర్చ జరపడం ప్రజాస్వామ్యానికి మూలం. కానీ ఇక్కడ పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ఒప్పందాల వివరాలు దేశ శాసనసభ ముందు ఉంచకముందే, విదేశీ ప్రకటనలు, సోషల్ మీడియా సందేశాలు, అర్ధాంతర వ్యాఖ్యల ద్వారానే ప్రజలకు సమాచారం అందుతున్నది. దీనిని కేవలం విధానపరమైన లోపంగా చూడకూడదు. ముమ్మాటికీ ఇది ప్రజాస్వామ్య ఆచరణకు ఏర్పడిన అతిపెద్ద ప్రమాదం. దేశ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు, చిన్న వ్యాపారులకు, కార్మికులకు ఈ ఒప్పందాల వల్ల ఎలాంటి లాభం కలుగుతుందనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. ఈ ఒప్పందాలపై మొదటగా తలెత్తే సందేహం వ్యవసాయ రంగం గురించే. భారత దేశంలో వ్యవసాయం కేవలం ఒక ఆర్థిక రంగం కాదు.. కోట్లాది కుటుంబాల జీవనాధారం, సామాజిక స్థిరత్వానికి మూలం. విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు దేశీయ మార్కెట్లోకి తక్కువ సుంకాలతో ప్రవేశిస్తే, దేశంలో రైతుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్న. రైతు సమస్యలు దశాబ్దకాలంగా నిర్లక్ష్యానికి గురవుతునే ఉన్నాయి. అదే పంథా ఇంకా కొనసాగుతునే ఉంది. ప్రకృతి మీద ఆధార పడి, అప్పుల మధ్య, మద్దతు ధరల అనిశ్చితిలో మన రైతు బతుకీడుస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ వ్యవసాయ దిగుమతులకు ద్వారాలు తెరవడం అంటే, దేశీయ రైతును మార్కెట్ నుంచి నెమ్మదిగా బయటకు నెట్టివేయడమే. ఇలాంటి ఆర్థిక విధానాలు సామాజిక విపత్తులకు ఆహ్వానం పలుకుతాయి. అధికారిక ప్రకటనలను అనుసరించి, అమెరికా నుంచి భారీ మొత్తంలో వస్తువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఎగుమతులతో పోలిస్తే, దిగుమతుల విలువ కొన్ని రెట్లు అధికంగా ఉంటాయి. అభివృద్ధి చెందిన దేశంతో, అసమానతలు నిండి ఉన్న దేశాన్ని పరుగులు తీయించడంలో అర్థం ఏమిటో కేంద్రానికే తెలియాలి.

భారత ఆర్థిక వ్యవస్థలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వెన్నెముకలాంటివి. ఇవే ఎక్కువ ఉపాధిని కల్పిస్తున్నాయి. కానీ వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశీ ఉత్పత్తులు తక్కువ ధరలకు మార్కెట్లోకి వస్తే, ఈ పరిశ్రమలు పోటీలో నిలబడలేవు. తక్కువ ఉత్పత్తి వ్యయం, భారీ సాంకేతిక ఆధిక్యం కలిగిన విదేశీ సంస్థలతో పోటీ పడటం చిన్న వ్యాపారుల కు అసాధ్యం. ఫలితంగా మూసివేతలు, ఉద్యోగ నష్టాలు, ఆర్థిక అస్థిరత... దేశంలో ఔషధ రంగం ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందింది. తక్కువ ధరలో మందులు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. కానీ వాణిజ్య ఒప్పందాల్లో మేధోసంపత్తి హక్కులపై కఠిన నిబంధనలు ఉంటే, జనరిక్ మందుల తయారీకి అడ్డంకులు ఏర్పడతాయి. ఇది ప్రజారోగ్యంపై నేరుగా ప్రభావం చూపుతుంది. పాడి పరిశ్రమకు సైతం ఇలాంటి సమస్యలు తప్పవు. దేశ ప్రయోజనాలను గుర్తించకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించకుండా చేసుకునే ఒప్పందాల వల్ల ఎవరికి ప్రయోజనం? పైగా, ఆర్థిక ఒప్పందాలు కేవలం వాణిజ్య పరిమితుల్లోనే ఉండవు. అవి విదేశాంగ విధానాన్ని కూడా ప్రభావితం చేస్తాయి.

ఒక దేశంతో ఆర్థికంగా అధికంగా అనుసంధానం కావడమం టే, ఇతర వ్యూహాత్మక భాగస్వామ్యాలను అభద్రతకు గురిచేయడమే. ఇంధన, విద్యుత్ వనరుల కొనుగోళ్లలో మార్పులు, సంప్రదాయ భాగస్వాములతో దూరం పెరగడం, కొత్త రాజకీయ ఒత్తిళ్లు వంటి సమస్యలు వెన్నంటే ఉంటాయి. ఇవి దేశ విదేశాంగ స్వేచ్ఛను కుదించే ప్రమాదం ఉంది. బహుళ ధ్రువ ప్రపంచంలో స్వతంత్ర నిర్ణయాలు పనికిరావన్నది నిజం. అన్నిటినీ మించిన అత్యంత ప్రమాదకరమైన అంశం పారదర్శకత లోపం. ప్రజలకు, పార్లమెంటుకు పూర్తి సమాచారం ఇవ్వకుండా తీసుకునే నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి ముప్పు. ఈ రోజు వాణిజ్య ఒప్పందాలైతే.. రేపు రక్షణ, శక్తి, డేటా విధానాలా? అన్న అనుమానం సహజం. ఒకవైపు ప్రపంచ మేటి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదగుతున్నామనే ప్రకటనలు... మరోవైపు ఇయు, అమెరికాతో చాటుమాటు ఒప్పందాలు.. రెంటికీ మధ్య చెప్పలేని అగాథం. అభివృద్ధి అంటే కేవలం పెద్ద మార్కెట్లకు ప్రవేశం కాదు. అది సమాన అవకాశాలు, దేశీయ రంగాల రక్షణ, సామాజిక న్యాయం. రైతు ఆత్మహత్యలు పెంచి.. చిన్న పరిశ్రమలను మూత పెట్టి.. యువతను నిరుద్యోగులుగా మార్చే విధానాలను అభివృద్ధి అనలేం. ఒప్పందాలు తప్పుకాదు.. అవసరం. కానీ, అవి జరిగిన తీరు.. వాటిలోని అంశాలు కీలకం. పరస్పర సహకారాన్ని, వ్యాపారవాణిజ్య సంబంధాలను ఎవరూ కాదనరు. కానీ, వాటివల్ల ఎవరు లాభపడుతున్నారన్నది కీలకం. సమానత్వంపై, పారదర్శకతపై, జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి న ఒప్పందాలను స్వాగతించాలి. మద్దతునివ్వాలి. అయితే, ఒప్పందాలపై చర్చ జరగాలి. ప్రభావాలను నిజాయితీగా అంచనా వేయాలి. లేకపోతే, ఈ రోజు చరిత్రాత్మక విజయంగా పేర్కొంటున్న ఒప్పందాలు, రేపు చరిత్రలో అతిపెద్ద తప్పిదాలుగా మారే ప్రమాదం లేకపోలేదు.



## మా పార్టీ నిర్ణయాలను మేమే తీసుకుంటాం

ఎన్‌సిపి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడి హోదాలో అజిత్ పవార్ తర్వాత మార్పు ప్రక్రియను నేను బాధ్యతాయుతంగా పర్యవేక్షిస్తున్నాను. ఎవరు, ఎప్పుడు, ఎలా, ఏ పదవిలో ఉంటారనే బాధ్యత నాపై ఉంది. దానిని నెరవేరుస్తున్నాను. మా పార్టీ విషయాలను నిర్ణయించడానికి వేరేవారికి ఏమి అధికారం ఉంది? మా పార్టీకి సంబంధించిన నిర్ణయాలను మేమే తీసుకుంటాం. ఆ ప్రక్రియలోనే ఉన్నాం. విలీనం విషయానికొస్తే, ముందుగా మేము పార్టీలోని అన్ని అంతర్గత విషయాలను పరిష్కరించి, ఆ తర్వాతే ఇతర విషయాల గురించి ఆలోచిస్తాం. ఆ అంశం నేడు మా ముందు లేదు. ప్రస్తుతం మా ముందున్న అంశాలలో ఎన్‌సిపి శాసనసభాపక్షానికి ఎవరు నాయకత్వం వహిస్తారనేది ఇప్పటికే నిర్ణయమైపోయింది. పార్టీకి ఎవరు నాయకత్వం వహిస్తారనే ప్రక్రియ కొనసాగుతోంది.

– ఎఎన్ఐతో ఎన్‌సిపి వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్




## కేన్సర్ పట్ల కనీస అవగాహన కలిగి ఉందాం!

ఖచ్చితమైన చికిత్స అందుబాటులో లేని కారణంగా కేన్సర్ వ్యాధితో పెద్ద సంఖ్యలో రోగులు మరణించడం ఒక ప్రపంచ ప్రజారోగ్య సమస్యగా మారింది. శరీరంలోని ఏ భాగానికి చెందిన కణజాలమైనా నియంత్రణ లేకుండా అపరిమితంగా పెరగడంతో ట్యూమర్స్ ఏర్పడడంతో పాటు ఇతర శరీర కణజాలాలు కూడా విధ్వంసం చేయబడడాన్ని కేన్సర్ అని అర్థం చేసుకోవాలి. నాన్‌కమ్యూనికబుల్ వ్యాధుల్లో గుండె జబ్బుల(63.3 శాతం) తర్వాత 2వ అత్యధిక మరణాలకు కారణం అవుతున్న క్యాన్సర్ (18.1 శాతం) ఒక ప్రపంచ స్థాయి సమస్యగా గుర్తించబడింది. ఊపిరితిత్తులు, రొమ్ము, గర్భాశయ, ప్రొస్టేట్, చర్మం, జీర్ణనాళ కేన్సర్లు అతి ముఖ్యమైనవి. మహిళల్లో రొమ్ము, గర్భాశయ కేన్సర్లు అధికంగా కనిపిస్తే, పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల కేన్సర్లు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఊపిరితిత్తుల కేన్సర్ మహిళలు, పురుషుల్లో కూడా ఎక్కువగానే కనిపిస్తుంది. పిల్లల్లో (బాలలు, బాలికలు) లింఫోయిడ్ ల్యుకేమియా(రక్త) కేన్సర్ అధికంగా కనిపిస్తున్నది. ఈ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడానికి, నివారణ మార్గాలు, చికిత్స మార్గాలు, రోగ లక్షణాలు లాంటి అంశాలను చర్చించే వేదికగా ప్రతి ఏట 04 ఫిబ్రవరి రోజున ప్రపంచ కేన్సర్ దినం నిర్వహించుట 2000 సంవత్సరం నుంచి ప్రారంభమైంది.

**కేన్సర్ కారణాలు, రోగ లక్షణాలు, చికిత్స మార్గాలు:**

కేన్సర్ వ్యాధి రావడానికి ముఖ్య కారణాలుగా జన్యు మార్పులు, అనువంశిక మార్గాలు, పొగ తాగడం, అధిక ఆల్కహాల్ సేవనం, స్థూలకాయం, పర్యావరణ కాలుష్యం, ప్రమాదకర రసాయనాలతో పని చేయడం, రేడియోషన్‌కు గురి కావడం, ప్రాసెస్డ్ ఫుడ్, శారీరక వ్యాయామం కొరవడడం, నిశ్చల జీవనశైలి, ఆలస్యంగా గుర్తించడం, అవగాహన లోపం, పేదరికం, సూర్యకిరణాల్లో అతినీలలోహిత కిరణాలకు గురికావడం లాంటివి పేర్కొనబడినవి. కేన్సర్ వ్యాధి రోగ లక్షణాల్లో గడ్డలు లేదా ట్యూమర్స్ ఏర్పడడం, బరువు తగ్గడం, రక్తస్రావం కలగడం, అలసట, చర్మ మార్పులు, దగ్గు, మలబద్ధకం, మింగడంలో అసౌకర్యం, గురక, అజీర్ణం, జ్వరం, రక్తహీనత, సంతానోత్పత్తి సమస్యలు, చమట పట్టడం, దురలవాట్లు, కుటుంబ చరిత్ర, నిరక్షరాస్యత లాంటివి వస్తాయి. కేన్సర్ నిర్ధారణలో రక్త పరీక్షలు, ఇమేజింగ్ పరీక్షలు, ఎండోస్కోపీ లాంటివి వినియోగించబడుతున్నాయి. కేన్సర్ చికిత్సలో సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, హార్మోన్ థెరపీ, స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ లాంటి విధానాలు అందుబాటులో ఉన్నాయి.

**తీసుకోవలసిన జాగ్రత్తలు :** పోషకాహారం తీసుకోవడం, తరుచుగా పరీక్షలు చేయించుకోవడం, శరీర బరువు నియంత్రణలో ఉంచుకోవడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, పొగాకు ఉత్పత్తులకు చరమగీతం పాడడం, శారీరక వ్యాయామం, టీకాలు తీసుకోవడం, ఇన్‌ఫెక్షన్ కాకుండా చూసుకోవడం, చురుకైన దినచర్య పాటించడం, సూర్యుడి అతినీలలోహిత కిరణాలు సోకకుండా జాగ్రత్త పడడం లాంటివి తప్పనిసరిగా పాటించాలి. కేన్సర్ రోగులకు చికిత్సలు చేస్తున్న ఆంకాలజీ వైద్యులు, రేడియాలజిస్టులు, సర్జన్లు, ప్యాథాలజిస్టులు, ఆంకాలజీ నర్సుల సేవలకు కృతజ్ఞతలు తెలిపే సందర్భంగా కూడా ప్రపంచ కేన్సర్ దినం వేదికలు ఉపయోగపడాలి. నిరక్షరాస్యత, పేదరికం, పోషకాహారలోపం లాంటి కారణాలతో మన దేశంలో కేన్సర్ అతిగా ప్రబలుతున్నందున ప్రతి ఒక్కరు దీనిపట్ల అవగాహన కలిగి ఉండడం, అవగాహన కల్పించడం నిరంతరం జరగాలి. కేన్సర్ రోగులులేని భారతాన్ని నిర్మించే కృషి చేయాలి.

(నేడు 'ప్రపంచ క్యాన్సర్ డే' సందర్భంగా)

# కేంద్రం ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచిన 16వ ఆర్థిక సంఘం

ఆర్.సూర్యకుమార్

పదహారవ ఆర్థిక సంఘం సమాంతర పంపిణీ (హారిజాంటల్ డివల్యూషన్) ఫలితాలను ఒక సాంకేతిక పునర్వ్యవస్థీకరణగానే విస్తృతంగా భావిస్తున్నారు. ఇది జాతీయ ఉత్పత్తికి రాష్ట్రాలు అందించే సహకారాన్ని స్పష్టంగా గుర్తిస్తూ ఆర్థిక పనితీరుకు ప్రతిఫలాన్ని ఇచ్చేదిగా కనిపిస్తోంది. కానీ ఈ గణాంకాల వెనుక ఒక ముఖ్యమైన రాజకీయఆర్థిక మార్పు దాగి ఉంది. భారతదేశ సమాఖ్య ఆర్థిక ఒప్పందం, సమానత్వం నుండి మారి షరతులతో కూడిన ప్రోత్సాహకాల దిశకు మళ్లుతోంది. అదే సమయంలో, పంపిణీ చేయదగిన నిధుల పరిధి (డివిజబుల్ పూల్)కు వెలుపల ఉండే సాధనాల ద్వారా కేంద్రం పన్ను వనరులపై తన నియంత్రణను కొనసాగిస్తూనే ఉంది.

కొత్త ఫార్ములా ప్రకారం అత్యధిక ప్రయోజనం పొందిన ఏకైక రాష్ట్రంగా కర్ణాటక నిలవడం ఈ వైరుధ్యాన్ని అసాధారణ స్పష్టతతో వెల్లడిస్తుంది. పదిహేనవ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం పంపిణీ చేయదగిన నిధుల వాటాలో 3.65 శాతంగా ఉన్న కర్ణాటక వాటా, 2026–31 పంపిణీ కాలానికి 4.13 శాతానికి పెరుగుతుంది. దీంతో ఆ రాష్ట్రానికి అదనంగా రూ.7,387 కోట్ల లబ్ధి చేకూరుతుంది. మొత్తం కలుపుకొని సుమారు రూ.63,050 కోట్ల నిధులు బదిలీ అవుతాయి. ప్రధానంగా 'స్థూల జాతీయోత్పత్తికి సహకారం' అనే అంశానికి 10 శాతం వెయిటేజీని ఇచ్చినందున ఈ లబ్ధి చేకూరింది. గతంలో ఈ ప్రాతిపదిక స్పష్టమై న రూపంలో లేదు. ఇది అధిక సంఘటిత రంగం, అధిక సేవా రంగ ప్రాధాన్యత, జాతీయ, ప్రపంచ విలువ గొలుసులలో లోతైన అనుసంధానం ఉన్న రాష్ట్రాలకు విపరీతంగా ప్రయోజనం చేకూరుస్తుంది.

అయితే, ఈ పైపై లాభం భారత ఆర్థిక సమాఖ్య వ్యవస్థకు సంబంధించిన మరింత కీలకమైన కొలమానాన్ని మరుగున పరుస్తోంది. రాష్ట్రా లు కేంద్ర ఖజానాకు అందించే ప్రతి రూపాయికి తిరిగి పొందే వాటా ఎంత? భారతదేశ జిడిపిలో కర్ణాటక వాటా సుమారు 8.5 – 9 శాతం, అలాగే ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్ను,సేవలపై జిఎస్‌టిల ద్వారా వచ్చే నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో 12 నుండి 14 శాతం వరకు ఉంది. అయినప్పటికీ, పన్నుల పంపిణీ తర్వాత కేంద్ర పన్నులలో దాని వాటా కేవలం 4 శాతానికి కొద్దిగా ఎక్కువగా ఉంది. 16వ ఆర్థిక సంఘం సర్దుబాటు తర్వాత కూడా, అనేక అంచనాల ప్రకారం కర్ణాటక కేంద్రానికి అందించే ప్రతి రూ.1కి 50 పైసలు నుంచి 55 పైసల మధ్య మాత్రమే తిరిగి పొందుతోంది. పదిహేనవ ఆర్థిక సంఘం కాలంలోని 50 పైసల కంటే తక్కువ స్థాయి నుండి ఇది స్వల్పంగా మాత్రమే మెరుగుపడింది.

ఈ అసమతుల్యత కేవలం కర్ణాటకకే పరిమితం కాదు. జిడిపిలో దాదాపు 8, కేంద్ర పన్ను ఆదాయంలో సుమారు 10 శాతం వాటా అందించే గుజరాత్ కొత్త ఫార్ములా ప్రకారం అదనంగా రూ.4,228 కోట్లు పొందనుంది. హర్యానా రూ.4,090 కోట్లు పొందుతుంది. అయినప్పటికీ, ఈ రెండు రాష్ట్రాలు నిర్మాణపరంగా నికర సహకారులుగా (నెట్ కాంట్రిబ్యూటర్స్) మిగిలిపోయాయి. కేరళ వాటా 1.93 శాతం నుండి 2.38 శాతానికి పెరిగి, రూ.6,975 కోట్లు అదనంగా లభించింది. అధిక తలసరి ఆదాయం, మెరుగైన జనాభా సూచికల కలయిక కారణంగా ఆ రాష్ట్రం లబ్ధి పొందింది. కానీ, ఇక్కడ కూడా కేంద్ర పంపిణీ ద్వారా దక్కే నిధుల కంటే రాష్ట్రం స్వంత పన్ను కృషి, వినియోగ ఆధారిత జిఎస్‌టి వాటా చాలా ఎక్కువగా ఉన్నాయి.

దీనికి విరుద్ధంగా మధ్యప్రదేశ్ ఈ ఫార్ములా పునఃపంపిణీ తర్కానికి మరో కోణాన్ని చూపిస్తుంది. సుమారు రూ.1.12 లక్షల కోట్ల కేటాయింపును పొందినప్పటికీ, పంపిణీ చేసే నిధులలో(డివిజబుల్ పూల్‌లో) దాని వాటా 7.85 శాతం నుండి 7.35 శాతానికి పడిపోయింది. పాత ఫార్ములాతో పోలిస్తే దానికి దక్కినదానిలో రూ.7,677కోట్లు తగ్గింది. ఈ తగ్గింపు సామర్థ్యం సంబంధిత కొలమానాలు, కొత్త జిడిపి సహకార ప్రాతిపదికన తక్కువ స్కోర్లను ప్రతిబింబిస్తుంది. ఇది ఆదాయ అంతరం, జనాభా ఆధారిత సమానత్వానికి అధిక ప్రాధాన్యతనిచ్చిన మునుపటి ఆర్థిక సంఘాల విధానం నుండి వైదొలిగినట్లు స్పష్టమైన మార్పును సూచిస్తుంది.

విడిగా చూసినప్పుడు, ఇలాంటి పునర్వ్యవస్థీకరణను 'నైతిక ప్రమాదం' (మోరల్ హజార్డ్), దీర్ఘకాలిక ఆధారపడటంపై ఒక దిద్దుబాటు చర్యగా సమర్థించవచ్చు. అయితే మొత్తంగా చూస్తే, రాష్ట్రాల మధ్య ఆదాయ అసమానతలు ఇంకా ఎక్కువగా ఉన్న దేశంలో, ఆర్థిక సమానత్వం భవిష్యత్తుపై ఇది అసౌకర్యమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. మొదటి ఐదు రాష్ట్రాల తలసరి స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జిఎస్‌డిపి)దిగువ ఐదు రాష్ట్రాల కంటే ఇప్పుడు 3.5 రెట్లు ఎక్కువగా ఉంది. గత దశాబ్దకాలంలో వరుస పంపిణీలు జరిగినప్పటికీ ఈ వ్యత్యాసం నిష్పత్తి ఏమాత్రం తగ్గలేదు.




అసలైన లోపం సమాంతర పంపిణీ సూత్రం (హారిజాంటల్ ఫార్ములా)లో లేదు. అది నిలువు పంపిణీ సూత్రం(వెర్టికల్ ఫార్ములా), కుంచించుకుపోతున్న పంపిణీ చేసే నిధుల (డివిజబుల్ పూల్) తగ్గిపోతున్న పరిణామంలో ఉంది. **2026—31 కాలానికి రాష్ట్రాల వాటాను నికర ఆదాయంలో 41శాతంగా కొనసాగించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం కాగితంపై స్థిరంగా కనిపిస్తున్నప్పటికీ, వాస్తవానికి పంచుకోదగిన మొత్తం పన్ను ఆదాయంలో క్రమంగా తగ్గుదలను ఇది కప్పిపుచ్చుతోంది. గత పదేళ్లలో సెస్‌లు, సర్‌ఛార్జ్‌ల ద్వారా సేకరించిన మొత్తం పన్ను ఆదాయం 9–10 శాతం నుండి 18–20 శాతానికి పైగా పెరిగింది. వీటిలో ఏదీ కూడా రాష్ట్రాలకు పంపిణీ చేయబడడం లేదు. ఫలితంగా, పంపిణీ చేసే నిధులు 41 శాతంగా స్థిరంగా ఉన్నప్పటికీ, ఆ నిధుల పునాది తగ్గిపోయింది. ఇది కేంద్రం మొత్తం పన్ను రాబడిపై రాష్ట్రాల వాస్తవ హక్కును తగ్గిస్తోంది.**

ఈ నిర్మాణాత్మక మార్పు చాలా ముఖ్యం. ఎందుకంటే, రాజకీయంగా ముఖ్యమైన, ఆర్థికంగా డిమాండ్ ఉన్న రంగాలలో వ్యయ బాధ్యతలను నేడు రాష్ట్రాలే ఎక్కువగా తమ భుజాలపై మోస్తున్నాయి. ఆరోగ్యంపై మొత్తం ప్రభుత్వవ్యయంలో దాదాపు 60 శాతం, విద్యపై 55 శాతానికి పైగా, పట్టణ మౌలిక సదుపాయాలు, రవాణా, విద్యుత్ పంపిణీల మూలధన వ్యయంలో అత్యధిక భాగం రాష్ట్రాలే భరిస్తున్నాయి. కానీ వాటి స్వంత పన్ను ఆదాయాలు జిఎస్‌డిపిలో సగటున 7–8 శాతం మాత్రమే ఉన్నాయి. దీనికి భిన్నంగా కేంద్రం అధిక ఆదాయ వృద్ధిని, రుణాలను తీసుకునే వెసులుబాటును కలిగి ఉంది.

ఈ అసమానతను పదహారవ ఆర్థిక సంఘం ద్రవ్య క్రమశిక్షణ చట్రం మరింత కఠినతరం చేస్తుంది. రాష్ట్రాల ద్రవ్య లోటును జిఎస్‌డిపిలో 3 శాతానికి లోబడి ఉండాలని, బడ్జెట్ వెలుపల అప్పులను కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్‌కు మరింత బహిర్గతం చేయాలని ఆదేశించడం ద్వారా స్పష్టంగా నిరుత్సాహపరుస్తోంది.

ఉపజాతీయ(రాష్ట్రాల) స్వయంప్రతిపత్తిని నియంత్రించే పాలనను 16వ ఆర్థిక కమిషన్ బలోపేతం చేస్తోంది. మూలధన పెట్టుబడి కోసం రాష్ట్రాలకు ఇచ్చే వడ్డీలేని ఆన్‌లెండింగ్ ప్రత్యే క సహాయ పథకాల లోటు పరిమితి పరిధికి వెలుపల ఉన్నప్పటికీ, ఇవి కేంద్రం అభీష్టానుసారం, షరతులతో కూడి ఉంటాయి. ఇది నియమబద్ధ బదిలీలకు బదులుగా, చర్చలపై ఆధారపడటాన్ని ప్రోత్సహిస్తుంది.

ఇటీవలి కాలంలో లోటును పూడ్చుకోవడానికి రాష్ట్రాలు ఎక్కువగా మార్కెట్ రుణాలపై ఆధారపడుతున్నాయని కమిషన్ స్వయంగా అంగీకరించింది. ప్రస్తుతం రాష్ట్రాల మొత్తం అప్పులు జిఎస్‌డిపిలో 28–30 శాతం వరకు ఉన్నాయి. కానీ ఆర్థిక ఒడిదుడుకుల సమయంలో రాష్ట్రాలకు అవసరమైన వెసులుబాటును కమిషన్ పెద్దగా కల్పించలేదు. ఆచరణలో దీని అర్థం ఏమిటంటే, కేంద్రానికి ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే ఆర్థికంగా బలమైన రాష్ట్రాలే, స్థానిక ఆర్థిక సంక్షోభాలకు లేదా అభివృద్ధి ప్రాధాన్యతలకు ప్రతిస్పందించడానికి తమ స్వంత ఆర్థిక వనరులను వినియోగించుకోవడంలో కూడా అత్యంత పరిమితులను ఎదుర్కొంటున్నాయి.

మొత్తంగా చూస్తే, ఈ గణాంకాలు భారత సమాఖ్య వ్యవస్థలో ఒక లోతైన పునర్వ్యవస్థీకరణను సూచిస్తున్నాయి. 16వ ఆర్థిక సంఘం సమతుల్యతను పునరుద్ధరించకుండానే సహకారాన్ని ప్రోత్సహిస్తోంది. స్వయంప్రతిపత్తిని విస్తరించకుండానే సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తోంది. పన్నుల వ్యవస్థపై పెరుగుతున్న కేంద్రం ఆధిపత్యాన్ని పరిష్కరించకుండానే ఆర్థిక క్రమశిక్షణను కఠినతరం చేస్తోంది. పంపిణీ చేయని లెవీల ద్వారా కేంద్రం ఆదాయాలలో పెరుగుతున్న భాగాన్ని తన నియంత్రణలో ఉంచుకుంటున్నప్పటికీ, సహకారం అందించే రాష్ట్రాలకు పరిమితులతో కూడిన పంపిణీ నిధి (డివిజబుల్ పూల్) నుంచి స్వల్పంగా అధిక వాటాలను అందిస్తున్నారు.

ఆ కోణంలో, కర్ణాటక అతిపెద్ద 'లబ్ధిదారు'గా ఎదగడం అనేది వ్యవస్థ దాతృత్వాన్ని కాకుండా, దాని పరిమితులను వెల్లడిస్తోంది. జాతీయ ఉత్పత్తిలో దాదాపు పదో వంతు సహకారం అందిస్తూ, పన్నుల రూపంలో అంతకంటే ఎక్కువ అందిస్తున్న ఒక రాష్ట్రం, ఐదేళ్ల కాలంలో అదనంగా కొన్ని వేల కోట్ల రూపాయలను తిరిగి పొందడం గొప్పగా చెప్పుకుంటున్నాము. అంటే, దీని ద్వారా సమాఖ్య సమానత్వం ప్రమాణాలు ఎంత తక్కువగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

భవిష్యత్తు ఆర్థిక సంఘాలు ఆదాయాన్ని ఎవరు వసూలు చేస్తున్నారు, వ్యయ బాధ్యతలను ఎవరు మోస్తున్నారు అనే అంశాల మధ్య ఉన్న లోతైన అసమతుల్యతను పరిష్కరించకపోతే, సెస్‌ల పెరుగుదలను అరికట్టడం, పంపిణీ నిధి(డివిజబుల్ పూల్)ని విస్తరించడం లేదా ఉమ్మడి పన్నుల నిర్మాణాన్ని పునరాలోచించడం చేయకపోతే, భారతదేశం ఒక వింతైన సమాఖ్య నమూనాలో చిక్కుకుపోయే ప్రమాదం ఉంది. అందులో రాష్ట్రాలు పనితీరు ద్వారా నిర్ణయాలు చేయబడతాయి, నిబంధనల ద్వారా నియంత్రించబడతాయి, స్వల్పంగా మాత్రమే ప్రోత్సాహం పొందుతాయి. అదే సమయంలో కేంద్రం స్థిరంగా ఆర్థిక శక్తిని కూడగట్టుకుంటుంది. అటువంటి పరిస్థితుల్లో, ఏ రాష్ట్రం ఎక్కువ లాభం పొందింది అనేది ప్రశ్న కాదు, ఎక్కువ చెల్లించి, తక్కువ తిరిగి పొందే వ్యవస్థలో 'సహకార సమాఖ్య స్ఫూర్తి' అనే రాజ్యాంగ వాగ్దానం నిలబడుతుందా లేదా అనేదే అసలు ప్రశ్న.

(ఐపిఎ సర్వీస్)




యాసాని కరుణాకర్ రెడ్డి
రాష్ట్ర స్థానిక కార్యదర్శి
తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (STUTS)
986610320

## ఉరితాళ్ళవుతున్న... చదువులు

రైతు తన వ్యవసాయ పొలంలో కుటుంబంతో సహా ఆరుకాలం పండించిన పంటను నష్టధరకు మార్కెట్లో అమ్మినప్పుడు లేక ప్రకృతి వైపరీత్యాల వలన వ్యవసాయంలో నష్టం వచ్చినప్పుడు కొంతమంది రైతులు తమ మనోధైర్యాన్ని కోల్పోవడం వలన ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు అక్కడక్కడ చూస్తుంటాము. కానీ నెమలిలా ఆడుతూ పాడుతూ, లేగ దూడలా ఎగిరే వయసులో వారికి బరు వు, బాధ్యతలు ఏమీలేకున్నా కేవలం చదువు, ఆటలు మాత్రమే తెలిసిన వయసులో ఆ పసి మొగ్గలు ఉరితాళ్ళకు వేలాడుతున్న సందర్భాలు ఈ దేశంలో మాత్ర మే, ప్రత్యేకంగా ఈ రెండు తెలుగు రాష్ట్రాలలోనే ఎక్కువగా ఎందు కు జరుగుతున్నవి అనే ప్రశ్న ప్రతి మనిషి మెదడును తొలుస్తున్నది. కానీ ఆ ఆత్మహత్యలకు కారణం అన్వేషించ, విశ్లేషించే పనిని ఎవరూ చేయడం లేదు. విద్యార్థులకు ఉచిత విద్యను అందించవలసిన ప్రభుత్వాలు ఉచిత విద్యపై అనాసక్తి, అనాలోచిత నిర్ణయాల వలన విద్య కాస్త వికృత రూపం దాల్చి అది ప్రైవేటీకరణ, కార్పోరేటికరణ, ప్రపంచీకరణ, గ్లోబలైజేషన్‌ల చేతుల్లోకి చేరి చదువు చివరకు ఒక వ్యాపార వస్తువుగా మారడం వలన, ఆ చదువు వనరులు, వసతులు, నిధు లు, నియామకాలు లేక నిర్వీర్యమవుతున్న ప్రభుత్వ విద్యాసంస్థలలో దొరక్క పోవడం వల్ల బీద, బిక్క, పేద, మధ్యతరగతి, ధనికులు అందరూ ఎవరి స్థాయిని బట్టి ఆయా ప్రైవేట్ విద్యా సంస్థలలో విద్యను కొంటున్నారు. ఆ కొనే చదువులో కూడా విద్యాసంస్థల విపరీతమైన వ్యాపా ర పోకడల వల్ల అది తల్లిదండ్రులకు గుదిబండగా మారి, విద్యార్థుల మధ్య పోటీతత్వాన్ని పెంచి చదువు లేనిదే జీవితం వ్యర్థం అనే విధంగా భవిష్యత్తును భయంకరంగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు చూపెడుతున్నారు. చదువులో ఆ గమ్యాన్ని చేరుకోలేని విద్యార్థులు ఇటు విద్యాసంస్థల ఒత్తిడి, అటు తల్లిదండ్రులు కూడా లక్షల రూపాయలు వారిపై ఖర్చుపెట్టి పిల్లల విద్యాస్థాయిని కూడా చూడకుండా ఒత్తిడి చేయడం వల్ల ప్రతి సంవత్సరం వందల కొద్ది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ఆత్మహత్యలు కూడా కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు విశ్వవిద్యాలయా లు వచ్చిన తరువాతనే జరుగుతున్నాయి అనేది అక్షర సత్యం. ప్రపంచంలోని అనేక ధనిక దేశాలు ఉచిత విద్య, వైద్యాన్ని అందిస్తున్న సందర్భంలో భారతదేశం లో 99 శాతం పేదవారు, 1 శాతం ధనికులు ఉన్న ఈ దేశంలో 99 శాతం ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే పేద విద్యార్థుల యొక్క విద్యా సంస్థలను మూసివేస్తూ ఒక శాతం ధనికులు చదివే ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల వైపు మొగ్గుచూపడం బాధాకరం, అందుకే అన్ని వర్గాలవారి పిల్లలకు ఒకే విధమైన ఉచితమైన సమానమైన 'కామన్ స్కూల్ విద్యా విధానాన్ని' ప్రవేశపెట్టాలి. అప్పుడే విద్యార్థుల మధ్య స్నేహపూర్వక పోటీ ఏర్పడి ఒత్తిడి తగ్గుతుంది. అదేవిధంగా ప్రభుత్వాలు ఉద్యోగ నియామకాల కోసం ప్రభుత్వరంగ సంస్థలు, వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వా లపై ఉంది. సమాజంలో ఉమ్మడి కుటుంబాల ఊసే లేదు, బంధువులు తెలియరు, వరుసలు తెలియ వు కేవలం చదువే ధ్యేయమంటూ తల్లిదండ్రులు పిల్లలను శాసించడం వందకు వంద మార్కులు వచ్చినా కూడా తల్లిదండ్రులలో ఏదో వెలితి, ఏ డిగ్రీ చదివి న్యూటన్ గమన నియమాలను కనుగొన్నాడు, ఏ విద్య నేర్చి అరిస్టాటిల్ భూమ్యాకర్షణ సిద్ధాంతం రూపొందించాడు, ఏ కార్పొరేట్ కళాశాలలో చదివి ఐన్ స్టీన్ వెలిగే బల్బును కనుగొన్నాడు. ఇటువంటి శాస్త్రజ్ఞుల చరిత్రలు, స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన చరిత్రకారుల పుస్తకాలు, మహనీయుల పుస్తకాలను విద్యార్థులచే చదివించాలి.

## శ్రీలంక కోలుకోవడం సాధ్యమేనా?

హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం సముద్రాల సరిహద్దులతో ఏర్పడిన ద్వీప దేశంగా భారత దేశ తీరానికి 50 కిమీ దూరంలో ఉన్న శ్రీలంక 04 ఫిబ్రవరిన స్వాతం త్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లలో మునిగి ఉన్నది. ప్రస్తుతం 23.5 మిలియన్ల శ్రీలంక జనాభాలో 75 శాతం సింహళీస్, 11 శాతం శ్రీలంక తమిళులు, 9 శాతం వరకు ముస్లిమ్ మూర్‌లు 4 శాతం భారత తమిళుల జనాభా ఉన్నది. అత్యధిక సింహళీలు బుద్ధిస్టులుగా, తమిళులు హిందువులుగా రెండు గ్రూపుల మధ్య విభేదాలతో రెండున్నర దశాబ్దాల పాటు ఎల్‌టిటిఇ, అధిక జనాభా ఉన్న సింహళీస్ (ప్రభుత్వ సహకారంతో) మధ్య వర్గ పోరు (1976–2002)కూడా జరగడం, అనేక హింసాత్మక ఘటనలు చేటు చేసుకోవడం, చివరికి ఎల్‌టిటిఈ పోరాటాలను అడ్డుకోవడం, అంతం చేయడంచూసాం. శ్రీలంక ప్రభుత్వాలు, ఆర్థిక సంక్షోభాల నడుమ కొనసాగుతున్న శ్రీలంక ప్రయాణంలో ఆహార, ఇంధన, ఔషధాల కొరతలు కూడా తోడుకావడంతో పలు ప్రజా ఉద్యమాగ్నులు ఎగిసి పడడం చూసాం.




**చరిత్ర పుటల్లో శ్రీలంక .. సిలోన్:** 16వ శతాబ్దం లో శ్రీలంక తీరప్రాంతాలు పోర్చుగీస్ అధీనంలో, 17వ శతాబ్దంలో డచ్‌ల అధీనంలో పాలన కొనసాగింది. 1796 నుంచి ఈ ద్వీప ప్రాంతం బ్రిటీష్ అధీనంలోకి క్రమంగా మారడం, 1833లో పూర్తిగా బ్రిటీష్ పాలన పగ్గాలు పట్టి ఈ ద్వీపానికి 'సిలోన్'గా నామకరణం చేసి వలస పాలన కొనసాగించడం, వలస పాలన 1948 వరకు కొనసాగడం చూసాం. సిలోన్ ప్రాంతం 1972లో శ్రీలంక రిపబ్లిక్‌గా పేరు మారడం, 04 ఫిబ్రవరి 1948న పూర్ణ స్వతంత్ర పొందిన తనదైన రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య సామ్యవాద గణతంత్ర శ్రీలంకగా రూపాంతరం చెందడం జరిగింది. శ్రీలంక రాజధానిగా 'శ్రీ జయర్ధనేపుర కొట్టె (కొలంబో)' పాలన కేంద్రంగా పనిచేస్తున్నది. అనేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంక రానున్న రోజుల్లో శాంతియుతంగా ప్రగతి పథాన స్థిరంగా అడుగులు వేయాలని కోరుకుందాం, మన పొరుగు దేశవాసులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేద్దాం.

(ఫిబ్రవరి 4న శ్రీలంక స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా)

## పారిశ్రామిక ప్రాంతాల్లో సమ్మె విజయవంతం చేయండి

ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే వేలాదిమంది కార్మికులు ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో పాల్గొని నాలుగు లేబర్ కోడ్లు రద్దయి వరకు పోరాడాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు కాటేదాన్ కార్యాలయంలో జరిగిన కార్మికుల సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు రుద్రకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, ఉద్యోగ భద్రత లేదన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయకుండా పరిశ్రమ యాజమాన్యాలు కార్మికులతో ఎక్కువ గంటలు పనిచేయించి మోసం చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని, అన్ని సంఘాల నాయకులు కార్మికులు ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో పాల్గొనాలని పర్వతాలు, చంద్రమోహన్ పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కన్యగారి నర్సింహ్మరెడ్డి, నాయకులు జె విజయానంద్ గౌడ్, ఆనంద్ గౌడ్, జి సత్యం, వాణి, కృష్ణ, సదనంద్ గౌడ్, రామచంద్రయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పిసికె భాస్కర్, బచ్చలకూర స్వామి, బి సి డబ్ల్యు నాయకురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీని అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్‌దే : అంజయ్యయాదవ్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మున్సిపాలిటీని అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బిఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో కౌన్సిలర్ అభ్యర్థులకు బిఫామ్‌లను అందజేశారు. ఈసందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని , కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. మొదటి వార్డులో గౌస్ జానీ, 2వ వార్డులో చెట్ల నరసింహా, 3వ వార్డులో నందారం అశోక్ యాదవ్, 4వ వార్డులో చల్లా వాణి పాండురంగారెడ్డి, 5వ వార్డులో ఆశ్వినీ ప్రవీణ్, 6వ వార్డులో రాజేందర్ సింగ్, 7వ వార్డులో ఈశ్వర్ రాజు, 8వ వార్డులో బిక్షపతి, 9వ వార్డులో చేగూరి వేణుగోపాల్, 10వ వార్డులో అఖిల శివ, 11వ వార్డులో పిల్లి శారద శేఖర్, 12వ వార్డులో ఎంఎస్ నటరాజన్, 13వ వార్డులో కొండ లక్ష్మి మల్లేష్, 14వ వార్డులో బచ్చలి నరసింహా, 15వ వార్డులో కొండూటి మహేశ్వరీ, 16వ వార్డులో ఒగ్గు జయలక్ష్మి కిశోర్, 17వ వార్డులో గౌసియాభేగం సలీం, 18వ వార్డులో ప్రేమలత యుగేందర్, 19వ వార్డులో ఆరీఫ్‌బేగం అడ్డు, 20వ వార్డులో పిన్నమోని గోపాల్, 21వ వార్డులో జిటి వసంత శ్రీను, 22వ వార్డులో నడికుడ అనిత రఘునాథ్ యాదవ్, 23వ వార్డులో ఈగ వెంకట్ రాంరెడ్డి, 24వ వార్డులో జయంతి రాఘవేందర్, 25వ వార్డులో నక్కల వెంకటేష్, 26వ వార్డులో ఎస్‌పి శివ, 27వ వార్డులో జూపల్లి శంకర్, 28వ వార్డులో లక్ష్మి ప్రసన్న వేణులకు పార్టీ బిఫామ్‌లను అందజేశారు.

## యువతను ప్రోత్సహించాలన్నదే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** యువతను ప్రోత్సహించాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి వివరించారు. మంగళవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు అభ్యర్థి అందె మోహన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ 14వ వార్డులో అందె మోహన్‌ను గెలిపించేందుకు యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కొండ యాదయ్య, చౌల రవి, అబ్బు, గొడుగు అంజి, భూషణ్ చిన్న, అవేజ్, సయ్యద్‌పాషా, రొంపల్లి కృష్ణ, మంగ మల్లేష్, రాజేందర్, చందు, బైరమోని శివ, వజ్ర, శ్రీశైలం, ప్రకాష్, భాను, వినోద్, వరుణ్‌లు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు




**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** యువత క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని కోచ్ చంద్రశేఖర్ తెలిపారు. తెలంగాణ అండర్ 14 ప్రీమియర్ లీగ్ మ్యాచ్ లకు టిపిఎల్ వారి ఆధ్వర్యములో ఉత్తరప్రదేశ్ వారు సెలక్షన్ నిర్వహించడం జరిగింది. ఈ సెలక్షన్ కి 6000 మంది రావడం జరిగింది అందులో ఈ టీపీఎల్ లీగ్ మ్యాచ్‌లకు ఆదిబట్ల సర్కిల్ పరిధి తుర్కయంజాల్ పరిధి లక్ష్య క్రికెట్ అకాడమీ తొర్రూర్ డివిజన్ నుంచి ఎస్ నిహాల్ రెడ్డి, సూర్యతేజ , మణిశ్వర్, సెలెక్ట్ అవ్వడం జరిగిందని కోచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మ్యాచులు ఫిబ్రవరి లో హరిద్వార్ లో జరగనున్నాయని, ఎస్ నిహాల్‌రెడ్డి, సూర్యతేజ అల్ రౌండర్‌గా, మణీశ్వర్ బ్యాటింగ్, కీపింగ్ సెలెక్ట్ కావడం గర్వకారణమన్నారు. చదువులు అభ్యసిస్తూ క్రీడల్లో రాణిస్తున్నందుకు కోచ్ చంద్రశేఖర్ విద్యార్థులను అభినందించారు.

# జిహెచ్ఎంసి పాలకమండలికి కౌంట్‌డౌన్

### ఫిబ్రవరి 10వ తేదీతో హోదా ముగింపు

### మళ్లీ ప్రత్యేక అధికారి పాలన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) పాలక మండలి పదవీకాలం ముగింపునకు సమయం దగ్గరపడింది. సరిగ్గా మరో వారం రోజుల్లో, అంటే ఫిబ్రవరి 10వ తేదీతో ప్రస్తుత పాలక మండలి అధికారిక హోదా ముగియనుంది. దీంతో నగరం మళ్లీ ప్రత్యేక అధికారి (స్పెషల్ ఆఫీసర్) పాలనలోకి వెళ్లేందుకు సిద్ధమైంది. 2020 డిసెంబర్‌లో ఎన్నికలు జరిగిన ప్పటికీ, సభ్యులు 2021 ఫిబ్రవరి 11న ప్రమాణ స్వీకారం చేశారు. మేయర్‌గా గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌గా మోతె శ్రీలత శోభన్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ ఐదేళ్ల కాలంలో జిహెచ్ఎంసి చరిత్రలోనే అత్యధికంగా ఆరు వార్షిక బడ్జెట్లను (గత నెలలో ఆమోదించిన రూ. 11,460 కోట్ల బడ్జెట్‌తో కలిపి) ప్రవేశపెట్టి ఆమోదించిన ఘనత ఈ మండలికి దక్కింది.

### నిర్ణయాలు - వివాదాలు..

ఈ పాలక మండలి కాలంలో అభివృద్ధి కంటే వివాదాలే ఎక్కువగా వినిపించాయి. 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని కౌన్సిల్ సమావేశాల్లో ఆలపించాలని, అలాగే మేయర్, కమిషనర్‌ల గ్రూప్ ఫొటోలను కౌన్సిల్ హాల్లో ఏర్పాటు చేయాలని అరుదైన నిర్ణయాలు తీసుకున్నారు. అభివృద్ధి పనుల కంటే కార్పొరేటర్ల విహార యాత్రలు (స్టడీ టూర్లు), ఇన్సూరెన్స్ వంటి అంశాలకే స్టాండింగ్ కమిటీలు వేగంగా ఆమోదం తెలిపాయన్న విమర్శలు మూటగట్టుకున్నాయి. 2014కు ముందున్న రూ. 3 కోట్ల కార్పొరేటర్ బడ్జెట్‌ను పునరుద్ధరించకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమైంది.



### రూ. కోటి కోసం 'ప్రదక్షిణలు'

పదవీకాలం ముగిసేలోపు తమ డివిజన్‌లలో పనులు పూర్తి చేయాలని భావిస్తున్న కార్పొరేటర్లకు నిధుల కష్టాలు తప్పడం లేదు. గత నవంబర్ కౌన్సిల్ సమావేశంలో ఒక్కో కార్పొరేటర్‌కు రూ. 2 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. ఇందులో రూ. కోటి ప్రతిపాదనలు నేరుగా ఇచ్చే అవకాశం ఉన్నా, మిగిలిన రూ. కోటి కోసం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అనుమతి తప్పనిసరి చేశారు. మంత్రి అందుబాటులో లేకపోవడం, గడువు మరో వారమే ఉండటంతో చాలా మంది కార్పొరేటర్ల ప్రతిపాదనలు పెండింగ్‌లోనే ఉన్నాయి. తమ పదవి ఊడకముందే ఈ నిధులు మంజూరు చేయించుకోవాలని కార్పొరేటర్లు ఇప్పుడు జిహెచ్ఎంసి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఫిబ్రవరి 11 నుంచి జిహెచ్ఎంసి కమిషనర్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు. నగర పాలనలో ఒక అధ్యాయం ముగిసి మరో కొత్త మార్పు (మూడు కార్పొరేషన్ల విభజన ప్రక్రియ) మొదలుకానుంది.

## హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభం

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** ప్రపంచవ్యాప్తంగా ఖాతాల అవుట్‌సోర్సింగ్, నాలెడ్జ్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన జిఐ ఔట్‌సోర్సింగ్ మంగళవారం హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ టెక్‌పార్క్‌లో తన అత్యాధునిక గ్లోబల్ కెపబిలిటి సెంటర్ (జిసిసి)ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ హైదరాబాద్‌లో ఇన్‌వర్డ్ ఇన్వెస్‌మెంట్ (సౌతిండియా) హెడ్ సిద్ధార్థ్ విశ్వనాథన్ సమక్షంలో జరిగింది. జిఐ ఔట్‌సోర్సింగ్ గ్రూప్ సిఇఒ తారిక్ హుస్సేన్ మాట్లాడుతూ జిఐ ఔట్‌సోర్సింగ్ ద్వారా బుక్‌కీపింగ్, మేనేజ్‌మెంట్ అకౌంట్స్, స్మార్ట్ సర్వీసులు, స్టాట్యూటరీ అకౌంట్స్, పేరోల్, టాక్సేషన్, ఆడిట్ సపోర్ట్, జిఐ క్లౌడ్ కన్సలెన్సీ సేవలను ప్రపంచవ్యాప్త క్లయింట్లకు అందించన్నుట్లు తెలిపారు. కౌవాసెంట్ కంపెనీ అయిన ఎనబిర్ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో జిసిసి స్థాపించామన్నారు. సిద్ధార్థ్ విశ్వనాథన్ మాట్లాడుతూ జిఐ అవుట్‌సోర్సింగ్ కొత్త కేంద్రం




యుకే–భారత్ దేశాల ఆర్థిక వ్యవస్థలకు ప్రయోజనం చేకూర్చే సంయుక్త వృద్ధిమార్గాలను బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. కౌవాసెంట్, ఎనబిర్ చైర్మన్, ఎండి సి.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిఐ ఔట్‌సోర్సింగ్ ద్వారా ప్రపంచవ్యాప్త క్లయింట్లకు వరల్డ్ క్లాస్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్ అందించవచ్చని తెలిపారు.

## 'విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వాలి'

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.2వేల కోట్లు నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర శ్రీ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్ల హన్మాండ్లుచారి కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా అన్నోజు కృష్ణాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుబ్బాక కిషన్‌రావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులుగా దేవరకొండ పుల్లయ్యచారి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎం.శైలజను నియమిస్తూ, వారికి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం హన్మాండ్లు చారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. 50ఏండ్లు నిండిన ప్రతి విశ్వకర్మకు కింద రూ.5వేల చొప్పున పెన్షన్ చెల్లించాలని కోరారు. అన్నోజు కృష్ణాచారి మాట్లాడుతూ జాతి అభివృద్ధికి నిరంతరం పోరాడుతానన్నారు. విశ్వబ్రాహ్మణ యువతకు వృత్తిపరంగా శిక్షణ ఇచ్చి, పరిశ్రమల స్థాపనకు వడ్డీ లేని రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అంబరిపేట భార్గవి, ప్రధానకార్యదర్శి శ్రావణి తదితరుల పాల్గొన్నారు.



# అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యం : హైడ్రా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో, ప్రజలను అప్రమత్తం చేసేందుకు హైడ్రా నడుం బిగించింది. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో అనేక చోట్ల ఫైర్ సేఫ్టీ నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూడటంతో ఈనిర్ణయం తీసుకున్నారు. నిబంధనలు పాటించని సంస్థలకు ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు చేసుకునేందుకు నెలరోజుల గడవును అధికారులు ఇచ్చారు.

**నగరవ్యాప్తంగా విస్తృత ప్రచారం..** పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాధాపూర్, గచ్చిబౌలి, మియాపూర్, దిల్‌సుఖ్ నగర్, ఉప్పల్, సికింద్రాబాద్ క్లాక్ టవర్, ఈసిఐఎల్, శంషాబాద్ సహా దాదాపు 30కి పైగా ప్రధాన



ప్రాంతాల్లో ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు.

**అత్యవసర నెంబర్లు.. అగ్నిమాపక శాఖ : 101**
**హైడ్రా కంట్రోల్ రూమ్ : 1070, మొబైల్ నెంబర్ : 9000113667**

### సచివాలయంలో ఫైర్ మాక్ డ్రిల్

రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఉదయం ఫైర్ మాక్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించారు. ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తక్షణమే చేపట్టాల్సిన చర్యలు, అగ్ని మాపక పరికరాల వినియోగం, రక్షణ చర్యలపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్‌ను సచివాలయ సిఎస్ఒ దేవీ దాస్ పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు అప్పాజీ, చ. పవన్ కుమార్, సచివాలయ ఎడిఎఫ్ఒ జి.వి. ప్రసాద్, ఎస్ఎఫ్ఒ జాన్యా పాల్గొన్నారు.

## క్యాలెండర్.. డైరీ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిఒ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబి కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు ఐఅండ్ పిఆర్ ప్రత్యేక కార్యదర్శి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి సిహెచ్ ప్రియాంకను మంగళవారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్, కోశాధికారి ఎంవీ రమణ, డాక్టర్ కొత్త విద్యాసాగర్, శ్రీరామ్, రాంచందర్ తదితరులతో కలిసి ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కార్యదర్శి సిహెచ్ ప్రియాంక, టిజిఒ హైదరాబాద్ జిల్లాకు సంబంధించిన 2026 క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఅండ్ పిఆర్ జెడిలు జగన్, శ్రీనివాస్, మధు, కిరణ్మయి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి ఉద్యోగుల పదవీ విరమణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలిలో పని చేస్తున్న 12 మంది ఉద్యోగులు మంగళవారం పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ వారిని ఖైరతాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యుటీ తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో పిఅండ్ఎ జిఎం సరస్వతి, డిజిఎం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ప్రశాంత జీవనం గడపాలని ఆకాక్షించారు.



## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



### అదనపు కలెక్టర్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణలో పాల్గొనున్న మైక్రో అబ్జర్వర్ల శిక్షణ తరగతుల్లో జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.సుసిందర్ రావులతో కలిసి అదనపు కలెక్టర్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలన జరపాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా విధులు నిర్వర్తించాలని తెలిపారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలూ ఉన్నాయా లేవా అన్నది గమనించాలని, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్మెంట్ సరిగానే ఏర్పాటు చేశారా అన్నది పరిశీలించాలన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణ తరగతుల్లో సూచించిన అంశాలను అవగాహన చేసుకుని సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ సూచించారు. శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## రెండవ ర్యాండమైజేషన్ పూర్తి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల లో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ మయంక మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణరెడ్డి సమక్షంలో పూర్తి చేశారు. జనరల్ అబ్జర్వర్ మయంక మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో నిర్వహించే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను, ఇతర అధికారులతో కూడిన బృందాలను, కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్‌చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ అన్నారు.




### విధులకు గైర్హాజరైతె కఠిన చర్యలు

రెండవ విడత పోలింగ్ సిబ్బందికి 6న వారికి కేటాయించిన కేంద్రాలలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోబడుతాయని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్, డిపిఒ వి.సురేష్ మోహన్, జిఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించండి

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రెండేళ్ళ కాలంలో మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధిని ప్రజల వద్దకు తీసుకువెళ్ళేందుకు కౌన్సిలర్ అభ్యర్థులు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో కౌన్సిలర్ అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ బిఫామ్‌లను అంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ప్రజా శ్రేయస్సే కోసం చేసిన అభివృద్ధి పనులకు ఓటర్లకు వివరించేందుకు అభ్యర్థులు కృషి చేయాలని పేర్కొన్నారు. బీఫామ్ అందుకొని ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులను గెలిపించేందుకు పార్టీ కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండానే వార్డుల వారీగా సర్వేలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. పార్టీ కోసం పనిచేసిన సీనియర్లకు ఆశించిన మేరకు టికెట్లు ఇవ్వలేకపోయామని, భవిష్యత్‌లో వారికి మంచి అవకాశాలు ఇచ్చేందుకు కృషిచేస్తానని తెలిపారు. ప్రతి అభ్యర్థి వార్డుల్లో ఉన్న కాంగ్రెస్ నేతలను కలుపుకొని



ఎన్నికల ప్రచారంలోకి వెళ్ళాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవయే లక్ష్యంగా ఎమ్మెల్యే పని చేస్తున్నారని, రెండేళ్ల కాలంలో నియోజకవర్గానికి రూ.1350కోట్ల నిధులు తీసుకువచ్చారంటే ఎంతో గొప్ప విషయమన్నారు. మున్సిపాలిటిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మామిడి శ్యాం సుందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, మహ్మద్ ఇబ్రహీం, వన్నాడ ప్రకాష్ గౌడ్, బాల్‌రాజ్ గౌడ్, దామోదర్‌రెడ్డి, అగ్గనూరి విశ్వం, కొంకళ్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు వీరే..** షాద్‌నగర్ మున్సిపాలిటిలో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. మొదటి వార్డులో మహ్మద్ ఇర్ఫాన్‌ఖాన్, రెండవ వార్డులో బచ్చలి నరేష్, మూడవ వార్డులో ఆలోనిపల్లి రాజుగౌడ్, చేగూరు పుష్పమ్మ, 5వ వార్డులో సింగపాగ శిరీష, 6వ వార్డులో రాజునాయక్, 7వ వార్డులో కొప్పునూరి ప్రవీణ్, 8వ వార్డులో జయ ప్రకాష్ గౌడ్, 9వ వార్డులో గోదా మాధవులు, 10వ వార్డులో నడికుడ శ్రావణి, 11వ వార్డులో గుడిపల్లి వినోద బీరప్ప, 12వ వార్డులో కలంకార్ దిలీప్, 13వ వార్డులో రిజ్వాన్ భేగం, 14వ వార్డులో అందె మోహన్ ముదిరాజ్, 15వ వార్డులో మరియా భేగం సాదిక్, 16వ వార్డులో వన్నాడ లావణ్య, 17వ వార్డులో నాజియాభేగం సర్వర్‌పాషా, 18వ వార్డులో జమాల్పూర్ సంతోషిబాయి, 19వ వార్డులో ఆఫ్రీన్ బేగం షర్ఫుద్దీన్, 20వ వార్డులో డాకన్నగారి మనీష, 21వ వార్డులో నాగమణి, 22వ వార్డులో దిద్యాల శోభ, 23వ వార్డులో అగ్గనూరి బస్వం, 24వ వార్డులో అగ్గనూరి విశాల విశ్వం, 25వ వార్డులో చాకలి పెంటయ్య, 26వ వార్డులో జామ మంజుల, 27వ వార్డులో మురళీమోహన్ (అప్పి), 28వ వార్డులో కాటం భాగ్యలక్ష్మి గౌడ్. ప్రకటించిన అభ్యర్థులకు బీఫామ్‌లను ఎమ్మెల్యే అందజేశారు.



## స్మశానవాటిక తొలగింపు అంశంపై మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి

**కుత్బుల్లాపూర్/ప్రజాపక్షం:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి ప్రాంతంలో గత 50సంవత్సరాలుగా కొనసాగుతున్న స్మశానవాటికను తొలగించాలనే ప్రతిపాదనపై స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల ఏర్పడిన కొత్త కాలనీ నివాసులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, స్మశానవాటికను తొలగిస్తే సుమారు 50వేలమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా ఎంపిపి, మున్సిపల్ కార్పొరేషన్‌కాలంలో ఈ స్మశానవాటిక అభివృద్ధి కోసం నిధులు కూడా కేటాయించారు. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి సమస్యపై వినతిపత్రం సమర్పించారు. స్మశానవాటిక అనేక సంవత్సరాలుగా ప్రజలకు ఉపయోగపడుతోందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దానిని కొనసాగించేలా ప్రభుత్వం తగినచర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు సంబంధిత అధికారులతో సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షే/ఘట్‌కేసర్:** రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలకు ఘట్‌కేసర్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, పోచారం అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కర్రె రాజేష్, మున్సిపల్ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్‌లు పాల్గొన్నారు. నక్క ప్రభాకర్ గౌడ్ జన్మదినం సందర్భంగా వారి నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి, బొక్క సత్తి రెడ్డి, మైనారిటీ నాయకులు ఖయ్యూం, డిసిసి కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు యాదవ్, మాజీ కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ ప్రారంభం

**కూకట్‌పల్లి/ప్రజాపక్షం:** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలాజీనగర్ డివిజన్ పరిధిలో రాఘవేంద్ర సొసైటీలో రూ. 50లక్షలతో, అలాగే సేవాలా ల్ నగర్‌లో రూ.75లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లను మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సేవాలాల్ నగర్, రాఘవేంద్ర కాలనీల్లో గతంలో ఉన్న అనేక సమస్యలను ఇప్పటికే పరిష్కరించామన్నారు. ఇకపై మిగిలిన సమస్యలు ఏవైనా ఉంటే తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు, డివిజన్ అధ్యక్షులు సిహెచ్. ప్రభాకర్‌గౌడ్, ఎస్.శంకర్, ఎస్. కృష్ణ, కళ్యాణ్ నాయక్, సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

**ప్రజాపక్షం/నిజాంపేట్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్, బాచుపల్లిలోని శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఈ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని, ప్రతిఒక్కరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు.

## బంగారంకోసం మహిళ హత్య

**ప్రజాపక్షం/దుండిగల్:** వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారం కోసమే ఆమెను ఓ స్థానిక మహిళ హత్య చేసినట్లు దుండిగల్ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సాయంత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చర్చి గాగిల్లాపూర్‌లో (80) సంవత్సరాల వృద్ధురాలు సుశీల తన ఇంట్లో అతి దారుణంగా హత్యకు గురైంది. రక్తపు మడుగు లో పడిఉన్న ఆమెను చూసిన స్థానికులు 100నెంబర్‌కు ఫోన్‌చేసి దుండిగల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘట నా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. వృద్ధురాలు హత్యకేసు ఛేదించేందుకు డిసిపి కోటిరెడ్డి ఏసిపి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు సమాచారం. సిసి పుటేజి ఆధారంగా కుత్బుల్లాపూర్ ఎస్ఓటి, పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్త దర్యాప్తు చేపడుతున్నారు. వృద్ధురాలు హత్య కేసులో దుండిగల్ పోలీసుల పురోగతి సాధించినట్లు సమాచారం సుశీలకు కల్లు తాగే అలవాటు ఉండగా ఆమెతో రోజు కలిసి కల్లు సేవించే మహిళ నే హంతకురాలుగా పోలీసుల దర్యాప్తులో తేలినట్లు సమాచారం. సుశీల ఒంటిపై ఉన్న బంగారు కమ్మలు కోసమే ఆమెను హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు స్థానికంగా ఉండే ఒక మహిళ ఈ దారుణానికి ఒడికట్టినట్లు దుండిగల్ పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అయితే ఆమె ఒక్కతే ఈ హత్య చేసిందా, చేస్తే దేనితో కొట్టి చంపింది? ఎందుకు చంపింది? ఈమెకు హత్య కేసులో ఎవరయినా సహకరించారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.



### ఎన్నికల నిర్వహణలో

# మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

### ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు కొర్ర లక్ష్మి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఎన్నికలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించటంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర, నిఘా కీలకమైందని మేడ్చల్ జిల్లా పురపాలక సంఘ ఎన్నికల సాధారణ పరిశీలకులు కొర్ర లక్ష్మి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కల్సి ఆమె పాల్గొన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ బూతులలో ఎన్నికల ప్రక్రియ జరిగే విధానాన్ని మైక్రో అబ్జర్వర్లు జాగ్రత్తగా పరిశీలిస్తూ సమర్థవంతంగా జరిగేలా చూడాలన్నారు.


పోలింగ్ బూత్ లోపల, బయట నిరంతరం నిఘా నేత్రాలతో సూక్ష్మ పరిశీలన చేస్తుండాలని సూచించారు. పూర్తి స్థాయిలో ఎన్నికల నిర్వహణ అంశాలపై సమగ్ర అవగాహనతో ఉండాలని, ఎలాంటి సందేహాలున్నా వాటిని ఎప్పటికప్పుడు ఎన్నికల నిర్వహణాధికారులతో తెల్సుకోవాలన్నారు. ప్రతి ఒక్క పోలింగ్ బూతు వద్ద ఒక్కో మైక్రో అబ్జర్వర్‌ను నియమించటం జరిగిందని, వారంద రూ తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డులు స్పష్టం గా కనపడేలా చూసుకోవాలని, పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ ముందు రోజే చేరుకొని మాక్ పోలింగ్ విధానం, ఓటర్లు ఓటింగ్ చేసే విధానం, పోలింగ్ ఏజంట్ల నియామకాన్ని క్షుణ్ణంగా పరిశీలించటం చేయాలని, సూచించారు. ముఖ్యంగా పోలింగ్ అధికారుల విధి విధానాల కు పరిశీలిస్తుండాలన్నారు. ప్రతి రెండు గంటల కు ఒకసారి ఓటింగ్ శాతం తెల్సుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తినా వాటిని పరిశీలిస్తూ పరిస్థితులపై వెంట వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ పోలింగ్ ఏ సమయానికి ప్రారంభం, ఏ సమయానికి ముగుస్తుందన్న విషయాలను నమోదు చేయాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లే వారికి ఓటరు గుర్తింపు కార్డు, ఇతర సమానమైన గుర్తింపు కార్డులున్నాయా లేదా అన్న విషయాలను గమనిస్తుండాలన్నారు. అదే విధంగా ఓటర్లకు పోలింగ్ బూతుల్లో అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయా లేదా అన్న విషయాలను చూడాలన్నారు. పోలింగ్ సమయం ముగిసే సమయానికి ఓట్లు వేసే క్యూ లైన్లో ఎంత మంది ఉన్నారో చూసి వారికి స్లిప్‌లు ఇచ్చారా లేదా అన్న విషయాలపై గమనించాలన్నారు. పోలింగ్ ముగిసాకా ఫారాలు సరిగ్గా నింపారా లేదా అన్న అంశాన్ని తమ నివేదికలో నమోదు చేయాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్లు చేపట్టే విధి విధానాలపై శిక్షకులు సమగ్ర అవగాహన కల్పించే విధంగా శిక్షణ ఇచ్చారు.

**ర్యాండమైజేషన్ ద్వారా పిఓ, ఎపిఓల ఎంపిక**

మేడ్చల్ జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట మున్సిపాలిటీలకు జరుగనున్న ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను మంగళవారం ర్యాండమైజేషన్ ద్వారా పారదర్శకంగా ఎంపికి చేసారు. ఎన్నికల పరిశీలకులు కొర్ర లక్ష్మి , జిల్లా కలెక్టర్ మనుచౌదరిలు నిర్వహించిన ఈ ఎంపిక కార్యక్రమంలో మూడు మున్సిపాలిటీల్లో జరుగనున్న 68 వార్డులకు గాను ఏర్పాటు చేసిన 136 పోలింగ్ బూతుల్లో 818 ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, డిఈఓ విజయకుమారి, సివిల్ సప్లయిస్ డిఎం సుగుణబాయి, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఏఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్‌లో స్వర్ణపతకం సాధించిన మాన్విష్

**ప్రజాపక్షః/ఘట్‌కేసర్ :** బ్యాడ్మింటన్‌లో స్వర్ణపతకం సాధించిన ఎదులాబాద్ గ్రామానికి చెందిన గుడెం మాన్విష్ పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్నాడు ఇతను రాజస్థాన్ జైపూర్‌లో 15వ ఓపెన్ నేసనల్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ అండర్ 14 బ్యాడ్మింటన్(సింగిల్స్) విభాగంలో స్వర్ణ పతకం గోల్డ్‌మెడల్ సాధించడంతో తల్లిదండ్రులు గూడెం మమత,రాజు కుటుంబ సభ్యులతో పాటు ఏదులాబాద్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మాన్విష్‌ని అభినందించారు.ఈ సందర్భంగా తలిదండ్రులు మాట్లాడుతూ మా కుమారుడు భవిష్యత్తులో ఇంకా ఎన్నో జాతీయ అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.మాన్విష్ చదువుతున్న పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు పలువురు అతనికి శుభాకాంక్షలు తెలిపారు.





## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కాప్రా మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్ యూనియన్ సలహాదారులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్.బోస్ అన్నారు. మంగళవారం కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరికి వివిఎస్ బోస్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఉన్న పద్ధతి ప్రకారం మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్యనియామకాల ప్రాతిపదికన ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు పండుగ సెలవులు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులందరికీ తగిన భద్రతా చర్యలు పాటించాలని, మలేరియా విభాగంలోని కొద్దిమందికి కాంట్రాక్ట్ కార్మికులకు మొదటి బ్యాచ్ వారితో సమానంగా వేతనాలు చెల్లించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వి.జాన్, ప్రధాన కార్యదర్శి సాయిలు, జాన్, నర్సింహ, పాలయ్య,తదితరులు పాల్గొన్నారు.

## కాంగెస్ పార్టీ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** ప్రజా ఆశీర్వా దం కాంగ్రెస్ వైపే ఉందని, కాంగ్రెస్ పార్టీ మేజార్టీ స్థానాలలో విజయం సాధించి తాండూరు మున్సిపల్ పీఠం కైవసం చేసుకోవడం ఖాయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ధీమా వ్యక్తపర్చారు. మంగళవారం తాండూరు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థులకు ఎమ్మెల్యే బి-ఫాం అందజేశారు.అనంతరం అభ్యర్థులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభ్యర్థుల ఎంపికలో అన్ని వర్గాలతో సామాజిక న్యాయం పాటించడం జరిగిందన్నారు. కష్టపడ్డ కార్యకర్తలకు కౌన్సిలర్‌గా కాంగ్రెస్ పార్టీ తరపున బి ఫాంలను అందిచండం జరిగిందన్నారు. ప్రతిపక్ష నాయకులు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు వారి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. రెండేళ్ళ కాంగ్రెస్ పాలనలో తాండూరు మున్సిపల్‌లో గతంలో చేయని పనులు చేయడం జరిగిందన్నారు. మన ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గూర్చి ప్రజలకు అర్థం అయ్యే విధంగా ఓటర్లకు వివరించే బాధ్యత అభ్యర్థులు, పార్టీ నాయకులదే అన్నారు. 30 కౌన్సిలర్ స్థానలపైనే కాంగ్రెస్ పార్టీ గెలవబోతుందని, కాంగ్రెస్ పార్టీ తాండూరు మున్సిప్ పీఠం కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. అభ్యర్థులు పార్టీ ఇంచార్జీలతో సమన్వయంతో పనిచేయాల ని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారాసింగ్, మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు నరేందర్ రాం శెట్టి, కోఆర్డినేటర్ ఇస్తాకర్, అశోక్‌కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షులు హబీబ్‌లాల, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్‌లో రెండు వార్డులు ఏకగ్రీవం

### పోటీలో 112 మంది అభ్యర్థులు

### మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి

**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లావ్యాప్తంగా నాలుగు మున్సిపాలిటీల్లో, వికారాబాద్ మున్సిపల్‌లోని రెండు వార్డులు ఏకగ్రీవం 1వ వార్డు అనంత్‌రెడ్డి, 15వ వార్డు విజయలక్ష్మి ఏగగ్రీవం అయినారు. వికారాబాద్ మున్సిపల్‌లో 112మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు, కొడంగల్ మున్సిపల్ లోని 12వార్డులకుగాను కాంగ్రెస్ 12, బిఆర్ఎస్ పార్టీ11, ఎంఐఎం నుండి 1 మొత్తం 33 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పరిగి మున్సిపల్ 60మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తాండూర్ 135 వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపల్‌లో 100 వార్డుల కు 340మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వికారాబాద్ మున్సిపల్ బిఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసి బి ఫామ్ సమర్పించి ఏకగ్రీవం అయిన వెంటనే స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన విజయలక్ష్మి, మిగిలిన అభ్యర్థులు ఏడు రోజులు ప్రచారం ఉండటంతో బిఫాం పొందిన అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తారు.



## మట్టి మాఫియా ఆగడాలపై చర్యలకు డిమాండ్

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ మండలం పరిధిలోని దుండిగల్ తండా, సర్వే నెంబర్ 684 లో మట్టి మాఫియా ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబం ధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు స్థానికంగా తీవ్రంగా వినిపిస్తున్నాయి. రాత్రి సమయంలో భారీ యంత్రాలతో మట్టిని తవ్వి, ట్రాక్టర్లు, టిప్పర్‌ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వ భూమికి భారీ నష్టం వాటిల్లడంతో పాటు, భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో మట్టి మాఫి యా కార్యకలాపాలు బహిరంగంగానే కొనసాగుతుండటంతో, అక్రమ మైనింగ్‌కు కొందరు అధికారుల అండదండలు ఉన్నాయన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ప్రత్యేకంగా దుండిగల్ సరిహద్దు ప్రాంతంలో మట్టి మాఫియా రెచ్చిపోతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాల కారణంగా రహదారులు పూర్తిగా ధ్వంసమవుతున్నాయని, ట్రాక్టర్లు, టిప్పర్ల రాకపోకలతో తీవ్ర ధూళి సమస్య తలెత్తి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. నివాస ప్రాంతాలకు అతి సమీపంలోనే మట్టి తవ్వకాలు జరగడంతో ప్రమాదాలు జరిగే అవకా శం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందిం చి విచారణ చేపట్టాలని, అక్రమ మట్టి తవ్వకాలను పూర్తిగా అరికట్టడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నా రు.

## ఉచిత పశువైద్య శిబిరం

**ప్రజాపక్షం /బంట్వారం :** వికారాబాద్ నియోజకవర్గంలోని బంట్వారం మండల పరిధిలోని సల్బత్తపూర్ గ్రామంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయటం జరిగిందని తెలిపారు. ఎదకురాని పశువులను గుర్తించి తగిన చికిత్స చేయటం జరిగింది. 26 ఆవులకు చూడి నిర్ధారణ పరీక్షలు, 8ఆవులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయటం జరిగిందని సర్పంచు బాలయ్య తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కుమార్, బాబ్జి, వెటర్నరీ అధికారి నర్సింహులు, గోపాలమిత్రలు బందయ్య, యాదవ్ ఉప్పసర్పంచు నరేందర్‌రెడ్డి, రైతులు మలేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## షాపూర్‌నగర్‌లో యూనియన్ల ర్యాలీ

### ఫిబ్రవరి 12న దేశవ్యాప్త బంద్‌కు పిలుపు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం షాపూర్‌నగర్ ప్రాంతంలో యూనియన్ల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిటియూఐ, టియుసిఐ, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి, బిఆర్‌టియు, ఏఐయుటియుసి యూనియన్లు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, ఉపాధి భద్రత, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని యూనియన్ల కామ్రేడ్లు, కార్మికులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు స్వామి, కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు హరినాథ్‌రావు, నరసింహారెడ్డి, సిఐటియు నాయకులు అశోక్, లక్ష్మ ణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

**ప్రజాపక్షం /వికారాబాద్ :** మున్సిపల్ పరిధిలోని 15వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి అలంపల్లికి చెందిన సరిత జగన్, శ్రవణ్, కిరణ్, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 15వవార్డుకు చెందిన బిఆర్ఎస్ అభ్యర్థులు విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి నరోత్తం రెడ్డి, పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్,రఘుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షులు సుధార్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



## విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

### టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్‌పల్లి/ప్రజాపక్షం:** సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ రంగాలకు నిధుల కేటాయింపులో ఎలాంటి లోటులేదని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వెంకటయ్యను కలవగా, కళాశాలలో నెలకొన్న పలుసమస్యలను రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం కళాశాలలో సుమారు 3800 మంది విద్యార్థులు చదువుతున్నారని, అయితే భవనాల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. సుమారు 20సంవత్సరాల క్రితం నిర్మించిన పాత భవనాలే తప్ప కొత్త భవనాలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొత్త భవనాల నిర్మాణం అత్యవసరమని సూచించారు. దీనిపై బండి రమేష్ సానుకూలంగా స్పందిస్తూ, కళాశాల సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, సతీష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఫణికుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తామని జిల్లా ఎస్పి స్నేహమెహ్రా తెలిపారు. ఈ సందర్భంగా ఎఎస్పి మాట్లాడుతూ జిల్లా నుండి వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సమస్యలపై బాధితులతో మాట్లాడటం జరిగిందని, వెంటనే సంబంధిత అధికారులు తక్షణమే విచారణ జరిపి న్యాయంచేయాలని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్‌శాఖ యొక్క ప్రధానలక్ష్యం అని, ప్రతిఫిర్యాదుపై నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పి తెలిపారు. ప్రజలకు పోలీసుశాఖ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని, ఎవరైనా తమ సమస్యల పరిష్కారానికి భయపడకుండా నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. చట్ట పరిరక్షణతలోపాటు ప్రజలకు విశ్వాసాన్ని సంపాదించడమే పోలీస్ శాఖ ముఖ్యలక్ష్యం అని అన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు పోలీస్ శాఖకు మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని, దీనివల్లా సమస్యలు పరిష్కారమవుతాయని ఎస్పి అన్నారు.



## అమ్మవార్ల జాతరలో వజ్రేష్‌యాదవ్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని యాద్గార్‌పల్లిలో చిత్తారమ్మ, కొండ పోచమ్మ జాతరలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలు శ్రేయస్సు కోసం ఆకాంక్షించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగోసారి ఫైనల్లో ఢిల్లీ

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఛాంపియన్ ట్యాగ్ కోసం నిరీక్షిస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ నాలుగోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్ కలల్ని భగ్నం చేస్తూ.. టైటిల్ పోరుకు సిద్ధమైంది ఢిల్లీ. 169 పరుగుల ఛేదనలో ఓపెనర్లు లిజెల్లే లీ(43), షఫాలీ వర్మ(31) అదిరే ఆరంభమివ్వగా.. జెమీమా రోడ్రిగ్స్(41) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రెచ్చిపోయింది. ఫిబ్రవరి 5న ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొట్టనుంది. లీగ్ దశలో గుజరాత్ జెయింట్స్ చేతిలో



రెండుసార్లు ఓటమి చవిచూసిన ఢిల్లీ క్యాపిటల్స్ ఎలిమినేటర్లో గర్జించింది. తొలిసారి ఫైనల్ ఆడాలనుకున్న గుజరాత్ ఆశల్ని ఆడియాసలు చేసింది. బౌలర్ల కృషిని వృథా చేయకుండా బ్యాటర్లు దంచేయగా.. భారీ లక్ష్యాన్ని 16 ఓవర్లలోనే ఉఫ్ అనిపించింది ఢిల్లీ. టాప్ క్లాస్ ఆటతో గుజరాత్‌కు చెక్ పెట్టిన ఢిల్లీ నాలుగోసారి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. భారీ ఛేదనలో ఓపెనర్లు లిజెల్లే లీ(43), షఫాలీ వర్మ(31) ఎడాపెడా బౌండరీలతో స్కోర్ బోర్డును ఉరికించారు. వీరిద్దరూ పోటాపోటీగా దంచగా.. పవర్ ప్లేలోనే 75 పరుగులు చేసింది ఢిల్లీ. వీరకొట్టుడుతో లక్ష్యాన్ని కరిగిస్తున్న ఈ ద్వయాన్ని ఎట్టకేలకు వరేహం విడదీసింది. డేంజరస్ లిజెల్లీ ఎల్బీగా ఔట్ కావడంతో గుజరాత్ ఊపిరిపీల్చుకుంది. అదే ఓవర్లో కట్ షాట్ ఆడబోయిన షఫాలీ క్లీన్ బౌల్డ్ అయింది. అనంతరం లారా వొల్వార్డ్(32 నాటౌట్) జతగా జెమీమా రోడ్రిగ్స్(41) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది.

ఢిల్లీని గెలుపువాకిట నిలిపిన జెమీమా విజయానికి 9 పరుగుల దూరంలో ఔటయ్యింది. మరిజానే కాప్ (4 నాటౌట్) లాంఛనం పూర్తి చేసింది. వరేహం వేసిన 16వ ఓవర్లో తను బౌండరీ కొట్టడంతో 7 వికెట్ల తేడాతో ఢిల్లీ జయభేరి మోగించి నాలుగోసారి ఫైనల్లో అడుగుపెట్టింది.

మూనీ అర్ధ శతకంతో..

గుజరాత్ జెయింట్స్ ఆరంభంలో తడబడినా ఆఖర్లో భారీ స్కోర్ చేసింది. పవర్ ప్లేలో చిన్నెల్లీ హెన్రీ(335), నందిని శర్మ (244)ల విజృంభణతో కీలక వికెట్లు కోల్పోయిన గుజరాత్‌ను బేత్ మూనీ(62 నాటౌట్) ఆదుకుంది. ఓవైపు వికెట్లు పడుతున్నా మొక్కవోని సంకల్పంతో ఆడిన తను జార్జియా వరేహం(35) తో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించింది. ఆఖర్లో కష్వీ గౌతమ్(18), మూనీలు బౌండరీలతో చెలరేగగా నిర్ణీత ఓవర్లలో 168 పరుగులతో ఢిల్లీకి సవాల్ విసిరింది గుజరాత్.

## రీ ఎంట్రీలో అదరగొట్టిన తెలుగోడు..

### టి–20 వరల్డ్ కప్ వార్మప్ మ్యాచ్‌లో భారత్-ఏ ఘనవిజయం



టీమిండియా యువ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తిలక్ వర్మ రీ ఎంట్రీలోనే తన ప్రతిభను చాటుకున్నాడు. శస్త్రచికిత్స కారణంగా ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టి–20 సిరీస్‌కు దూరమైన ఈ ఎడమచేతి బ్యాట్‌మెన్ ఇప్పుడు పూర్తిస్థాయి మ్యాచ్ ఫిట్నెస్ సాధించి మైదానంలోకి అడుగుపెట్టాడు. టి20 వరల్డ్‌కప్ 2026కు +ముందు జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌ల్లో భాగంగా భారత్‌ఏ జట్టు తరపున యూఎస్‌ఏపై బరిలోకి దిగిన తిలక్ వర్మ చురుకైన ఇన్నింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతని ప్రదర్శన భారత జట్టుకు మంచి సంకేతంగా మారింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో వన్‌డౌన్ బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్‌వర్మ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. కేవలం 24 బంతుల్లోనే 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 పరుగులు సాధించాడు. ముఖ్యంగా షాట్ల ఎంపిక, స్ట్రైక్ రొటేషన్లో అతని నైపుణ్యం స్పష్టంగా కనిపించింది. గాయానంతరం ఎలాంటి అసౌకర్యం లేకుండా బ్యాటింగ్ చేయడంతో పాటు ఫీల్డింగ్‌లోనూ చురుకుగా కదిలి తన ఫిట్‌నెస్ నెసందేహాలకు చెక్ పెట్టాడు. మ్యాచ్ విషయానికి వస్తే భారత్‌ఏ జట్టు 38 పరుగుల తేడాతో యూఎస్‌ఏపై ఘన విజయం సాధించింది. తిలక్ వర్మ రీ ఎంట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలవడం భారత అభిమానులకు ఉత్సాహాన్ని కలిగించింది.

## ఇండియాతో మ్యాచ్ బాయ్‌కాట్‌పై మాజీ క్రికెటర్లు ఏమంటున్నారంటే



**న్యూఢిల్లీ:** టి–20 వరల్డ్‌కప్‌తో ఇండియాతో జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు క్రికెటర్లు స్పందించారు. పాకిస్థాన్ క్రికెటర్లు షాహిద్ అఫ్రిది, మొహమ్మద్ యూసుఫ్లు పశ్చాతాపాన్ని వ్యక్తం చేశారు. కానీ తమ దేశం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండనున్నట్లు చెప్పారు. భారత మాజీ ప్లేయర్ సునీల్ గవాస్కర్ భిన్నంగా స్పందించారు. పాకిస్థాన్ నిర్ణయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. ఎందుకంటే మెగా టోర్నీల్లో పాక్ ఇలాగే యూ టర్న్ తీసుకుంటుందన్నారు. రాజకీయాల వల్ల మూతపడ్డ దారులు.. క్రికెట్‌తో తెరుచుకుంటాయని విశ్వసిస్తాని షాహిద్ అఫ్రిదీ అన్నారు. వరల్డ్‌కప్‌లో ఇండియాతో పాక్ ఆడడం లేదని, కానీ ప్రభుత్వ నిర్ణయానికి బాసటగా ఉన్నామని, ఇలాంటి సందర్భాల్లో ఐసిసి నిష్పక్షపాత నిర్ణయాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి సభ్యుడికి న్యాయం జరగాలన్నారు. యూసుఫ్ స్పందిస్తూ ఇది చాలా కఠినమైన నిర్ణయం అని, ప్రభుత్వానికి కట్టుబడి ఉన్నామని, కమర్షియల్ ప్రయోజనాల కన్నా ముందు విలువలు ముఖ్యమని, క్రికెట్లో ఉన్న పక్షపాతం ముగిసిపోవాలని యూసుఫ్ పేర్కొన్నారు. రానున్న నాలుగైదు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రియాక్షన్లు వస్తాయని, మాజీ ఆటగాళ్లు కూడా స్పందిస్తారని, పాకిస్థాన్ తన నిర్ణయాన్ని మార్చుకుంటదని భావిస్తున్నానని సునీల్ గవాస్కర్ అన్నారు. ఐసీసీ న్యాయం చేసేంత వరకు వేచి ఉండాలని, బహుశా ఆంక్షలు, జరిమానాలు పడే అవకాశం ఉందని, మళ్లీ ఐసీసీ టోర్నీ నిర్వహించే అవకాశం ఆ దేశానికి దక్కదని హర్భజన్ సింగ్ అన్నారు. పాకిస్థాన్ తమ స్వంత క్రికెట్ను నాశనం చేసుకుంటోందని మదన్ లాల్ అన్నారు.


మహిళ

## అమాయకత్వమా... అవగాహనా లోపమా?

దేశంలో బాలికలపై జరుగుతున్న అరాచకాలకు అంతులేకుండా పోతున్నది. ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలో పెళ్లి పేరుతో ఒక మైనర్‌ను ఆరు నెలలుగా బంధించి, కామవాంఛ తీర్చుకుంటున్న 45ఏళ్ల ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు మంగళవారం (ఫిబ్రవరి3) పోలీసులు ప్రకటించారు. ఇది చూడడానికి ఒక నేర ఘటనగా కనిపించవచ్చు. కానీ దీనిలో దాగి ఉన్న సామాజిక సంక్షోభం చాలా లోతైనది. ఇది పేదరికం, సామాజిక అసమానతలు, సోషల్ మీడియా ప్రభావం, తల్లిదండ్రుల మార్గనిర్దేశం లోపం, విద్యావ్యవస్థ వైఫల్యం, సమాజం చూపుతున్న నిర్లక్ష్యం వంటి ఎన్నో అంశాలను ఈ ఘటన ప్రతిబింబిస్తున్నది. ప్రతిరోజూ... ప్రతి చోటా ఇలాంటి ఘటనలు జరుగుతునే ఉన్నాయి. భయం, పరువు, భవిష్యత్తు నాశనం అవుతుందన్న ఆందోళనల వల్ల చాలా వరకూ ఈ అమానుషాలు బయటకు రావడంలేదు. మైనర్ బాలికపై లైంగిక దాడులకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టుతో కథ ముగియలేదు... నిజానికి అక్కడి నుంచే మొదలైంది. బాధితురాలు చట్టపరంగా, మానసికంగా, భావోద్వేగంగా ఇంకా అపరిపక్వంగానే ఉన్న తొమ్మిదో తరగతి చదువుతున్న ఒక బాలిక. మొబైల్ ఫోన్ ద్వారా బిహార్‌కు చెందిన ఓవ్యక్తితో పరిచయం. ఆ పరిచయం ప్రేమగా మారడం. తల్లి మందలించిందని, కొట్టిందని ఇంటి నుంచి పారిపోవడం... తనను తల్లిదండ్రులు అర్థం చేసుకోలేదన్న కోపం, వారికి నిజం తెలిసిందన్న అవమానం నేపథ్యంలో ఆ బాలిక తీసుకున్న తొందరపాటు నిర్ణయం ఆమె జీవితాన్ని ఆరు నెలల పాటు నరకంగా మార్చింది. భవిష్యత్తుపై బలమైన దెబ్బవేసింది. ఈ ఘటన ఒక కుటుంబ వైఫల్యమా? ఒక తల్లి తప్పా? ఒక బాలిక అమాయకత్వమా? లేదా ఒక నేరస్తుడి క్రూరత్వమా? నిజానికి ఇది ఇవన్నీ కలిసిన సమాజ వైఫల్యం. చాలా వరకూ ఇలాంటి ఘటనకు పేదరికమే ప్రధాన కారణం. డబ్బు లేకపోవడాన్ని మాత్రమే పేదరికంగా చూడడానికి వీల్లేదు. అవకాశాలు లభించకపోవడం.. ఆదరణ లేకపోవడం.. భద్రత ఉండకపోవడం వంటివి కూడా పేదరికంలో భాగాలే. పేద కుటుంబాల్లో పిల్లలకు మొబైల్ ఒక వినోద సాధనం.. అదే వారికి ఒక ప్రపంచం. తల్లిదండ్రులు ఇద్దరూ కష్టపడకపోతే కుటుంబం గడవడం కష్టం. వారు ఇంట్లో లేనప్పుడు పిల్లలదే రాజ్యం. ఫోన్‌ను భద్రతగా తల్లిదండ్రులు భావిస్తే, దానిని ఒక వినోద సాధనంగా, కొత్త పరిచయాలకు మార్గంగా పిల్లలు అనుకోవడం సహజ పరిణామాలు. పేదరికం పిల్లల కలలను చిన్నచేస్తుంది. ఆ చిన్న కలల్ని ప్రేమ,పెళ్లి హామీలతో నేరస్తులు నిలువునా ముంచేస్తారు. బిహార్ ఘటనలో మొబైల్ ఫోన్ కీలక పాత్ర పోషించింది. సోషల్ మీడియా లేదా ఫోన్ పరిచయం. ఇది ఒక్క బాలిక కథ కాదు. ప్రతిరోజూ వేలాది పిల్లలు అన్యుల ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. ఇక్కడ పూర్తిగా సోషల్ మీడియాను లేదా అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతికతను తప్పుపట్టడానికి వీలు లేదు. ఎందుకంటే, సరైన మార్గనిర్దేశం ఉంటే అవకాశాలకు సోషల్ మీడియా ఒక వంతెన. నేరస్తులకు బిగించే ఉచ్చు. కానీ, సక్రమంగా వినియోగించుకోకపోతే, ఆ నేరగాళ్లే నకిలీ ప్రొఫైల్స్, తప్పుడు పేర్లు, తప్పుడు వయసులు, తప్పుడు భావోద్వేగాలతో పిల్లల మనసుల్ని ప్రభావితం చేస్తారు. కలుషితపరుస్తారు. బాధిత బాలికను సదరు వ్యక్తి బిహార్ నుంచి గుజరాత్‌లోని వల్సాద్‌కు తీసుకెళ్లాడు. ఆరు నెలలు అక్కడే ఉంచాడు. ఈ ఆరు నెలలు ఆమె ఎక్కడ ఉంది? ఎవరి మధ్య ఉంది? ఎన్ని ఇళ్లు, ఎన్ని వీధులు, ఎన్ని చూపులు ఆమె మీద పడ్డాయి? ఎవరూ ప్రశ్నించలేదా? ఈ అమ్మాయి ఎవరు? ఇంత చిన్న వయసులో పెళ్లా? ఇక్కడ ఎందుకు ఉంది? అన్న ప్రశ్నలు ఎవరికీ రాలేదా? సమాజం చేసిన... నిరంతరం చేస్తున్న అతిపెద్ద నేరం ఇదే. అనుమానం వచ్చినా, మనం మౌనంగానే ఉండిపోతాం. మన పని కాదు అంటాం. అదే మౌనం నేరస్తుడికి రక్షణ కవచం.




మహిళలు, బాలికల రక్షణకు దేశంలో చట్టాలు లేకపోలేదు. బిహార్ కేసులో బిఎన్‌ఎస్ సెక్షన్లు, పాస్కో చట్టం వర్తిస్తాయి. ఇక్కడ చట్టాల లోటులేదు. కానీ, వాటి గురించిన అవగాహన చాలా మంది తల్లిదండ్రులకు లేదు. పిల్లల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ చట్టాల అర్థం ఏమిటో, ఎవరికీ వర్తిస్తాయో, ఎవరికి, ఎలా ఫిర్యాదు ఎలా చేయాలో తెలియని దుస్థితి. గ్రామీణం, పట్టన ప్రాంతం అనే తేడా లేకుండా, ఎక్కడైనా సరే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రజలు భయపడే పరిస్థితులు ఉన్నాయి. అందుకే, 'చట్టం, పోలీస్ వ్యవస్థ అనేవి భయపెట్టడానికి కాదు.. రక్షించడానికి' అనే భావనను సమాజంలో నాటాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు, విద్యా సంస్థల్లోనూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. ముందుగా తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు అవసరం. అదే సమయంలో, పిల్లలతో సంభాషణను ప్రోత్సహించాలి. స్కూళ్లల్లో జీవన నైపుణ్యాల బోధన తప్పనిసరి చేయాలి. సోషల్ మీడియా వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలి. 'చూసీ చూడనట్టు, మౌనంగా ఉండకూడదు' అనే సంసకృతి సమాజంలో రావాలి. బాధితులకు న్యాయంతో పాటు మానసిక మద్దతు ఇవ్వాలి. బిహార్ బాలిక కథ మనందరికీ ఒక హెచ్చరిక. ఇది ఒక చిన్న వార్త కాదు. 'నువ్వు ఒంటరిగా లేవు' అనే భరోసాను ప్రతి బాలికకూ ఇవ్వగలిగితే, మార్పుకు పునాదులు వేసినవాళ్లమవుతాం. ఈ కథ బాధిత బాలికతో ముగియకూడదు. మార్పు అక్కడి నుంచే మొదలుకావాలి.



# కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### అభ్యర్థులకు బి ఫారాలు అందజేత





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి బరిలో ఉన్న అభ్యర్థులకు స్థానిక శేషగిరి భవన్ సిపిఐ కార్యాలయంలో ఆయన మంగళవారం బి ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఈనెల 11న జరగనున్న కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా సిపిఐ తన అభ్యర్థులను ప్రకటించిందని, టిడిపి, ప్రజా సంఘాల మద్దతుతో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ప్రజాక్షేత్రంలోకి వెళుతుందని తెలిపారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ఆధ్వర్యంలో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయానికి ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పూర్తిగా పార్టీ కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగానే కొత్తగూడెం కార్పొరేషన్ వ్యాప్తంగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల ముఖ్యమంత్రి, మంత్రులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నామనే భావన వద్దని, స్థానిక పరిస్థితులు, రాజకీయ సమీకరణాల్లో భాగంగానే ఈ నిర్ణయానికి వచ్చామన్నారు. గత రెండేళ్లలో కొత్తగూడెం నియోజకవర్గ వ్యాప్తంగా పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు జరిగిందని, మారుమూల ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనకు శక్తివంచన లేని కృషి చేశామని, ఎన్నడూ జరగని అభివృద్ధి కొత్తగూడెం నియోజకవర్గంలో జరిగిందని, అనుక్షణం ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్నామని తెలిపారు. కార్పోరేషన్ ఏర్పాటుతో పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో 25సంవత్సరాల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయని, దీంతో ఆ ప్రాంత అభివృద్ధి శరవేగం కానుందన్నారు. కార్పోరేషన్ కాకుండా ఆనే శక్తులు కుట్రలు పన్నాయని, వారి కట్రలు, కుతంత్రాలను పటాపంచలు చేస్తూ తామిచ్చిన నివేదిక ప్రకారం ప్రభుత్వం అనతికాలంలోనే కొత్తగూడెం కార్పొరేషన్‌ను ప్రకటించిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, సిపిఐ అభ్యర్థులు గెలవడం ద్వారా కొత్తగూడెం కార్పొరేషన్ మరింత అభివృద్ధి పథంలో ముందుకు దూసుపోనుందన్నారు. కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగిరేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఈ సందర్భంగా కూనంనేని పిలుపునిచ్చారు.

# ఇంటింటి ప్రచారంలో సిపిఐ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ 20వ వార్డు మెంబర్ కపిలవాయి మానస గోపిచారి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేది ఒక్క సిపిఐ పార్టీనేనని, తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. 20వవార్డు అభివృద్ధికి అన్నివిధాలుగా కృషిచేస్తానని, వీధిలైట్లు, అండర్ డ్రైనేజి, స్థానిక యువతకు ఉద్యోగాల కోసం కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇచ్చేవిధంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇంటింటి తిరుగుతూ కంకికొడవలి గుర్తుకు ఓటేయాలని కోరారు. ఎన్నో పార్టీలకు అవకాశాలు ఇచ్చారు సిపిఐ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వండని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శివశంకర్, నాగర్‌కర్నూల్ టౌన్ సిపిఐ పట్టణ కార్యదర్శి హుస్సేన్, సత్యం, చంద్రకళ, రేణుక తదితరులు పాల్గొన్నారు.



# గెలుపే లక్ష్యంగా పోరాడాలి



### నూరుశాతం ఫలితాలు సాధించాలి

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా పిలుపు

**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పోరాడాలని, నూరు శాతం ఫలితాలను సాధించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. కార్పొరేషన్ పరిధి పాల్వంచ డివిజన్ నుండి పోటీలో నిలిచిన అభ్యర్థుల బి.ఫారాలను పార్టీ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథంకు మంగళవారం అందజేశారు. ఈ సంధర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఇంటింటికి వెళ్ళి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఆయా డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. నాయకులు, కార్యకర్తల సహాయ సహకారాలను తీసుకొంటూ ప్రచారాన్ని పరుగులు పెట్టించాలని, ప్రణాళికా ప్రకారం ప్రచారం చేస్తే విజయం దక్కుతుందని, ఏచిన్న అవకాశాన్ని జారవిడుచుకోవద్దన్నారు. ఏమాత్రం విశ్రమించినా ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యర్థి పార్టీల అంచనాలను తెలుసుకొంటూ ప్రచారాన్ని కొనసాగించి గెలుపు సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు దుగ్గిరాల సుధాకర్, శనగారపు శ్రీనివాస్, వైఎస్. గిరి, వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, వల్లపు యాకయ్య, చెరుకూరి శేఖర్ బాబు, మొగులూరి క్రిష్ణ, మహమ్మద్ అస్లాం, కంటెస్టెడ్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేసే వారిని ఆదరించండి

### సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు :** నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజాసేవచేసే వారిని మున్సిపల్ ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలునిచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా చండూరులోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మా భవనంలో మండల సిపిఐ కార్యవర్గ సమావేశం పార్టీ మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరైమా ట్లాడుతూ ఈనెల 11న జరగనున్న చండూరు మున్సిపల్ ఎన్నికల్లో నాల్గవ వార్డు అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థి జెల్ల ధనమ్మశ్రీనివాస్ కంకి కొడవలి గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి భారీ మెజార్టితో గెలిపించుకోవాలన్నారు. సిపిఐ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మునిసిపాలిటీ ఎన్నికలో కలిసికట్టుడా పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తిప్పర్తి రాములు, మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశ్, దోటి వెంకన్న, జెల్ల శ్రీను, సిహెచ్ ఊషయ్య, గంట రమేష్, ఇరిగి సంజీవ తదితరులు పాల్గొన్నారు. కాగా మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా చండూరు మున్సిపాలిటీలో సిపిఐ, కాంగ్రెస్ పార్టీ కలిసి ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందని తెలిపారు. చండూరు మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 10 వార్డులలో సిపిఐ, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో సిపిఐ పోటీ చేస్తుందని, మిగిలిన తొమ్మిది వార్డులలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని ప్రకటించారు. సిపిఐ కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే ప్రత్యర్థుల డిపాజిట్ గల్లంతుకావాలని, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ప్రచారం చేసి మున్సిపాలిటీలో ఉన్న 10కి 10 వార్డులు గెలిపించుకోవాలని చండూరు మున్సిపాలిటీపై మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

### సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**చౌటుప్పల్ :** మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థులకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రకటించారు. మంగళవారం నల్లగొండ జిల్లా చౌటుప్పల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన మిత్రపక్షాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఎన్నికల పొత్తు ధర్మం పాటించినందున సిపిఐ పార్టీకి మున్సిపాలిటీ కోఆప్షన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇచ్చేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అంగీకరించారని తెలిపారు. మున్సిపాలిటీలో సిపిఐ కార్యకర్తలు సంపూర్ణంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీకౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ మున్సిపాలిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్‌రెడ్డి, ఉడత రామలింగం, కొండూరు విప్లవ్, కేతరాజు నరసింహ, బోయమ మంకులు, బద్దుల సుధాకర్, నీళ్ల బిక్షపతి, టంగుటూరి రాములు, దాసరి కృష్ణ, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



## యువకుడికి కత్తిపోట్లు



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల సమీపంలో ఒక యువకుడిని గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. నల్లగొండ పట్టణానికి చెందిన ఇమ్రాన్ నల్లగొండ నుండి హైదరాబాద్‌కు కారులో ప్రయాణిస్తున్నాడు. నార్కట్‌పల్లిలో ఒక వ్యక్తి హైదరాబాద్ వరకు లిఫ్ట్ అడిగాడు. అతనిని కారులో ఎక్కించుకున్న ఇమ్రాన్‌ను సదరు వ్యక్తి చిట్యాల శివారులోకి రాగానే కత్తితో దాడి చేశాడు. ఇమ్రాన్ దగ్గర ఉన్న మొబైల్ ఫోన్‌ను లాక్కోవడానికి ప్రయత్నించాడు. ఇమ్రాన్ అతనిని తీవ్రంగా ప్రతిఘటించిన నేపధ్యంలో కత్తిపోట్లకు గురయ్యాడు. సంఘటనా స్థలంలో ఉన్న స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో క్షతగాత్రుడిని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దుండగుడు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

**ఇమ్రాన్‌పై గంజాయి కేసులు..** కాగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కత్తిపోట్లలో గాయపడిన ఇమ్రాన్‌పై నల్లగొండలోని పోలీస్ స్టేషన్‌లలో గంజాయి కేసులున్నాయని, ఇతనిపై జరిగిన దాడి సంఘటనను ఆ కోణంలో దర్యాప్తు చేస్తామని అన్నారు.

## నాలుగవ వార్డులో సిపిఐ పోటీ



మిగిలిన 9 వార్డులలో కాంగ్రెస్ పోటీ
సిపిఐ, కాంగ్రెస్ పార్టీల సంయుక్త ప్రకటన

**ప్రజాపక్షం/చండూరు :** ఈనెల 11న జరుగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా చండూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ), కాంగ్రెస్ పార్టీ కలిసి ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ డిసిసిబి చైర్మన్ చండూరు మున్సిపల్ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ఇన్‌చార్జీ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు చండూరులోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంయుక్తంగా మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 10 వార్డులలో సిపిఐ, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. మున్సిపాలిటీలోని నాల్గవ వార్డులో సిపిఐ పోటీ చేస్తుందని మిగిలిన 9 వార్డులలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని ప్రకటించారు. సిపిఐ, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే ప్రత్యర్థుల డిపాజిట్ గల్లంతు కావాలని, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఐక్యంగా ప్రచారం చేస్తూ మున్సిపాలిటీలో ఉన్న 10కి 10 వార్డులు గెలిపించుకోవాలని చండూరు మున్సిపాలిటీపై మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

## ర్యాండమైజేషన్ విధానం కీలకం



జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సిబ్బంది కేటాయింపులో భాగంగా రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో మున్సిపల్ జిల్లా ఎన్నికల పరిశీలకులు జి.రమేష్ సమక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్, నందికొండ, చండూర్, చిట్యాల, దేవరకొండ, హాలియా, మిర్యాలగూడ మున్సిపాలిటీల పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లకు అవసరమైన పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు.అన్ని మున్సిపాలిటీలలో మొత్తం 162 వార్డులు,475 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 20 శాతం రిజర్వుతో కలిపి ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పిఓ, ఒక ఏపిఓ, ఇతర పిఓల చొప్పున మొత్తం 1713 మంది పోలింగ్ సిబ్బందిని రెండవ రాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాండమైజేషన్ విధానం అత్యంత కీలకమని అన్నారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి హాజరయ్యారు.

## ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

బరిలో భారీగా స్వతంత్ర అభ్యర్థులు



**ప్రజాపక్షం/-సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం మంగళవారంతో ముగిసింది. ఆయా పార్టీల నుండి టిక్కెట్‌ను ఆశించి బంగపడ్డ వారు తమ నామినేషన్లను ఉపసంహరించుకోలేదు. దీంతో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగనున్నారు. కొంతమంది అభ్యర్థులు తమ పార్టీ పెద్దలు బుజ్జగించడంతో తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. నామినేషన్లు ఉపసంహరించుకోగా ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను అధికారులు అధికారికంగా వెల్లడించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మున్సిపాలిటిలో మొత్తం 48 వార్డుల్లో 264 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. ఇందులో ఆమ్ ఆద్మీ నుండి 1, బిఎస్‌పి 3, బిజెపి 47, సిపిఎం 3, కాంగ్రెస్ 48, బిఆర్ఎస్ 45, జనసేన 10, ఏఐఎఫ్‌బి (ఫార్వర్డ్ బ్లాక్) 2, ఇతర పార్టీల వారు 27, స్వతంత్రులు 78 మంది పోటీలో నిలిచారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో మొత్తం 28 వార్డులు ఉండగా, ఎన్నికల బరిలో 111 మంది ఉన్నారు. ఇందులో ఆమ్ ఆద్మీ 1, బిజెపి 22, సిపిఐ 2, సిపిఎం 1, కాంగ్రెస్ 25, బిఆర్ఎస్ 27, జనసేన 8, ఇతర పార్టీల వారు 2, స్వతంత్రులు 23 మంది బరిలో నిలిచారు. నేరేడుచర్ల మున్సిపాలిటిలో మొత్తం 15 వార్డులు ఉండగా 54 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బిజెపి 15, సిపిఎం 2, కాంగ్రెస్ 15, బిఆర్ఎస్ 14, ఇతర పార్టీలు 1, స్వతంత్రులు 7 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. తిరుమలగిరి మున్సిపాలిటిలో మొత్తం 15 వార్డులకు గాను 56 మంది అభ్యర్థులు బరిలో ఉండగా బిజెపి నుండి 13, సిపిఎం 2, కాంగ్రెస్ 15, బిఆర్ఎస్ 15, ఇతర పార్టీలు 3, స్వతంత్రులు 8 మంది ఉన్నారు. కోదాడ మున్సిపాలిటిలో మొత్తం 35 వార్డుల్లో మూడు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 32 వార్డులకు గాను 100కు పైగా అభ్యర్థులు బరిలో ఉన్నారు.

'నా చివరి శ్వాస వరకూ'

# ప్రజల సంక్షేమం కోసమే

ఎన్నికల ప్రచారంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థుల తరుపున రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంచి చెడులో అండగా నిలిచే కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉంటామని ప్రతినబూనారు. చర్లపల్లి(15)వ డివిజన్ అభ్యర్థి పెరిక నాగరాజు, మర్రిగూడ 14 డివిజన్ అభ్యర్థి బొజ్జ శంకరయ్యకు మద్దతుగా చర్లపల్లి బొట్రాయి చౌరస్తా వద్ద ప్రచారం నిర్వహించారు. అనంతరం 12వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి మామిడి కార్తీక్, 27 డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సట్టు నాగమణి శంకర్, 28వ డివిజన్ అభ్యర్థి గుండబోయిన పుష్పలత వెంకన్న, 29వ డివిజన్ అభ్యర్థి గులాబ్ మహమ్మద్ షఫిక్, 26వ డివిజన్ అభ్యర్థి అసిమా సుల్తాన్ (బషీర్), 30వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మారగోని నవీన్ గౌడ్ తరపున విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగ ప్రసంగం చేశారు. ''5సార్లు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన నా నల్లగొండ ప్రజల రుణం తీర్చుకోలేనిదనీ, నల్లగొండ ప్రజలతో నాది విడదీయని ఆత్మీయబంధమన్నారు. నల్లగొండ నే నా ఇల్లు... నల్లగొండనే నా ప్రాణం... నల్లగొండనే నా కుటుంబం.. నల్లగొండనే నా జీవితమని, పేద ప్రజల మధ్యలో ఉండడం నాకిష్టం'' అని మంత్రి పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ హఫీజ్ ఖాన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, అభ్యర్థులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పులి సంచరిస్తున్న ప్రదేశాల్లో కలెక్టర్ ప్రత్యేక చర్యలు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలోని కొన్ని గ్రామాల పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లుగా అటవీ శాఖ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం రాజాపేట మండలం బసంతాపూర్ గ్రామంలో నిన్న రాత్రి పులి దాడిలో మృతి చెందిన లేగ దూడ సంఘటన స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల గ్రామాలలో పులి సంచరిస్తున్నందున పులిని పట్టుకోవడానికి చేసే ప్రయత్నాల పై అటవీ అధికారులతో కలెక్టర్ చర్చించారు. అటవీ అధికారులు పులిని పట్టుకోవడానికి థర్మల్ డ్రోన్‌ను ఉపయోగించి పులి సంచరిస్తున్న ప్రదేశాలను వీడియో తీయడం, ట్రాప్ కెమెరా, పులిని బంధించడానికి బోన్లు ఏర్పాటు చేయడం జరిగిందని అటవీ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రత్యేకంగా అడవి ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని తెలిపారు. రాత్రి వేళలో పశువులను బయటికి వదలకుండా పశువుల పాకలో వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. పులి కనిపించినట్లు గమనించిన వెంటనే అటవీ శాఖ అధికారులకు లేదా స్థానిక గ్రామ పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. వాటి దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయరాదని అన్నారు. జిల్లా యంత్రాంగం మరియు అటవీ శాఖ సిబ్బంది పులి అడుగు జాడలను గమనిస్తూ , దాని పట్టుకోవడానికి, అడవిలోకి పంపడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు భయాందోళనకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి




జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది విధిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ విసి హాల్‌లో జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, ఆర్‌డిఓలు, తహశీల్దార్లతో మున్సిపల్ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 7, 8, 9 తేదీలలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఫెసిలిటేషన్ సెంటర్లలో సంబంధిత మున్సిపాలిటికి చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అభ్యర్థులకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేసిన తదుపరి సాధారణ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదని, కావున అభ్యర్థులు ఇట్టి విషయాన్ని గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిప్యూటి సిఈఓ శిరీష, డివిజనల్ పిఓ నారాయణరెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిట్యాలలో కాంగ్రెస్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నట్లు సిపిఐ నాయకుల తెలిపారు. మంగళవారం రోజున 2, 5 వార్డులకు నామినేషన్ వేసిన సిపిఐ నాయకులు షేక్ ఖాతీజ, బొలుగూరి సుగుణమ్మలు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్న అనంతరం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి తమ మద్దతును ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీతో ఉన్న స్నేహాన్ని కొనసాగిస్తామని, అన్ని వార్డులలో అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేస్తామని అన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెలుతున్న కాంగ్రెస్ పార్టీ వెంటే తాము ఉంటామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ సిపిఐ నాయకుల మద్దతుతో తమ బలం మరింత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లొడంగి శ్రవణ్‌కుమార్, మండల కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి షేక్ షరీఫ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోకల దేవదాసు, నాయకులు పాటిమాధవరెడ్డి, జడలచినమల్లయ్య పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పోలీసులకు తీవ్ర గాయాలు

సిఎం బందోబస్తుకు వెళ్తున్న క్రమంలో ఘటన



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** నేడు మిర్యాలగూడలో పర్యటించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ నిర్వహణ కోసం బందోబస్తుకు వెళ్తున్న ఇద్దరు కానిస్టేబుల్‌లను గుంటూరు వైపుకు వెళ్తున్న ఓ కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు మదార్, సురేష్‌లు సీఎం బందోబస్తు కోసం వారి బైక్‌పై సభాస్థలి ప్రాంతానికి వెళ్తుండగా హైద్రాబాద్ నుంచి గుంటూరు వైపుకు వెళ్తున్న ఓ భారీ కంటైనర్ అతివేగంతో బైక్ వెనుక నుంచి ఢీకొట్టడంతో కానిస్టేబుల్స్ ఇద్దరు కిందపడడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. కానిస్టేబుల్ మదార్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్సనిమిత్తం హైద్రాబాద్‌కు తరలించగా స్వల్ప గాయాలతో బయటపడిన సురేష్‌ను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లుగా పోలీసులు తెలిపారు.

## ప్రజా ఆశీర్వాదంతో గెలిచి సత్తా చాటాలి

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పురపాలక సంఘం రెండవ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఈనెల 11న జరిగే పోచంపల్లి మున్సిపాలిటీ 13 వార్డులకు జరిగే ఎన్నికలలో పోటీ చేసే కౌన్సిలర్ అభ్యర్థులకు మంగళవారం బి ఫారాలను అందజేసి ప్రజా ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో అందరూ గెలిచి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన పట్టణ కేంద్రంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చైర్మన్ అభ్యర్థి కౌన్సిలర్లకు బి ఫారాలను అందజేసి ఆల్ ది బెస్ట్ చెప్పారు. 13 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, టౌన్ అధ్యక్షులు భారత లవ కుమార్ మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, డిసిసి అధ్యక్షులు కళ్లెం రాఘవ రెడ్డి, మర్రి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు అంబరీష్ రెడ్డి, బాల్‌రెడ్డి, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, బండారు ప్రకాష్ రెడ్డి, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గంజి యుగంధర్, ఉపాధ్యక్షులు రుద్ర చంద్రప్రకాష్, చేనేత కార్మిక సంఘం కార్యదర్శి బిట్ల గణేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అభిమానులు ఆయన వెంట ఉన్నారు.

## బిఆర్ఎస్ అభ్యర్థి కిడ్నాప్

దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని
మాజీ ఎమ్మెల్యే బొల్లం ఫిర్యాదు



**ప్రజాపక్షం/కోదాడ:** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో గెలవలేక 11వ వార్డు టిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి ప్రసాద్‌ను కాంగ్రెస్ దుండగులు కిడ్నాప్ చేశారని తక్షణమే పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఈ అంశంపై ఎన్నికల ఇన్‌ఛార్జి బూడిద బిక్షమయ్యగౌడ్‌తో కలిసి పిర్యాదు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో నేరుగా గెలవలేక దొడ్డి దారిన కాంగ్రెస్ నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కిడ్నాప్‌కు గురైన తమ పార్టీ అభ్యర్థి దొడ్డిగొర్ల ప్రసాద్‌ను వెంటనే సురక్షితంగా విడిపించి తమకు అప్పగించాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార అహంకారంతో దౌర్జన్యానికి పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. కాగా 11 వార్డులో స్వచ్ఛగా ఎన్నికలు జరగాలని ఏకగ్రీవానికి తాము అంగీకరించమని బలవంతంగా ఏకగ్రీవం చేయటం తగదని ఆ వార్డు ప్రజలు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగాలే తప్ప తప్పుడు విధానాలను అవలంభించి ఏకగ్రీవం చేసుకోవడాన్ని తాము ఖండిస్తున్నామని వార్డు ప్రజలు తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ దొంగతనాల ముఠా అరెస్టు



సుమారు రూ.7 లక్షల విలువైన 8 మోటార్ సైకిళ్లు,
4 స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం : అడిషనల్ ఎస్‌పి రమేష్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను కేతేపల్లి పోలీసులు అరెస్టు చేశారని అడిషనల్ ఎస్‌పి రమేష్ తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోటార్ సైకిల్ దొంగతనాల ముఠాను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పల్లెం నరసయ్య హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్తూ, కేతేపల్లి గ్రామంలోని సాయి కృష్ణ హోటల్ వద్ద రాత్రి సమయంలో నిద్ర రావడంతో హోటల్ ఆవరణలో బైక్ పార్క్ చేసి నిద్రించగా, మరుసటి డిసెంబర్ 31న తెల్లవారు జాము సుమారు లేచి చూడగా బైక్ కనిపించక పోవడంతో కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ దర్యాప్తులో భాగంగా, మంగళవారం తెల్లవారు జాము సమయంలో, కొర్లపహాడ్ ఎక్స్ రోడ్ వద్ద విజయవాడ వైపు వెళ్లే వాహనాలను కేతేపల్లి ఎస్.ఐ, సిబ్బంది తనిఖీ చేస్తుండగా, రెండు మోటార్ సైకిళ్లపై నలుగురు వ్యక్తులు విజయవాడ వైపు వస్తూ పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారని తెలిపారు. విచారణలో ఏ 1 పగిళ్ల శివ కుమార్ ఇద్దరు బాల నేరస్తులు నల్లగొండలోని ప్రతీక్ రెడ్డి మెమోరియల్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్నారని, జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు రూ.7 లక్షల విలువైన 8 మోటార్ సైకిళ్లు,4 స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును నల్లగొండ డి.ఎస్.పి పర్యవేక్షణలో విజయవంతంగా ఛేదించిన సిఐ శాలిగౌరారం కొండల్ రెడ్డి, సీసీస్ సిఐ జితేందర్ రెడ్డి, ఎస్ఐ విజయ్ కుమార్, కేతేపల్లి ఎస్ఐ సతీష్, హెడ్ కానిస్టేబుల్ విష్ణు వర్ధనగిరి, వాహీద్, పుష్ప గిరి సిబ్బందిని అదనపు ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

## కాంగ్రెస్ – బిఆర్ఎస్ మధ్య హోరాహోరీ..

ప్రజాదరణ దక్కేది ఎవరికి..?

**ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మధ్య హోరాహోరీ నెలకొంది. ఆ పార్టీల నేతలు ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ తమ రాజకీయ చతురతను ప్రదర్శిస్తు-న్నారు. అధికార పార్టీ ఆర్యవైశ్య కమ్యూనిటీకి చెందిన ఓ బడా కాంట్రాక్టర్ సతీమణిని ఎన్నికల బరిలో నిలుపగా బిఆర్ఎస్ అందుకు ధీటుగా దేశం కోసం ప్రాణాలర్పించిన అదే కమ్యూనిటీకి చెందిన కల్నల్ సంతోష్ బాబు తల్లిని పోటీకి దింపింది. వీరు ఇరువురూ ఒకే కమ్యూనిటీకి చెందిన వారు కావడంతో అత్యధికంగా ఓటు బ్యాంక్ ఉన్న ఆర్యవైశ్యుల ప్రజాదరణతో-పాటు ఇతర కమ్యూనిటీ ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపుతారో అనే చర్చ ప్రజల్లో పెద్దఎత్తున సాగుతుంది. దీంతో సూర్యాపేట మున్సిపల్ అధికార పీఠంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత వరుసగా జరిగిన రెండు మున్సిపల్ ఎన్నికల్లో సూర్యాపేట మున్సిపాలిటిలో బిఆర్ఎస్ జెండా ఎగురవేసింది. మొత్తం 48 వార్డులు ఉండగా గత ఎన్నికల్లో బిఆర్ఎస్ 24 స్థానాల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ 15, బిజెపి 5, ఇతరులు/ స్వతంత్ర అభ్యర్థులు 4 స్థానాల్లో విజయం సాధించారు. ముచ్చటగా మూడవ సారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని బిఆర్ఎస్ తహతహలాడుతుంది. గెలుపే లక్ష్యంగా మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అధికార పార్టీ అంచనాలకు అందకుండా ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ శరవేగంగా పావులు కదుపుతున్నాడు. గత మున్సిపల్ ఎన్నికల్లో ఆర్యవైశ్య కమ్యూనిటికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మొరిశెట్టి శ్రీనివాస్ సతీమణి సుధారాణిని చైర్మన్ చేస్తానని మాట ఇవ్వగా ఆమె 39వ వార్డు నుండి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. మొత్తం బిఆర్ఎస్ కౌన్సిలర్లు 24 మంది గెలుపొందడంతో చైర్‌పర్సన్ పీఠం కూడా బిఆర్ఎస్‌కే దక్కగా కొన్ని రాజకీయ సమీకరణలతో ఆనాడు జగదీష్ రెడ్డి ఎవరి ఊహలకు అందని విధంగా 9 వార్డు నుండి కౌన్సిలర్ అభ్యర్థిగా గెలిచిన దళిత సామాజిక వర్గానికి చెందిన పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్‌ను చైర్‌పర్సన్‌గా నియామకమయ్యేలా పార్టీ అధిష్టానాన్ని ఒప్పించి, మెప్పించి ఆ స్థానంలో కూర్చోబెట్టారు. దీంతో బిఆర్ఎస్ పట్ల ఆర్యవైశ్యులలో ఆనాటి నుండి కొంత వ్యతిరేకత మొదలైంది. దీనిని పసిగట్టిన అధికార కాంగ్రెస్ పెద్దలు ఈ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఆర్థికంగా బలంగా ఉన్న ఆర్యవైశ్య కమ్యూనిటికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ మొరిశెట్టి లక్షాది సతీమణి నివేదితకు చైర్మన్ పీఠం ఆశచూపి ఎన్నికల బరిలోకి దింపారు. ఇదే అస్త్రంతో ముందుకు వెళ్ళి సూర్యాపేట మున్సిపాలిటిపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని వ్యూహరచన చేశారు. కానీ దీనిని ముందే పసిగట్టిన జగదీష్ రెడ్డి అదే కమ్యూనిటికి చెందిన దేశం కోసం ప్రాణాలర్పించిన కల్నల్ సంతోష్ బాబు తల్లి బిక్కుమళ్ళ మంజులకు మున్సిపల్ పీఠంపై కూర్చోబెట్టేందుకు 44వ వార్డు నుండి ఎన్నికల బరిలోకి దింపి కాంగ్రెస్‌కు అదిరిపోయే ట్విస్ట్ ఇచ్చారు. ఈ ప్రతిష్ఠాత్మక 44 వార్డు నుంచి బిజెపి ముఖ్య నేత సంకిని వెంకటేశ్వరరావు బిజెపి అభ్యర్థిగా బూర రమాదేవి లక్ష్మణ్‌ను బిసి అభ్యర్థిగా బరిలోకి దించారు.




**అధికార పీఠంపై తీవ్ర ఉత్కంఠ**

మున్సిపల్ పీఠాన్ని ఒకే సామాజిక వర్గానికి చెందిన ఆర్యవైశ్యులకు ఇస్తామని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్‌లు ఆశ చూపడంతో దేశం కోసం ప్రాణాలు అర్పించిన కల్నల్ సంతోష్ బాబు కుటుంబానికి, బడా కాంట్రాక్టర్ మొరిశెట్టి లక్షాది కుటుంబానికి మధ్య జరుగుతున్న ఎన్నికల పోరులా మారింది. ఇదే విషయమై రాజకీయ వర్గాలతో పాటు సామాన్య ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతుంది. కల్నల్ సంతోష్ బాబు తల్లి బిక్కుమళ్ళ మంజుల ప్రజాసేవకై తాము ముందుకు వస్తున్నామని చెబుతుండగా, కాంట్రాక్టర్ మొరిశెట్టి లక్షాది సతీమణి నివేదిత సూర్యాపేట అభివృద్ధికై పాటుపడేందుకు ఎన్నికల్లో పోటీచేస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. సూర్యాపేట మున్సిపాలిటిలో అత్యధిక ఓటు బ్యాంక్ ఉన్న ఆర్యవైశ్యులు ఎటువైపు ఉంటారు మిగతా సామాజిక వర్గాల వారు ఎటువైపు ఉంటారన్నది అంతుచిక్కడంలేదు. ఈ ఇరువురిలో ప్రజాదరణ ఎవరికి దక్కనుందో కూడా తెలియని పరిస్థితి. దీంతో అధికార పీఠంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బిఆర్ఎస్ వేసిన సెంట్‌మెంట్ అస్త్రం ఫలిస్తుందా... లేక కాంగ్రెస్ చెబుతున్న అభివృద్ధి అస్త్రం ఫలిస్తుందో ఓటర్ల ఎవరూ కరుణిస్తారో చూడాల్సిందే.



## ఎన్నికల అధికారికి బి ఫారాలు అందజేత

**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ మున్సిపాలిటీలో నామినేషన్‌ల ఉపసంహరణ, బీఫారాలు అందజేత సందర్భంగా మంగళవారం బిజెపి అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తమ బి ఫారాలను అందజేశారు. 16 వార్డులకు గాను 14 వార్డుల్లో పోటీ చేసిన బిజెపి అభ్యర్థులు ఒక్కొక్కరుగా ఎన్నికల అధికారికి తమ బీఫారలను అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు కొండయ్య, ఎన్నికల పరిశీలకులు అమర్ నాథ్ తోకలిసి మాట్లాడారు. మరోసారి మక్తల్ మున్సిపాలిటీ పై కమలం జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో మున్సిపాలిటీగా ఏర్పడిన మొదటి సారి బిజెపి అధికారం చేపట్టామని తిరిగి రెండోసారి ఎన్నికల్లోను తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గుర్తించి మరోసారి తమకు మద్దతు ఇవ్వవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కర్ని స్వామి, బాల్చేడ్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



**బిఆర్ఎస్ అభ్యర్థులు**

బిఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారికి తమ బిఫారాలను అందజేశారు. మక్తల్ మున్సిపాలిటీ లలో 5 వార్డులో పోటీచేసిన బిఆర్ఎస్ అభ్యర్థి విభూతి మారెప్ప నామినేషన్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ కార్యకర్తలు, పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు.



## 7కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** మున్సిపల్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నారాయణపేట పట్టణంలోని ఎర్రమన్ను గుట్ట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో ఎఫ్‌ఎసటీ టీమ్, పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ కు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి యద్గిరి నుంచి సికింద్రాబాద్ కు తరలిస్తున్న సుమారు 7 కేజీల వెండి ఆభరణాలను అధికారులు గుర్తించారు. వెండి ఆభరణాలకు సంబంధించిన తగు ఆధారాలు చూపించాలని కోరగా, సంబంధిత వ్యక్తి సరైన పత్రాలు సమర్పించలేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని ఎఫ్ఎస్టీ టీమ్ కు అప్పగించడం జరిగింది. ఈ తనిఖీల్లో నారాయణపేట పట్టణానికి చెందిన యాదయ్య , రూరల్ కానిస్టేబుల్ ఆనంద్ గౌడ్‌లు, ఎస్సై వెంకటేశ్వర్లు, సిఐ శివ శంకర్ ల ఆధ్వర్యంలో పాల్గొని వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన వెండి ఆభరణాలను రాత్రి 12:00 గంటల సమయంలో గ్రీవియన్స్ కమిటీకి అప్పగించడం జరిగిందని అధికారులు తెలిపారు.

## ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

**ప్రజాపక్షం/ కృష్ణ :** నారాయణపేట్ జిల్లా కృష్ణ మండలం హిందూపూర్ చౌరస్తా దగ్గర సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఎస్సై ఎస్‌ఎం నవీద్, సిబ్బంది వెహికల్ చెక్ చేస్తుండగా రాయచూర్ నుండి ఒక టిప్పర్ టియస్ 12 యుఈ 4281 అనుమానస్పదంగా తిరుగుతుండగా ఆపి తనిఖీ చేయగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను మాన్వి నుండి బీదర్‌కు తరలిస్తున్నామని టిప్పర్ డ్రైవర్ మహేష్ తెలిపాడు. టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు కృష్ణ ఎస్సై నవీద్ తెలిపారు.

## పేట అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యం

### మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట పట్టణంలో 2,3 వ వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి భారీగా ప్రచారం నిర్వహించారు. గత టిఆర్ఎస్ పాలన ఎలా ఉందో, ప్రస్తుతం రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలలో గమనించి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను సుతరి అరుణ, రాంరెడ్డి, కాకర్ల నారాయణమ్మ లకు మద్దతుగా నిలిచి వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట సుదర్శన్ రెడ్డి, విజయ్ సాగర్, సలీం అద్దంకి, దేవ రాజ్, జంగటి వెంకటేష్, పోషల్ సంతోష్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

## మక్తల్ మున్సిపాలిటీ బరిలో 65 మంది

**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ మున్సిపాలిటీలో మొత్తం 16 వార్డులను గాను 65 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు కమిషనర్ శ్రీరామ్ తెలిపారు. మంగళవారం మూడో తేదీ మూడు గంటల వరకు పోటీ నుంచి విరమించుకోవాడానికి గడువు ఉండగా స్క్రూట్నీ ముగిసే సమయానికి 83 మంది అభ్యర్థుల నామినేషన్లు పోటీకి ఓకే చేశారు. గడువు ముగిసే సమయానికి 18 మంది పోటీదారులు తమ నామినేషన్ల పత్రాలను వాపస్ తీసుకోగా. బరిలో 65 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. తెలంగాణ అక్షరాల ప్రకారం. వార్డులో పోటీలో ఉన్న వారి మొదటి పేరులో అక్షరం ప్రకారం నెంబర్లను వరస క్రమంలో గుర్తులను లిస్టులో ఉంచుతామని ఆ లిస్టు ఎన్నికల అధికారి ఓకే చేశాక పబ్లిస్ చేస్తామన్నారు. ఇదిలా ఉంటే. ఇప్పటివరకు 23 మంది పోస్టల్ బ్యాలెట్ లో దరఖాస్తు చేసుకున్నట్టుగా కమిషనర్ శ్రీరామ్ తెలిపారు.

## బిఆర్ఎస్ అభ్యర్థుల బి ఫారంల అందజేత



**ప్రజాపక్షం/గద్వాల :** నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు. మంగళవారం గద్వాల జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ ఆఫీసు నందు గద్వాల మున్సిపాలిటీ 37 వార్డు ల బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల బిఫామ్ లను డా. అంజనేయ గౌడ్, బాసు హనుమంతు నాయుడు ఎన్నికల ఆర్‌ఓ కి అందజేశారు.వీరితో పాటు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జి. రాఘవేంద్ర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి హత్య

**ప్రజాపక్షం/ గద్వాల :** ధరూర్ మండలం గుడ్డెందొడ్డి గ్రామంలో అనుమానస్పద స్థితిలో యువకుడి హత్య జరిగింది. సుధాకర్ (25) అనే యువకుడిని సోమవారం అర్ధరాత్రి హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య కొడుకు, కూతురు ఉన్నట్లు సమాచారం.

# మహమ్మారిని తరిమికొడదాం

### తగు జాగ్రత్తలు తీసుకొని క్యాన్సర్‌ను దూరం చేయండి : అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సురేష్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలకు అనుగుణంగా మంగళవారం నాడు "అంతర్జాతీయ క్యాన్సర్ డే" సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నారాయణపేట వారి ఆధ్వర్యంలో నారాయణపేటలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారి సహకారంతో విద్యార్థులతో క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన సదస్సుకు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మి పతి గౌడ్ హాజరయ్యారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్యాన్సర్ మహమ్మారి గురించి తెలుసుకొని దానిని నిర్మూలించడానికి తమవంతు కృషి చేయాలని పేర్కొన్నారు. క్యాన్సర్‌కు కారణమయ్యే జన్యుపరమైన కారణాలు, జీవనశైలి, ఆహారపు అలవాట్లు, బాధ్యత గల పౌరులుగా మనవంతు భాగంగా, క్యాన్సర్‌ను నివారించడానికి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రోజూ వ్యాయామం చేయడం, కాలుష్యానికి దూరంగా ఉండడం, మద్యపానం, ధూమపానం మానేయడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వంటివి పాటించాలని తెలిపారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మి పతి విద్యార్థులతో మాట్లాడుతూ క్యాన్సర్ ను ముందుగానే గుర్తించడానికి వైద్య పరీక్షలు అవసరమని ముందుగానే గుర్తించవచ్చు, సరైన చికిత్స పొందొచ్చని తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ వసంత మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ వారు కళాశాలలో ఏర్పాటు చేసి విద్యార్థులకు క్యాన్సర్ పై అవగాహన కల్పించి, క్యాన్సర్ నిర్మూలనకు మన వంతు పాత్ర పోషించాలని పేర్కొన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల భోధన, బోధనేతర సిబ్బంది తో పాటు కళాశాల విద్యార్థిని విద్యార్థులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీపై

## కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయం

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్ :** ప్రస్తుతం జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని వనపర్తి ఎమ్మెల్యే తూడిమేఘారెడ్డి భీమా వ్యక్తం చేశారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కొత్తకాపు శివసేనారెడ్డి, చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు బీ ఫామ్‌లను అందజేశారు. వనపర్తి పట్టణంలోని 33వార్డులలో 33 వార్డులు, పెబ్బేరు మున్సిపాలిటీలోని 12 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే అఖండ విజయం సాధిస్తారని ఆయన అన్నారు. ప్రజలు ప్రతిపక్షాలు నమ్మే పరిస్థితిలో లేరని, గత పదివేల కాలం కేవలం ప్రతిపక్ష నాయకులే బాగుపడ్డారు. తప్ప ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, నేటి ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల అందుతున్నాయని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున బీ ఫాంలో పొందిన ప్రతి కౌన్సిలర్ అభ్యర్థులందరినీ గెలిపించి తీరుతామని మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీని కైవసం చేసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, డిసిసి అధ్యక్షులు శివసేన రెడ్డి, తో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు ఆయన బీఫాంలో పంపించారు.



## శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు

**ప్రజాపక్షం/వనపర్తి :** ఎన్నికలను పూర్తిగా శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి స్థాయి పోలీసు అధికారి పూర్తి అప్రమత్తతో విధులు నిర్వహించాలని రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డి ఆదేశించారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయం నుండి జిల్లా ఎస్పీ సునితరెడ్డి, జిల్లాలోని పోలీస్ అధికారులతో కలిసి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల నిబంధనలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో వనపర్తి ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్ రావు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ, వనపర్తి సీఐ రత్నం, కొత్తకోట సీఐ రాంబాబు, ఆత్మకూరు సీఐ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, సీసీఎస్ సీఐ అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్‌లు అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన సంఘం ఘన సన్మానం

**ప్రజాపక్షం/వెల్దండ :** ఇటీవలే మండల గిరిజన భవన్‌కు నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన ర్లాతవత్ అజిత్‌నాయక్ మంగళవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘువీర్‌రెడ్డి,ఎస్సై కురుమూర్తిలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో ఉబ్బాలగట్టు తండా సర్పంచ్ కేశ్యనాయక్, తారాసింగ్, లాలునాయక్, నారాయణనాయక్, రాహుల్‌నాయక్ ఉన్నారు.



## కాంగ్రెస్ వైఫల్యాలను ప్రచారంచేయాలి

### మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ వైఫల్యాలను అభ్యర్థులు గడపగడపకు ప్రచారంచేయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో మున్సిపల్‌బరిలో ఉన్న బిఆర్ఎస్ 22మంది అభ్యర్థులకు బీఫామ్‌లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటిలో పోటిచేస్తున్న అభ్యర్థులకు పార్టీ అధికార బీఫామ్‌లు అందజేయడంవల్ల అధికారికంగా పార్టీ అభ్యర్థులుగా గుర్తింపు పొందుతారని అన్నారు. అభ్యర్థులు వార్డులలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాసమస్యల పరిష్కారం బిఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌చైర్మన్ ఎడ్మ సత్యం, శ్రీశైలం, మండలపార్టీ అధ్యక్షులు విజయ్‌గౌడ్, మాజీవైస్‌ఎంపిపి గోవర్ధన్, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కొల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్‌దే

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ మున్సిపాలిటి ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ విజయం సాధించి మున్సిపల్‌చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందని ఎక్సైజ్ టూరిజంశాఖమంత్రి జూపల్లికృష్ణారావు ధీమావ్యక్తంచేశారు. కొల్లాపూర్ మున్సిపాలిటి ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌పార్టీనుంచి పోటిచేస్తున్న 19మంది కౌన్సిలర్ అభ్యర్థులకు మంత్రి జూపల్లికృష్ణారావు బిఫామ్‌లను అందజేశారు. 1వవార్డు పసుపుల సుజాతవెంకటేష్ , 2వవార్డు ఉదుతల జయలక్ష్మి మహేష్‌యాదవ్, 3వవార్డు మాచుపల్లి సరోజబాల స్వామి, 4వవార్డు ఎండి ఖాదర్‌పాష, 5వవార్డు మేకలరమ్య నాగరాజు , 6వవార్డు జ్యోతిరెడ్డి సత్యం, 7వవార్డు బరిగల లక్ష్మి వేణుగోపాల్‌యాదవ్, 8వవార్డు అన్వర్‌పాష, 9వవార్డు షేక్‌రహీంపాష, 10వవార్డు బోరల్లిమహేష్, 11వవార్డు గుంద్రాతిస్వప్న శిల్పకిరణ్‌తేజగౌడ్, 12వవార్డు మేకల కిశోర్‌యాదవ్, 13వవార్డు వంగ అనూష రాజశేఖర్‌గౌడ్, 14వవార్డు సిబ్బడి నర్సింహ్మారావు, 15వవార్డు మానవపాడు నర్సింహ్మ, 16వవార్డు పెబ్బేటిశంకర్, 17వవార్డు కర్నేశివ, 18వవార్డు పాటపర్ల శ్రీదేవిగౌతమ్ గౌడ్, 19వవార్డు కాటమోనిలహరి వేణుగోపాల్‌గౌడ్‌కు అందజేశారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్ పంపిణీ

**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని రాఘాయిపల్లి గ్రామానికి చెందిన నాగుల కృష్ణయ్యకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.39 వేల చెక్‌ను బాధిత కుటుంబానికి అందజేశారు.అనారోగ్యానికి గురైన ప్రతి ఒక్కరూ సీఎంఆర్‌ఎఫ్ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్‌కుమార్, చెర్కూర్ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాస్, తలకొండపల్లి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి,రాఘాయిపల్లి ఉప సర్పంచ్ కొండల్ యాదవ్, నాగుల శ్రీనివాస్, నర్సింహ్మ, బర్కం గణేష్,మహేష్, రామచంద్రయ్య, జంగయ్య, చోటమ్మ పాల్గొన్నారు..

### అనుమతి లేని వెంచర్‌లో

## ప్లాట్లు కొనుగోలు చేయొద్దు

**ప్రజాపక్షం/పానుగల్ :** పానుగల్ మండల పరిధిలో కేతేపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని సర్వే నెం.16 లో గల వ్యవసాయ భూమిలో వేసిన వెంచర్ కు గ్రామ పంచాయితీ అనుమతి గానీ, డిటిసిపి అనుమతి లేనందున అట్టి వెంచర్ల ప్లాట్లను కొనుగోలు చేయవద్దని గ్రామ సర్పంచు భూతగాల రమేష్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు కలిసి ఏకగ్రీవ తీర్మానం చేశారు. మంగళవారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎటువంటి అనుమతులు లేకుండా డీటీసీపీ గానీ గ్రామ పంచాయితీ అనుమతి లేకుండా ప్లాట్ల కోసం రాళ్లను పాతడం జరిగిందన్నారు. సమాచారం తెలిసి గ్రామ పంచాయితీ నుండి మొదటి నోటీస్ ఇచ్చి రాళ్లను తీసేసి, డీటీసీపీ అనుమతి తీసుకోవాలని సూచించి 10 రోజుల గడువు ఇవ్వడం కూడా జరిగిందని అయిన వారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో రెండవ నోటీస్ ఇవ్వడం జరిగిందన్నారు. అనుమతి లేని వెంచర్‌లో ఎవరూ ప్లాట్లు కొనవద్దని గ్రామ పంచాయితీ దగ్గర నోటీస్ వేయడం జరుగుతుందన్నారు.

## అభ్యర్థుల ఖర్చుల రిజిస్టర్లపై మూడు దఫాల తనిఖీ

**ప్రజాపక్షం/వనపర్తి:** జిల్లాలో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన సూచనల ప్రకారం, ప్రతి అభ్యర్థి యొక్క ఎన్నికల వ్యయ రిజిస్టర్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకుడు మొత్తం మూడు సార్లు పరిశీలించనున్నట్లు జిల్లా వ్యయ పరిశీలకులు శ్రీనివాసులు నేడోక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి ఎన్నికల వ్యయం పై నియమ నిబంధనల ప్రకారం రిజిస్టర్లు నిర్వహించాల్సి ఉంటుందని అట్టి రిజిస్టర్లను ఫిబ్రవరి 5న మొదటి దఫా 7,9 వ తేదీన రెండు మూడవ దఫా ఎన్నికల వ్యయ పరిశీలకులు స్వయంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. పై తేదీలలో అన్ని మున్సిపల్ కార్యాలయాల్లో అభ్యర్థి స్వయంగా కాని వారి తరపున వ్యయ రిజిస్టర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రిజిస్టర్ల పరిశీలన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగునని తెలిపారు. నిర్ణీత తేదీన రిజిస్టర్లు సమర్పించకపోతే, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల ప్రకారం తగు చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు నిర్వహణకు సంబంధించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన సూచనలు పాటించాలి.

## 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

**ప్రజాపక్షం/ మాగనూర్ :** ఫిబ్రవరి 12న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు భరత్ కుమార్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం రోజు మాగనూరు పిహెచ్ సి మెడికల్ అధికారి డాక్టర్కి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గౌరమ్మ, పిహెచ్‌సి అధ్యక్షురాలు శంతమ్మ, అనురాధ, పార్వతమ్మ, అంజమ్మ, అనంతమ్మ, సుమిత్రి, పారిజాత, సుగుణ, నర్సమ్మ, సరిత, ఆశమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలకేంద్రమైన వంగూరు గ్రామానికి చెందిన బోయరాములు(61) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వాల్మీకిసంఘం నాయకులు రూ.20వేలు, బిఆర్ఎస్‌పార్టీ మాజీమండల అధ్యక్షులు గణేష్‌రావు, అక్కిఎల్లగౌడ్‌లు మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించినవారిలో వాల్మీకిసంఘం మండల అధ్యక్షులు పర్వతాలు, నాయకులు రమేష్, వెంకటస్వామి, మురళి, అర్జున్, జగన్, రాము,విష్ణు, లక్ష్మి నారాయణ, సురేష్‌తోపాటు సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రజాపాలనలో అందరికీ సంక్షేమఫలాలు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** ప్రజాప్రభుత్వం పాలనలో అర్హులందరికి సంక్షేమఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుందని అభివృద్ధికి ఆకర్షితులై వివిధపార్టీలకు అతీతంగా కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నారని ఎక్సైజ్ టూరిజంశాఖమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. కొల్లాపూర్ మున్సిపాలిటి ఎన్నికల నేపథ్యంలో 13వవార్డుకు చెందిన బిఆర్ఎస్‌పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీ 13వవార్డు కౌన్సిలర్ అభ్యర్థి వంగఅనూష రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి జూపల్లికృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన కాంగ్రెస్‌పార్టీకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి 13వవార్డు కౌన్సిలర్ అభ్యర్థిని వంగఅనూష రాజశేఖర్‌గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మరికంటి కమలాకర్‌రావు, వంగరాజశేఖర్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ఉపసంహరణ బీ ఫారం సమర్పణ ప్రక్రియ కొనసాగుతున్న దృష్ట్యా , మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి, భద్రతా విధుల నిర్వహణ పై పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నామినేషన్ ఉపసంహరణ బీ ఫారం సమర్పణ ప్రక్రియ పూర్తిగా ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని రకాల ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



## సమగ్రంగా భూభారతి సర్వే

### కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** భూభారతి సర్వే సమగ్రంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న భూభారతి సర్వే ప్రోగ్రాంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో కోస్గి కొత్తపల్లి నారాయణపేట షేర్ని పల్లి నర్వ జంగం రెడ్డిపల్లిలలో సర్వే చేయు నిమిత్తం ఫెంటాక్ అడ్వాన్స్ సహాయంతో సర్వే చేయుటకు గ్రామ సభలు నిర్వహించుటకు జిల్లా సర్వే అధికారి ఎ.డి. వేణు గోపాల్ రెడ్డి, వారి సిబ్బంది సర్వే పరికరం విధివిధానాల గురించి జిల్లా కలెక్టర్ కు వివరించడం జరిగింది.



## ఘనంగా లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు జడ్చర్ల పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. టిఆర్ఎస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉండి సేవలు అందిస్తానని మీ అందరి ప్రేమతో ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు. టిఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉండదని రాబోయే రోజుల్లో అధికారంలోకి మనమే వస్తున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కులమతాలకు రాజకీయాలకు పార్టీలకు అతీతంగా ముందుకు సాగుదామని ప్రతి ఒక్క కార్యకర్త నిబద్ధతతో టిఆర్ఎస్ పార్టీ గతంలో చేసిన అభివృద్ధి గురించి ఇంటింటికి ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు జడ్చర్ల విలేకరుల సంఘం నాయకులు తాంబూలం శ్రీనివాసులు, కృష్ణ తడక మల్ల శేఖర్, ప్రభాకర్, సురేష్, రాజేష్, శశికాంత్, లక్ష్మ ణ్, సురేందర్, రఘు, గోనెల నరేందర్, సర్దార్ ఇంతియాజ్, తదితరులు లక్ష్మారెడ్డిని ఘనంగా శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు.

## మృతుడికి ఎమ్మెల్యే మేఘారెడ్డి నివాళి



**ప్రజాపక్షం/శ్రీరంగాపూర్ :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో సోమవారం వసంతపురం ఏదుట్ల శ్రీను తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో కరిగేట ముగించుకుని వరిమడి ఎక్కే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ శ్రీను ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్లో శ్రీను మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని వారు అన్నారు. వారితో పాటు టిపిసిసి బిసి విభాగం ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, ఎస్ఐ హిమబిందు, గ్రామ సర్పంచు మద్దిలేటి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫిర్యాదుపై విచారణ

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అపరిశుభ్రమైన తాగునీరు అందిస్తున్న ఉపాధ్యాయులపై ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వనపర్తి డీఈఓ కు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను గతంలోనే ప్రజాపక్షం దినపత్రిక వెలుగులోకి తెచ్చింది. పాచి పట్టిన తాగునీరు విద్యార్థులకు ఇవ్వడంతో భరించలేని విద్యార్థులు జిల్లా విద్యాధికారుల దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకుని వచ్చారు. దీంతో స్పందించిన డీఈఓ అబ్దుల్ కనీ, దీనిపై నివేదిక ఇవ్వాలని మండల విద్యాధికారి జయరాములను ఆదేశించారు.


## అయిజ గడ్డపై కాషాయజెండా



**ప్రజాపక్షం/అయిజ :** జోగులాంబ గద్వాల్ జిల్లా అయిజ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ మున్సిపల్‌లోని 2వ వార్డు 14వ వార్డు లలో పోటీచేసే అభ్యర్థులు ఏం.సోమశేఖర్, హరిజన భీమన్న వార్డు ఇంచార్జి లతో కలిసి వార్డు ప్రజలతో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు పార్టీ బలోపేతానికి అత్యంత కీలకమని అన్నారు. ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు, ప్రతి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఐక్యత, క్రమశిక్షణతో ముందుకు సాగితే ప్రతి వార్డులో బిజెపి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు పర్దిపురం వీరయ్య చారి, పర్దిపురం తిమ్మప్ప, 19వ వార్డు అభ్యర్థి రాజశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘'అమరన్' నటి ఇప్పుడు తన కెరీర్‌లో కీలకమైన దశలో ఉంది, ఎందుకంటే ఆమె త్వరలో దేశవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెండు పాన్-ఇండియా బిగ్గీలలో కనిపించనుంది. వాటిలో ఒకటి నితేష్ తివారీ ఇతిహాసం రామాయణం కాగా, మరొక చిత్రం ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్ 'కల్కి2'.’

## విష్ణు దేవాలయాల నేపథ్యంలో 'నాగబంధం'




విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వం వహించిన మోస్ట్ ఎవైటెడ్ మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'నాగబంధం'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్లు అద్భుతమైన రెస్పాన్ తో అంచనాలను పెంచాయి. ఈ చిత్రం టీజర్‌ను ఫిబ్రవరి 15 మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విడుదల చేయనున్నారు.ఆకట్టుకునే టీజర్ పోస్టర్‌లో ఒక పురాతన ఆలయంలోని రహస్య నిధి చుట్టూ రక్షణగా చుట్టుకుని ఉన్న ఒక మహా నాగు పాము కనిపిస్తుంది. ఇది సినిమాలోని ఆధ్యాత్మిక దైవిక రహస్యాన్ని సూచిస్తుంది. భారతదేశంలోని చారిత్రాత్మక విష్ణు దేవాలయాల నేపథ్యంలో సాగే ఈ కథాంశం ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది.నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తుండగా, జగపతి బాబు, జయప్రకాష్, మురళి శర్మ, బి.ఎస్. అవినాష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, ఆర్‌సి ప్రణవ్ ఎడిటింగ్, అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న 'నాగబంధం' చిత్రం తుది నిర్మాణ దశకు చేరుకుంది. ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో భారీ పాన్ ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది.

## 'పళ్లిచట్టంబి' ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల



మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ 'పళ్లిచట్టంబి'. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ కయదు లోహర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. డ్రాగన్ మూవీ సక్సెస్ తర్వాత ఆడియెన్స్ లో పెరిగిన ఆమె క్రేజ్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఇటీవలే ఐదు భాషల్లో రిలీజ్ చేసిన 'పళ్లిచట్టంబి' మోషన్ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ ప్రెస్టీజియస్ మూవీ ఏప్రిల్ 9న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. 50, 60 దశకాల నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ మూవీలో హీరో టొవినో థామస్ ఇప్పటిదాకా చూడని విధంగా సరికొత్తగా కనిపించనున్నారు. 'పళ్లి చట్టంబి' సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. టొవినో థామస్, కయదు లోహర్, విజయరాఘవన్, సుధీర్ కరమన, బాబురాజ్, వినోద్ కేదమంగళం, ప్రశాంత్ అలెగ్జాండర్, తదితరులు నటిస్తున్నారు. ఏ చిత్రానికి ఎడిటింగ్ శ్రీజిత్ సరంగ్, సినిమాటోగ్రఫీ టిజో టోమీ, మ్యూజిక్ జేక్స్ బిజోయ్,స్క్రిప్ట్ ఎస్ సురేష్ బాబు,అసోసియేట్ ప్రొడ్యూసర్స్ మేఘశ్యామ్, తంజీర్.

## కపుల్ ఫ్రెండ్లీ' ట్రైలర్‌కు ప్రభాస్ ప్రశంసలు




సంతోష్ శోభన్, మానస వారణాసి హీ రో హీరోయిన్లు గా నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' మూవీ ట్రైలర్ రిలీజైంది. ఈ ట్రైలర్ బాగుంద ంటూ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రభాస్ ప్రసంశించారు.అంతేకాదు 'కపుల్ ఫ్రెండ్లీ' ట్రైలర్ ను ప్రభాస్ ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చే శారు. ఇది నేరుగా హృదయాల్లోంచి చెప్పిన ప్రేమ కథ అంటూ అప్రిషియేట్ చేశారు. తమ మూవీ ట్రైలర్ కు ప్రభాస్ నుంచి వచ్చిన ప్ర శంసలతో 'కపుల్ ఫ్రెండ్లీ' మూవీ టీమ్ సంతోషాన్ని వ్యక్తం చేస్తోంది. యూవీ క్రి యేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజిక ల్ రొమాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ నెల 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతో ంది. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాను ప్యాషనేట్ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొ గిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నారు. ఆర్ట్ మైఖేల్ బీఎఫ్ ఏ, ఎడిటర్ గణేష్ శివ, డీవోపీ దినేష్ పురుషోత్తమన్,మ్యూజిక్ ఆదిత్య రవీంద్రన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎస్ఎస్ వర్మ,రచన, దర్శకత్వం అశ్విన్ చంద్రశేఖర్.

## ట్రైలర్ షాట్స్ 'భూత్ బంగ్లా' నుంచే కాపీ

### ఎర్రచీర దర్శకుడు సుమన్ బాబు



బేబి దమరి సమర్పణలో శ్రీ పద్మాయల ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ఎర్రచీర ది బిగినింగ్. మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని కీలక పాత్రలో నటించగా, దర్శకుడు సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్రను కూడా పోషించారు. ఈ సినిమా విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో దర్శకుడు సుమన్ బాబు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఎర్రచీర – ది బిగినింగ్ ఒక విలక్షణమైన కథాంశంతో రూపొందిన సినిమా. మదర్ సెంటిమెంట్‌కు హారర్, యాక్షన్ అంశాలు బలంగా మిళితమయ్యాయి అని తెలిపారు. ఇప్పటికే ఈ చిత్రాన్ని వీక్షించిన డిస్ట్రిబ్యూటర్లు ప్రశంసలు కురిపించారని ఆయన వెల్లడించారు. ఇది ఒక లేడీ ఓరియెంటెడ్ చిత్రం అయినప్పటికీ కుటుంబమంతా కలిసి చూసేలా రూపొందించామని అన్నారు. ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఈ కథను తీసుకున్నా. షూటింగ్ 37 రోజుల్లో పూర్తయినప్పటికీ, సీజీ వర్క్ కారణంగా సినిమా ఆలస్యమైంది. గ్రాఫిక్స్ అవుట్‌పుట్ సంతృప్తికరంగా రాకపోవడంతో మూడు చోట్ల చేయించాల్సి వచ్చింది. 'హనుమాన్' సినిమా రేంజ్ క్వాలిటీ కోసం ప్రయత్నించాం. అందుకే లేట్ అయింది. ఈ కథకు తెలుగు అమ్మాయి అయితేనే సరిగ్గా సరిపోతుందని భావించి, కారుణ్య చౌదరిని ఎంపిక చేశా. ఇందులో కేవలం ఇరవై శాతం మాత్రమే వాస్తవ కథ ఉంటుంది మిగితాదంతా కల్పితం. ఇది రెగ్యులర్ హారర్ సినిమా కాదు. థియేటర్లలో ప్రతి షోకి లక్కీ డ్రా తీసి 10 మందికి చీరలను బహుమతిగా ఇవ్వబోతున్నాం. అక్షయ్ కుమార్ సినిమా 'భూత్ బంగ్లా'లో పాప పాలు తాగే షాట్‌ను మా సినిమా నుండే కాపీ కొట్టారు. యూత్ కోసం, కమర్షియల్ హంగుల కోసం 36 ముద్దుల కాన్సెప్ట్‌తో ఒక పాటను పెట్టాం. అది కథ డిమాండ్ మేరకే పెట్టాం. ఎర్రచీరకు సీక్వెల్‌గా అరకులో జరిగిన గిరిజన యదార్థ గాధతో 'అంబిక (ఎర్రచీర2)' సినిమాను కూడా ప్లాన్ చేస్తున్నా. అలాగే 'రాముడా? కృష్ణుడా?' అనే రొమాంటిక్ కామెడీ సినిమా చేస్తున్నా. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒక సినిమా రిలీజ్ చేసే ప్లాన్‌లో ఉన్నా అని తెలిపారు.

## యధార్థ సంఘటనలతో 'వింటర్'



క్రిసెంట్ సినిమా, టీఎస్ఆర్ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'వింటర్'. రామ్, ఆదిత్య సూరజ్ సింగ్, కుసుమ చందక, శశికళ, శ్రీజిత ఘోష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని రియాజ్ అహ్మద్, టి. శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. 'రాచరికం' సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న సురేష్ లంకలపల్లి ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఈ సినిమాతో రిజ్వాన్ అలీ విలన్‌గా తెరకు పరిచయం కానున్నారు. ఇక ఈ మూవీని కశ్మీర్ లో జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. 'వింటర్' సినిమాకు సంబంధించిన పూ జా కార్యక్రమాల్ని హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. చిత్ర ప్రారంభోత్సవంలో టీం అంతా పాల్గొంది. సినిమా అద్భుతంగా రావాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడదని కోరుకుంటూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రామ్, ఆదిత్య సూరజ్ సింగ్ , కుసుమ చందక, శశికళ, శ్రీజిత గోష్, రిజ్వాన్ అలీ నటిస్తున్నారు.

## అడవి శేష్ చేతుల మీదుగా 'క్యాట్' పోస్టర్ విడుదల



వి.ఆర్.జి.ఆర్ మూవీస్ బ్యానర్ పై వై. గంగాధర్ సమర్పణలో, రజని గొంగటి నిర్మాతగా నూతన దర్శకుడు జీవి నాయుడు దర్శకత్వం వహించిన చిత్రం క్యాట్ ఫస్ట్ కాపీ సిద్ధమయింది.ఈ సందర్భంగా ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్ ను హీరో అడివి శేష్ హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియో లో విడుదల చేశారు. ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ నటీనటులకు, సాంకేతిక నిపుణులకు శుభాకాంక్షలు చెప్పి క్యాట్ మూవీ ఘన విజయం సాధించాలి అని అన్నారు. డ్రామా, థ్రిల్లర్ జోనర్ లో తెరకెక్కిన ఈ చిత్రంలో నాయుడు, వీజే బాలు, లావణ్య, కళ్యాణి రాణి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి ఫోటోగ్రఫీ పంకజ్ తొట్టాడ, ఎడిటింగ్ వెంకట్ ప్రభు, మ్యూజిక్ మారుతి రాజా, కథ, స్క్రీన్ ప్లే, మాటలు: వి సీహెచ్ శేఖర్ ముద్దు, దర్శకత్వం: జీవి నాయుడు (గొంగటి వీరాంజనేయులు)వీరాంజనేయులు.

## 'మెల్లకన్ను'తో చేయడం అంత ఈజీ కాదు



'చిట్ చాట్'లో దర్శకుడు వినయ్ రత్నం

చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా రూపొందిన 'శ్రీ చిదంబరం'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం ద్వారా వినయ్ రత్నం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈసందర్భంగా దర్శకుడు వినయ్ రత్నం మంగళవారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.ప్రెజెంట్ జనరేషన్ ఇన్‌సెక్యూరిటీస్‌తో ఫీలవుతూ వాళ్ల లైఫ్‌ను కాన్ఫిడెంట్‌గా లీడ్ చేయాలేకపోతున్నారు. పక్కవాళ్లకు ఉన్నవి చూసి మనకు అవి లేవు కదా అని కంపేర్ చేసుకుంటున్నారు. ఈ టైమ్‌లో చెప్పాల్సిన కథ అనిపించింది. అందుకే ఇలాంటి కథను సున్నితమైన భావోద్వేగాలతో చెప్పాలని అనుకున్నాను. ఒక మనిషిని నువ్వు ప్రేమించగలగాలి అంటే మొదట నిన్ను నువ్వు ప్రేమించాలి అనేది ఈ కథ సారాంశం.ఇన్‌సెక్యూర్డ్‌గా ఫీలవుతున్న వాళ్లందరు ఈ సినిమా కథకు ఇన్‌స్పిరేషన్. ఇప్పటికీ నా స్నేహితుడు జయంత్. యూఎస్‌లో ఉంటాడు. వాడు ఎక్కడికి వెళ్లడు. ఎవ్వరిని ఇబ్బందిపెట్టడు. వాడ్ని చూసి ఈ కథ చెప్పాలని అనిపించింది. 25 షార్ట్ ఫిల్మ్ చేశాను. రాజమండ్రి మాది. నిహారిక కొణిదెల సమర్పణలో ఫిల్మ్ ఫెస్టివల్స్ కోసం ఓ షార్ట్ ఫిల్మ్‌చేశాను. థియేట్రికల్‌గా ఇది మొదటి సినిమా. మొదట ఈ సినిమా క్రౌడ్ ఫండింగ్‌తో స్టార్ట్ చేశాము. ఆ తరువాత నిర్మాత చింతా గోపాల కృష్ణారెడ్డి ఈ కథ నచ్చి ప్రొడ్యూస్ చేశాడు.ఈ సినిమాలో చిదంబరం అనే పాత్రకు సింగిల్ ప్లే చేయాలి. ఈ కథ అనుకున్నప్పుడే వంశీని హీరోగా అనుకున్నాను. మెల్ల కన్నుతో ఈ పాత్ర చేయడం అంతా ఈజీ కాదు .దానికి చాలా ప్రాక్టిస్ కావాలి. ఇక మిగతా ఆర్టిస్టులందరిని ఈస్ట్ గోదావరిలోఆడిషన్ తీసుకుని, నేచురాలిటి కోసం రాజమండ్రిలో ఆడిషన్ తీసుకుని అక్కడి వాళ్లనే తీకున్నాను. అందర్ని వర్క్‌షాప్ ద్వారానే తీసుకున్నాను. సినిమా చూసిన వాళ్లందరూ చాలా ఫ్రెష్ సినిమా చూశామని అన్నారు. కేరాఫ్ కంచరపాలెం , పెళ్లి చూపులు సినిమాతో కంపేర్ చేస్తున్నారు. నేను ఈ సినిమాలు చూసి నేర్చుకున్నాను. ఆ సినిమాలతో నా సినిమాను పోల్చడం ఆనందంగా ఉంది.ఈ సినిమాలో అయిదు పాటలు ఉంటాయి. కీరవాణి పాడిన పాటతో పాటు అన్ని పాటలు బాగుంటాయి. షూటింగ్ లోకేషన్స్ 32 డేస్‌లో చేశాం. ట్రాన్స్‌పోర్ట్ సరిగ్గా లేని లోకేషన్స్‌లో చిత్రీకరణ చేశాం. మెల్ల కన్ను ఉన్నా వాళ్లను ఈస్ట్ గోదావరిలో చిదంబరం అని ఏడిపిస్తుంటారు. ఈ సినిమాలో కూడా హీరోని చిదంబరం అని పిలిచి పిలిచి అతన్ని వర్జినల్ పేరు కూడా మరిచిపోతాడు సినిమాలో. ఇక కథ విన్న తరువాత పాత్ర మీద రెస్పెక్ట్ పెరిగి శ్రీ చిదంబరం అన్నాం. ఫైనల్ కాపీ చూసుకున్న తరువాత మరింత మర్యాద పెరిగి శ్రీ చిదంబరం గారు అని పెట్టాం.

## విధానాలు అనుసరించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయం సాధిస్తున్న జగిత్యాల జిల్లా పూదూరు గ్రామానికి చెందిన రైతు రామకృష్ణను, ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలని, అందుకు అనుగుణంగానే రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి పాల్గొన్నారు.

## మృత్యువు

(మొదటి పేజీ తరువాయి)

అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సాయంతో గాయపడిన వారిని చికిత్స కోసం దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను మెట్ పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో సుమారు 10 మంది పైగా ఉన్నట్లు సమాచారం. పొద్దంతా కూలీ చేసుకొని ఇంటికి వెళ్తుండగా గ్రామానికి కొద్ది దూరంలోనే మృత్యువాత పడడం విషాద ఛాయాలను మిగిల్చింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

# మేడారం జాతర దిగ్విజయం

### 2.5 కోట్ల మంది భక్తుల రాక : మంత్రి ధనసరి అనసూయ సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : మేడారం జాతర విజయవంతం కావడంపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మీడియా ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన ఇష్టాగోష్టిలో ఆమె జాతర విశేషాలను, భవిష్యత్తు ప్రణాళికలను పంచుకున్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర 'మేడారం సమ్మక్కసారలమ్మ' మహా జాతర అత్యంత వైభవంగా, విజయవంతంగా ముగిసిందని మంత్రి సీతక్క తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులు క్షేమంగా అమ్మవార్లను దర్శించుకోవడం సంతోషదాయకమని ఆనందం వ్యక్తం చేశారు.

**రికార్డు స్థాయిలో భక్తుల రాక..**

ఈ ఏడాది జాతరకు భక్తుల తాకిడి అనూహ్యంగా ఉందని మంత్రి తెలిపారు. 'క్లాస్, మాస్ అనే తేడా లేకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, హైక్లాస్ పీపుల్ కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు భావిస్తున్నాం' అని ఆమె వివరించారు. మరో ఒకటి రెండు రోజుల్లో తిరుగు జాతర ప్రక్రియ కూడా ముగుస్తుందన్నారు.

**కావాలనే విష ప్రచారం..**

జాతర ఏర్పాట్లపై కొంతమంది కావాలనే విష ప్రచారం చేశారని సీతక్క మండిపడ్డారు. ముఖ్యంగా ఒక చిన్న దొంగతనం ఘటనను భూతద్దంలో చూపి తప్పుడు వార్తలు వ్యాప్తి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను చూసి ప్రశంసించడం తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఆమె అన్నారు.

**ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం**

భక్తులకు ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వచ్చే జాతర నాటికి కీలక నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మేడారం చుట్టుపక్కల ఉన్న రోడ్లను వెడల్పు చేసి, ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో చేపట్టాల్సిన పనులపై త్వరలోనే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ యంత్రాంగం, పోలీస్, ఇతర శాఖల సమన్వయంతో మేడారం జాతరను ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిపామని మంత్రి సీతక్క చెప్పారు.



# టెండర్ల ముందు సైట్ విజిట్ దేశవ్యాప్త రూల్

### కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: గనుల కేటాయింపులో టెండర్లు ముందు సైట్ విజిట్ చేయాలనేది దేశ వ్యాప్తంగా ఉన్న రూల్ అని, ఇది ప్రజలకు మేలు చేస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. కానీ దీన్ని రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 17 కంపెనీలు విజిట్ చేస్తే, ఒక్కరికి కూడా సర్టిఫికేట్ ఇవ్వలేదన్నారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయి, గొడవలు పెట్టుకుంటున్నారన్నారు. హైదరాబాద్ నగరం ఐటీ, ఎడ్యుకేషన్, డిజిటల్, సెమీకండక్టర్, మెడికల్ రంగాల్లో దూసుకుపోతూ 'హబ్ ఆఫ్ హబ్స్ హైదరాబాద్'గా అవతరించిందని కిషన్ రెడ్డి ప్రశంసించారు. వచ్చే ఐదేళ్లలో రూ.10 వేల కోట్లతో చేపట్టే ఈ పథకం ద్వారా హైదరాబాద్ ఫార్మా క్యాపిటల్‌గా మరింత బలోపేతం కానుందన్నారు. విదేశీ కంపెనీలు భారతీయ డేటా సెంటర్లను వాడితే 2047 వరకు 'టాక్స్ హాలిడే' ప్రకటించినట్లు తెలిపారు. సిడిఎఫ్‌డి ఎఐఎబి వంటి కేంద్ర సంస్థలకు రూ.3 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. తెలంగాణకు రైల్వే బడ్జెట్‌లో గతంతో పోలిస్తే 6 రెట్లు అధికంగా (రూ.5,454 కోట్లు) కేటాయింపులు జరిగాయన్నారు. దేశంలో ప్రకటించిన 7 కారిడార్లలో 3 హైదరాబాద్ నుంచే ప్రారంభమవుతాయన్నారు. యాదగిరిగుట్ట వరకు ఎంఎంటిఎస్ మూడో దశను విస్తరిస్తామని, త్వరలోనే ప్రధాని మోదీ దీనికి భూమిపూజ చేస్తారని తెలిపారు. తెలంగాణలో రూ.42 వేల కోట్లతో కొత్తగా జాతీయ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని, ఇందులో హైదరాబాద్–విజయవాడ ఆరు లేన్‌ల రహదారి (రూ.10,297 కోట్లు) కీలకమని చెప్పారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్‌ను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చారని విమర్శించారు.

## డిఆర్‌డిఒ మరో ఘనత

(మొదటి పేజీ తరువాయి)

ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటిఆర్)లో ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. పరీక్షల్లో భాగంగా నాజిల్‌లెస్ బూస్టర్, సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ రామ్ జెట్ మోటార్, ఫ్యూయల్ ఫ్లో కంట్రోలర్ వంటి అన్ని వ్యవస్థలు ఆశించిన రీతిలో అత్యుత్తమ పనితీరును కనబరిచాయి. ఐటిఆర్ ఏర్పాటు చేసిన వివిధ ట్రాకింగ్ పరికరాల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఈ పరీక్ష విజయవంతమైనట్లు శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. ఎస్ఎఫ్‌డిఆర్ ప్రొపల్షన్ వ్యవస్థ పరీక్ష విజయవంతంతో శత్రు దేశాల లక్ష్యాలను అత్యంత దూరం నుంచే అడ్డుకోగల క్షిపణుల తయారీ దిశగా భారత్ ముందడుగు వేసినట్లయ్యింది. ఈ ప్రయోగాన్ని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ, హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ, రీసెర్చ్ సెంటర్ ఇమారత్, ఐటిఆర్ శాస్త్రవేత్తలు పర్యవేక్షించారు.

## ఖేమ్‌చంద్ సింగ్

(మొదటి పేజీ తరువాయి)

నాయకురాలు నెమ్చా కిప్గెన్ ఉపముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. బిజెపి ఇక్కడ చాలా వ్యూహాత్మకంగా మైతీ తెగ నుంచి సీఎంను, కుకీ తెగ నుంచి డిప్యూటీ సీఎంను ఎంపిక చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా మణిపూర్ ప్రస్తుత శాసనసభ పదవీకాలం 2027 వరకు మాత్రమే ఉంది. 2023లో జాతుల మధ్య ఘర్షణ చెలరేగడంతో మణిపూర్ అట్టుడికింది. ఈ హింసాత్మక ఘర్షణల వల్ల 250 మందికి పైగా మృతి చెందగా, వేలాది మంది పూర్తిగా నిరాశ్రయులు అయ్యారు. ఈ గొడవలు ఏమాత్రం చల్లారకపోవడంతో, గతేడాది ఫిబ్రవరిలో బీరెన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీనితో అక్కడ రాష్ట్రపది పాలన విధించారు. ఇలా మణిపూర్‌లో 2025 ఫిబ్రవరి 13 నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. దీనితో 60 మంది సభ్యుల అసెంబ్లీని అప్పటి నుంచి సుప్తచేతనావస్థలో ఉంచారు. తాజాగా ప్రభుత్వం ఏర్పాటు కానుండడంతో ఆ ఆంక్షలు తొలగిపోనున్నాయి. 60 స్థానాలు ఉన్న మణిపూర్ అసెంబ్లీలో, బిజెపికి 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. (వాస్తవానికి 2022 ఎన్నికల్లో మొదట బిజెపి 32 సీట్లు గెలుచుకోగా, తరువాత ఆరుగురు జేడీయూ ఎమ్మెల్యేల్లో ఐదుగురు బిజెపిలో చేరారు.) కాగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌సిపి) 6, నాగా పీపుల్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) 5, కాంగ్రెస్ 5, కుకీ పీపుల్స్ అలయన్స్ (కెపిఎ) 2, జనతాదళ్ (యునైటెడ్)కు 1 ఎమ్మెల్యే, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రస్తుతం ఒక సిట్టింగ్ ఎమ్మెల్యే మరణించడంతో ఆ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉంది.

## కేబినెట్ నిర్ణయం ఉంటే చాలు

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గత సంవత్సరం ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జత చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదా వేసింది.

**కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు మార్గం సుగమం :** సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టతతో కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు ఉన్న ప్రధాన అడ్డంకి దాదాపుగా తొలగినట్టే రాజకీయ నేతలు భావిస్తున్నారు. కోర్టు ఉత్తర్వుల కారణంగా నియామకాలు నిలిచిపోయాయన్న వాదనకు ఇక చెల్లుబాటు ఉండదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. కేబినెట్ నిర్ణయం మేరకు గవర్నర్ ముందడుగు వేస్తే, ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు.

**రాజకీయ ప్రభావాలు :** సుప్రీంకోర్టు స్పష్టత తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది. అధికార పార్టీకే కాకుండా ప్రతిపక్షాలకు కూడా ఇది ఒక స్పష్టమైన సంకేతంగా మారింది. గవర్నర్ పాత్రపై జరుగుతున్న రాజకీయ విమర్శలకు కొంత మేరకు ముగింపు పలికినట్టేనని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో, రాజ్యాంగ సంస్థల మధ్య సమతౌల్యం ఎంత కీలకమో ఈ కేసు మరోసారి గుర్తు చేసింది.

## విబి–జీ రామ్ జీ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకువచ్చిందని విమర్శింస్తూ, 'సమాఖ్య వ్యవస్థ మౌలిక ఆలోచనలకు, గ్రామీణ ప్రజల జీవనోపాధి హక్కుకు తీవ్ర హానికర చర్య' అన్నారు. 'కర్ణాటకలోని గ్రామీణ ప్రజల జీవన హక్కులను సంరక్షించడంకోసం 'వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్(గ్రామీణ్) చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణం రద్దు చేయమని కర్ణాటక రాష్ట్ర శాసనసభ విజ్ఞప్తి చేస్తోంది, ఈ విధంగా ఎవరినీ సంప్రదించకుండా చట్టం చేయడం సమాఖ్య సూత్రానికి విరుద్ధం, రాష్ట్ర కోశాగారానికి అతిపెద్ద భారం, వికేంద్రీకరణ సూత్రానికి విరుద్ధం, గ్రామ పంచాయతీల అధికారాలను లాక్కుపోవడమే. అదే విధంగా గ్రామీణ ఆస్తులు సృష్టించేందుకు, గ్రామీణ పేదల స్వయం సమృద్ధికి దారితీసే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని దాని పూర్వపు వాస్తవిక రూపంలో పునరుద్ధరించాలి' అని సిద్ధరామయ్య తీ ర్మానాన్ని సభలో చదివారు. ఈ శాసనసభ పంచాయతీరాజ్ వ్యవస్థకు, వికేంద్రీకరణ సూత్రానికి పూర్తిగా కట్టుబడి ఉందని ఈ సభ పునరుద్ఘాటిస్తోంది, పూర్వ పథకాన్ని పునరుద్ధరించేందుకు చిత్తశుద్ధితో సభ కట్టుబడి ఉంది, ఎంజిఎన్ఆర్ఇజిఎ పథకం గ్రామీణ జీవనానికి సంజీవని వంటిది, గ్రామీణ జీవితంలో ఒక భాగం, అందువల్ల కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దుచేసి విబి–జీ రామ్ జీ చట్టాన్ని తీకురావడాన్ని ఈ సభ చాలా గట్టిగా ప్రతిఘటిస్తోంది' అని పేర్కొంది.

14వ ఆర్థిక సంఘం కర్ణాటక రాష్ట్రానికి 4.71 శాతం పన్ను వాటా చెల్లించాలని సిఫార్సుచేసిందనీ,కానీ 15వ ఆర్థిక సంఘంలో మాత్రం ఈ వాటాను 3.64 శాతానికి తగ్గించారని తీర్మానం సందర్భంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విమర్శించారు. ఇప్పుడు 16వ ఆర్థిక సంఘం రాష్ట్ర వాటాను 4.131 శాతం ఇవ్వాలని సిఫార్సు చేయగా, ఈ సిఫార్సు 14వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సుకంటే 14.1 శాతం తక్కువగా ఉందని విమర్శించారు. ఈ విధంగా రాష్ట్రం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో విబి–జీ రామ్ జీ పథకం ద్వారా రాష్ట్రంపై నలభైశాతం భారాన్ని విధించారని, దీనివల్ల రాష్ట్ర ఆర్థిక భద్రత, అభివృద్ధి దెబ్బతింటుందన్నారు. ఢిల్లీ పాలకులు రాజప్రాసాదాలలో కూర్చుని పథకాలు రచిస్తున్నారని, గ్రామసభకు ఉండే అధికారాలను హరించారని విమర్శించారు. అవసరాలకు అనుగుణంగా పనులను ఎంపిక చేసుకునే అధికారం పంచాయతీలకు లేకుండాపోయిందన్నారు. గ్రామంలో ఎలాంటి పనులు చేయాలో ఎంపిక చేసుకునే ప్రణాళిక పంచాయతీలోనే అమలు చేయాల్సి ఉందన్నారు. ఈ కొత్త చట్టం 12 నెలలకు బదులుగా 10 నెలల పనులకు మాత్రమే అనుమతిస్తుందని, కార్మికులకు ఎంత వేతనం చెల్లించాలనే విషయంపై స్పష్టత లేదని, ఇలా చేయడం గ్రామీణ కార్మికులను బానిసత్వంలోకి నెట్టడమేనని తీర్మానంలో ఆయన విమర్శించారు.

ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక నాయకత్వాన బిజెపి సభ్యులు తక్షణం ఈ తీర్మానానికి తీవ్ర అభ్యంతరం తెలియజేశారు. ''ఈ సభ వ్యతిరేకిస్తోందని చెప్పకండి, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని తీర్మానంలో రాసుకోండి, మీరు రాసుకున్న తీర్మానంలో మమ్మల్ని కూడా భాగస్వాముల్ని చేయకండి''అని బిజెపి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బిజెపి సభ్యులు తీవ్రంగా అభ్యంతరం చెప్పినప్పటికీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన తీర్మానాన్ని చదవడం ఆపకుండా కొనసాగించారు. ప్రతిపక్ష సభ్యులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే చర్చల సందర్భంగా వాటిని ప్రస్తావించాలని సలహా ఇచ్చారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీకి పాల్పడిందని వారు ఆరోపించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com